ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 178 పేజీలు: 10+4 వెల: 6.50

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్‌కు స్వర్ణం
-'ఆట'లో





## 'హైడ్రా' రంగనాథ్‌ను తొలగించండి

### కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ పట్ల ఆగ్రహం

### ఆయన స్థానంలో సెక్రటరీ స్థాయి అధికారిని నియమించండి

### - సిఎస్‌ను ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్,జులై 27,ప్రభాతవార్త:** హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు ఆదేశించింది. సెక్రటరీ స్థాయి అధికారితో ఆ స్థానాన్ని భర్తీ చేయాలని సోమవారం లోతుకుంట భూముల వ్యవహారంలో జరిగిన వాదనల సందర్భంగా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లోతుకుంటలోని సర్వే నెంబర్ 1, 2 లలో ఉన్న 40 ఎకరాల భూములు శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్వాధీనంలో ఉన్నాయి. ఈ భూముల్లో హైడ్రా జోక్యం చేసుకొని ఫెన్సింగ్ వేసిందని, కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ లెక్కచేయకుండా హైడ్రా వ్యవహరిస్తోందని ఆ కంపెనీ కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌పై వరుస విచారణలు చేపట్టిన హైకోర్టు వాదనల సందర్భంగానూ పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నెల 20వ తేదీన శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ నరసయ్య కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు చేశారు. 40 ఎకరాల భూమి తమ కంపెనీకే చెందుతుందని కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేశారని కోర్టుకు తెలిపారు. దీంతో విచారణ సందర్భంగా హైడ్రాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు రంగనాథ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకురావాల్సిందిగా డిజిపిని ఆదేశిస్తామని పేర్కొంది. సాయంత్రంలోపు రంగనాథ్ విచారణకు హాజరవుతారని హైడ్రా తరఫు న్యాయవాది కోర్టును కోరడంతో అంగీకరించగా కోర్టుకు రంగనాథ్ హాజరయ్యారు. హైడ్రా తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. సర్వే నెంబర్ 1,2 లలో ఉన్న 40 ఎకరాల భూమిలో జోక్యం హైడ్రా జోక్యం చేసుకోదని ఎజి కోర్టుకు హామీ ఇచ్చారు. ఆతర్వాత అఫిడవిట్ దాఖలు చేయాలంటూ హైకోర్టు విచారణను >>2

రాజ్యాంగ స్ఫూర్తితోనే పనిచేస్తున్నా...
కోర్టు ధిక్కార కేసులను చట్టపరంగా ఎదుర్కొంటా
చెరువులు, ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నాం
- ఎవి రంగనాథ్ 2లో



రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్!
హైడ్రాతో లక్షన్నర కోట్ల విలువైన భూమిని రక్షించాం
ఢిల్లీలో ఉన్న సిఎంకు సమాచారమిచ్చిన అధికారులు 7లో



## లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

### ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### విపక్షాల రగడతో ఉభయసభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 27:** పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చించేందుకు అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అన్ని పార్టీలను ఆయన ఒప్పించినట్లు పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం కేంద్రసిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీ నిరోధక సవరణబిల్లును మంగళవారం చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని, స్పీకర్ ఓం బిర్లా చేపట్టిన చర్యలవల్ల ఫ్లోర్‌లీడర్లు ఆ చర్చకు ఒప్పుకున్నారని స్పీకర్ కార్యాల వర్గాలుప్రశ్నపత్రాల లీకేజీలు, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను కట్టడి చేయడానికి >>2

ప్రతి కుటుంబానికీ 'ఫ్యామిలీ రిజిస్టర్' సర్టిఫికెట్ 2లో



## నాలుగు రోజులు భారీ వర్షసూచన

### జగిత్యాలలో అత్యధికంగా 77.8 మి.మీ నమోదు

**హైదరాబాద్, జులై 27, ప్రభాతవార్త:**వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ జిల్లాల్లో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలంగాణ వెదర్ మ్యాన్ బాలాజీ అంచనా వేశారు. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ తూర్పు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, కొత్తగూడెం, మహబూబాబాద్, మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈ నెల 30వ తేదీ వరకూ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. అలాగే సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, >>2



సోమవారం ఢిల్లీలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్, సచిన్ సావంత్ తదితరులు

## కాంగ్రెస్‌లో వర్గపోరుపై హై కమాండ్ ఆగ్రహం

### 'సర్'పై నిర్లక్ష్యం సరికాదు.. ఓట్లపై ప్రత్యేక చర్చలు తీసుకోవాలని ఆదేశం

### ఢిల్లీలో వేణుగోపాల్‌తో భేటీ అయిన సిఎం రేవంత్, మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్, సావంత్

**హైదరాబాద్,జులై 27,ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్‌లో అంతర్గతంగా జరగుతున్న కుమ్ములాట, క్రమశిక్షణ రాహిత్యంపై ఎఐసిసి కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడమే కాకుండా ఒంటెద్దుపోకడలు మానుకోకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది. సోమవారం ఢిల్లీలో ఎఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో రాత్రి ఎనిమిదిన్నర వరకు తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత వ్యవహారాల సమావేశం జరిగింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ కెసి వేణుగోపాల్‌తో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో తెలంగాణ సంస్థాగత కార్యక్రమాలు ప్రభుత్వ,పార్టీ పనితీరుపై తీవ్రంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రభుత్వంను ఒక్కతాటిపై నడిపించాల్సిన వాళ్లు ముఠాలు,వర్గాలను ప్రోత్సహించేలా వ్యవహరించడంపై రాహుల్‌గాంధీ ఆగ్రహంతో ఉన్నారని ఇదే విధానం మానుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి >>2

## ఆగస్టు 17 నుంచి వర్షాకాల అసెంబ్లీ!

### వారం రోజులు సమావేశాలు జరిగే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై27:** తెలంగాణ రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టు 17 నుంచి ప్రారంభించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్ 26లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కూతురు పెండ్లి ఆగస్టు 20న లండన్‌లో జరుగనున్నది. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లండన్ వెళ్లే అవకాశంఉన్నది. ఈ నేపథ్యంలో 17న మొదలుపెట్టి మూడు రోజుల్లోనే ముగిస్తారా? లేక ఆగస్టు 24 నుంచి మొదలుపెడ్తారా? అనేది చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలుపెడ్తామని, ఈసమావేశాల్లో.. ఎంపీ, >>2

## నిన్న 'కాక్రోచ్'.. నేడు ఇ-20 జనతాపార్టీ

### స్వచ్ఛ పెట్రోలు కోసం ఉద్యమం

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) పుట్టుకొచ్చింది. సోషల్ మీడియా నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం చివరకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు సాగింది. ఇప్పుడు సిజెపి లాగే కొత్తగా ఇజెపి అంటే 'ఇ20 జనతా పార్టీ' పుట్టుకొచ్చింది. ఈ పేరుతో కొత్తగా డిజిటల్ ప్రచారం మొదలైంది. ఇ20 పెట్రోల్‌తో పాటు వినియోగదారులకు 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలనేది ఈ పార్టీ ప్రధాన డిమాండ్. ఇ20 జనతాపార్టీ ఇప్పటికే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రత్యేక అకౌంట్లు క్రియేట్ అయ్యాయి. >>2

## విజయ్ 'ఉద్యోగ' ఉత్తర్వులు కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

### కరూర్ తొక్కిసలాట బాధితులకు ఎలా ఇస్తారని ప్రశ్న

**మదురై, జులై 27:** సెప్టెంబర్ 2025లో 'తమిళగ వెట్రి కజగం' (టివికె) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ ప్రసంగించిన ఎన్నికల ర్యాలీ సందర్భంగా కరూర్‌లో జరిగిన విషాదకరమైన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం రద్దు చేసింది. >>2



## ఖరీఫ్ సీజన్‌కు సమృద్ధిగా ఎరువులు

### అక్రమాలకు పాల్పడిన 9మంది లైసెన్స్‌లు రద్దు

### మరో 28 మందికి షోకాజ్

### -కేంద్ర ఎరువుల మంత్రి నడ్డా



**హైదరాబాద్, జులై 27, ప్రభాతవార్త :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో ఎరువుల లభ్యత తగినంతగా ఉందని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జెపి నడ్డా స్పష్టం చేశారు. అలాగే ఎరువులు నల్లబజారు, వ్యవసాయతేర వాటికి దారి మళ్లింపు వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఏప్రిల్ నుండి ఈ నెల 20 నాటికి తెలంగాణలో ఎరువుల బ్లాక్‌మార్కెటింగ్‌కు సంబంధించిన కేసులలో 28 మంది డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే తొమ్మిది లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా మూడు సంఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబడినట్లు వివరించారు. అలాగే వ్యవసాయేతర వాటికి ఎరువుల దారిమళ్లింపునకు సంబంధించిన కేసులలో, మూడు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, రెండు లైసెన్సులు రద్దు చేసినట్లు చెప్పారు. ఒక ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారన్నారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాలతో సహా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎరువుల సకాలంలో సరఫరాను నిర్ధారించడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిన కాలానుగుణ డిమాండ్ ఆధారంగా ఎరువుల శాఖ రాష్ట్రానికి ఎరువులను కేటాయించిందని వివరించారు. ఎరువుల ఉత్పత్తి, లభ్యత మరియు రవాణాను పర్యవేక్షించడానికి ఎరువుల కంపెనీలు, రైల్వే, ఇతర భాగస్వాములతో క్రమం తప్పకుండా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల నిల్వలు, రవాణా మరియు అమ్మకాలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. డిమాండ్, లభ్యత ఆధారంగా, కంపెనీల ద్వారా ఎరువులను >>2



## వార్‌కు సడెన్ బ్రేక్!

### యుఎస్ వద్ద క్షిపణుల నిల్వలు తగ్గడమే కారణం!

### అమెరికా వెనక్కి తగ్గితే తాము కూడా అదేబాట అంటున్న ఇరాన్

**టెహ్రాన్,జులై 27:** పశ్చిమాసియాలో ఉద్రిక్తలు మరోసారి ఉవ్వెత్తున ఎగసిపడి ఉన్నట్లుండి చల్లారిపోయాయి. నిన్న మొన్నటివరకూ అమెరికా వరుస దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తే టెహ్రాన్ కూడా గల్ఫ్ దేశాల్ని టార్గెట్ చేస్తూ ప్రతీకార దాడులు చేపట్టింది. దీంతో మరోసారి పశ్చిమాసియా అగ్నిగోళంగా మారుతుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కానీ సడన్‌గా అమెరికా తమ దాడుల్ని నిలిపేసింది. దీంతో ఇరాన్ కూడా ఆశ్చర్యపోతోంది. అదే సమయంలో గల్ఫ్ దేశాలపై ప్రతీకార దాడుల్ని ఇరాన్ ఆపేసింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడుల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. అమెరికా తన దాడులను తాత్కాలికంగా ఆపివేయడంవల్లే తాము కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. దీంతో ఐదు నెలలుగా సుదీర్ఘంగా సాగుతున్న ఈ సైనిక పోరులో మరోసారి కాస్త విరామం లభించినట్లయింది. గత రెండు రాత్రులుగా అమెరికా ఎటువంటి దాడులకు దిగలేదని ఇరాన్ తెలిపింది. తాము మొదటి నుంచి కేవలం ప్రతిస్పందన వ్యూహాన్నే అమలు చేస్తున్నామని, అందుకే అమెరికా దాడులు ఆపగానే తాము కూడా ప్రతీకార చర్యలను నిలిపివేసినట్లు స్పష్టం చేసింది. అమెరికా మళ్లీ శత్రుత్వాన్ని ప్రదర్శిస్తే తాము తిరిగి దాడులు చేస్తామని టెహ్రాన్ తీవ్రహెచ్చరిక చేసింది. అయితే హఠాత్తుగా అమెరికా దాడులను నిలిపివేయడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఉన్నట్లు రక్షణ నిపుణులు భావిస్తున్నారు. వరుసగా రెండు వారాల పాటు రాత్రిపూట భీకర దాడులు నిర్వహించిన అమెరికా దళాల వద్ద వైమానిక రక్షణకు ఉపయోగించే పేట్రియాట్ వంటి >>2

## కెసిఆర్ హయాంలోనే చిన్న బోయిన సింగరేణి

### సంస్థకు తీవ్ర నష్టం కలిగించిన బిఆర్ఎస్ ప్రభుత్వం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై27:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సింగరేణి సంస్థను తీవ్రంగా మోసం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో పాటు ఎన్టీపీసీకి ఇది బొగ్గును సరఫరా చేస్తోందని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం సింగరేణిని వాడుకుని, దానికి తీవ్ర ఆర్థిక నష్టాన్ని చేకూర్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ సంస్థలో 49 శాతం వాటా, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందన్న ఆయన... కెసిఆర్ పాలనలో సింగరేణిని ఒక రాజకీయ వేదికగా మార్చేసి, దాని ఆదాయానికి కోలుకోలేని గండి కొట్టారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ సింగరేణి పరిస్థితిలో పెద్దగా మార్పు ఏమీ రాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, సింగరేణి పునరుద్ధరణకు, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ రెండు పార్టీల పాపం కారణంగా.. సింగరేణికి రూ.54 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థకూ ఇంతపెద్ద ఎత్తున బకాయిలు లేవు. తెలంగాణ సమాజమంతా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్‌లో కూరుకుపోయిన సింగరేణికి వాజ్‌పేయి ప్రభుత్వం సహకారం అందిం >>2



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్‌సింగ్ ధిల్లాన్

# రాజ్యాంగ స్ఫూర్తితోనే పనిచేస్తున్నా..

## కోర్టుధిక్కార కేసులను చట్టపరంగా ఎదుర్కొంటా: రంగనాథ్

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** నేను ఈ రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్‌గా రాజ్యాంగ స్ఫూర్తి ననుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21,48ఏ ప్రకారం ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు రక్షించడం జరిగిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్కెట్లో వీటి విలువ రూ. 1.50 లక్షల కోట్లు (17 బిలియన్ డాలర్లు) ఉంటుందన్నారు. ఆరు చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాం. మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. బడా బాబులు ఆక్రమించిన వందల చెరువులు, పార్కులు, వేల ఎకరాల ప్రభుత్వ భూములను హైడ్రా ఈ రెండు సంవత్సరాలలో వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగించింది. నిజం వైపు నిజాయితీగా నిర్భయంగా, నిబద్ధతతో పని చేస్తాం కాబట్టే హైడ్రాకు ధైర్యం. ల్యాండ్‌మాఫియా, భూ కబ్జా దారులు తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు. లోతుకుంట భూమి విషయంలో దాదాపు పదివేల కోట్ల రూపాయల భూమిని శాంతా శ్రీరామ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ కొట్టేయాలని చూసింది. పర్మిషన్స్ లేకుండా హెరిటేజ్ గుట్టలను బ్లాస్టింగ్ చేస్తూ వందల చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చల విడిగా విధ్వంసం చేసింది. పర్యావరణ వేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన కంప్లైంట్ మీద హైడ్రా రంగంలోకి దిగింది. ఎక్కడో మూడు కిలోమీటర్ల అవతల ఉందని చెబుతూ లేని భూమిని చూపిస్తూ, ఈ బిల్డర్ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి వచ్చి ఆక్రమించి నా మీద కంటెంప్ట్ కేసు వేయటం జరిగింది. ఇలా నా మీద 63 కంటెంప్ట్ కేసులు ఉన్నాయి.వాటిని వేసింది బడా భూ కబ్జా దారులే. బతుకమ్మ కుంట చెరువును మింగేయాలనిచూసిన ఒకరు, లోతుకుంటలో రూ.వేల కోట్ల ప్రభుత్వ భూమి ని కొట్టేయాలని ఇంకొకరు, సామాన్యుల ప్లాట్లు కొట్టేసి బడా కాంప్లెక్స్‌లు కట్టాలని చూస్తున్న వారు, వేల సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ప్లాట్స్ ను కొట్టేయాలని చూసిన వాళ్ల క్రిమినల్ మాఫియాగా చెలామణి అవుతూ రూ. వేల కోట్ల విలువైన సామాన్యుల ప్లాట్స్, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వ్యక్తులు... వీరందరికీ నేను హైడ్రా కమిషనర్‌గా అడ్డు పడడటమే నేను చేసిన తప్పు. వీళ్ళు అందరూ వేసిన కేసులే నా మీద ఉన్న 63 కోర్ట్ ధిక్కార కేసులు. వాటిని నేను చట్ట పరంగానే ఎదుర్కుంటాను. నాకు న్యాయస్థానాలు అంటే పూర్తి నమ్మకం. చట్టాల పట్ల గౌరవంతో పని చేస్తూ వస్తున్నాను. గతంలో, ఇప్పుడు, మున్ముందు ప్రభుత్వాలు ఏ బాధ్యతలు అప్పగించినా నేను నా వైపు నుంచి 100 శాతం ఫలితాలు ఇవ్వటమే లక్ష్యంగా ఉంటాను. అలాగే పని చేస్తున్నాను, భవిష్యత్తులో కూడా అదు నిబద్ధతతో పని చేస్తాను అన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం: మంత్రి దామోదర

## నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 27:** ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు వారి జిల్లాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్, డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, కోవ లక్ష్మి, రామారావు పవర్, అనిల్ జాదవ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కూడా నగరంలోని ప్రజలకు అందుబాటులో ఉన్న అన్నిరకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకోసం ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఐటిడిఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటళ్లలో దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.

గిరిజన ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికనే కాకుండా, ప్రజలు వైద్య సేవలు పొందేందుకు ప్రయాణించాల్సిన దూరాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ఆరోగ్య మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లను అవసరానికి అనుగుణంగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు ఆదిలాబాద్ రిమ్స్‌ను ప్రధాన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, కార్డియాలజి, నెఫ్రాలజీ, తదితర సూపర్ స్పెషాలిటీ సేవలను ఇప్పటికే ప్రారంభించామని, భవిష్యత్తులో అన్నిరకాల వైద్య సేవలను ఇక్కడే అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ ప్రభుత్వ హాస్పిటళ్లను దశలవారీగా బలోపేతం చేసి, ప్రజలు క్లిష్టమైన చికిత్సల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలను ఆయా జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అటవీ ప్రాంత జిల్లాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తతతో పనిచేయాలని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల డీఎంహెచ్‌వోలను మంత్రి ఆదేశించారు.

జిల్లాల్లోని అన్ని హాస్పిటల్స్‌లో అవసరమైన మందులు, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, వైద్య పరికరాలు తగినంత నిల్వ ఉండేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, డెలివరీ డేట్‌కు కనీసం వారం, పది రోజుల ముందే హాస్పిటళ్లలోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించాలని, హైరిస్క్ గర్భిణుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

# లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

>> ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈనెల 20న విద్యార్థులపై జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అటు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొడంతో ఉభయసభలకు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సంసద్ ఛలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారంటూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. విపక్షాల నిరసనల మధ్య మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత విద్యార్థులపై లాఠీఛార్జితో పాటు పలు అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ బిల్లు ప్రకారం లీకేజీకి పాల్పడి నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, 50 లక్షల ఫైన్ విధించనున్నారు. వాస్తవానికి ఇవాళ 5 గంటలకు ఆ బిల్లుపై చర్చ చేపట్టాలని భావించారు. కానీ విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ విపక్షలు సభలో నినాదాలు చేశాయి. దీంతో గందరగోళం మధ్య సభను మరుసటిరోజుకు వాయిదా వేశారు. సుమారు 6 గంటల పాటు బిల్లుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పరీక్షల సవరణ బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరపాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కీలక బిల్లును తీసుకొచ్చామని, కానీ కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చకు సిద్ధం కాకుండా సభలో అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన చర్యలను ప్రతిపక్షాలు గుర్తించాలని రిజిజు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని ఈ బిల్లును ఆమోదించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాలుగు గంటల చర్చ ఈ బిల్లుపై లోక్‌సభలో నాలుగు గంటలపాటు చర్చ నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) నిర్ణయించినట్లు సమాచారం. బిజెపి ఎంపీలు బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్యతోపాటు జేడీయూ, టిడిపి,శివసేన, ఎన్‌సిపి, అప్నాదళ్, ఎల్‌జెపి (రాంవిలాస్) తదితర పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొనే అవకాశం ఉంది.

**బిల్లులో ఏడు కీలక సవరణలు**

ఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది. పరీక్షల అక్రమాల దర్యాప్తు కోసం కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి. నేరస్థులకు మరింత కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీల్ చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.

# రంగనాథ్‌ను తొలగించండి

>> 23వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఎజి హామీ ఇచ్చినా హైడ్రా అధికారులు యంత్రాలతో మరోసారి తమ స్థలంలోకి వచ్చారని శాంతాశ్రీరామ్ కంపెనీ మధ్యంతర పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు హైడ్రాపై మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేట్ స్థలానికి బ్రిగేడియర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో 10 మంది ఆర్మీ జవాన్లతో రక్షణ కల్పించాలని ఆదేశించి ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్‌ను సూచించింది. అఫిడవిట్ దాఖలు చేస్తామని ఉత్తర్వులను వాయిదా వేయాలని ఎజి కోరగా కోర్టు ఒకరోజు గడువు ఇచ్చింది.

ప్రైవేట్ భూమిలో జోక్యం చేసుకోలేదని, పూర్తి స్థాయి అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం కోరడంతో అంగీకరించిన హైకోర్టు హైడ్రా కమిషనర్ క్షమాపణలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్ కోర్టులు, న్యాయవ్యవస్థపై తనకు ఎంతో గౌరవం ఉందని లోతుకుంటలోని సర్వే నెం 1,2లలో ఉన్న 40 ఎకరాల భూమిలోకి హైడ్రా వెళ్లలేదని, పిటీషనర్ అవాస్తవాలు పేర్కొన్నరని తెలిపారు.

**63 కోర్టు దిక్కరణ పిటిషన్లు దేనికి సంకేతం..**

హైడ్రాపైన 63 కోర్టు ధిక్కరణ పిటీషన్లు దాఖలు కావడం దేనికి సంకేతమని ప్రశ్నించిన కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం మంచి పరిణామం కాదన్నారు. కమిషనర్ తమ బలగం, యంత్రాలతో భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారని కానీ సామాన్యులు న్యాయంకోసం కోర్టులను ఆశ్రయించే హక్కు ఉందన్నారు. కోర్టు ఉత్తర్వులను అమలుపరిచే బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. హైడ్రా కేవలం ప్రభుత్వం ఆస్తుల రక్షణకే ఉందని, ప్రైవేట్ భూముల్లో జోక్యం చేసుకోవడానికి కాదని హైకోర్టు పేర్కొంది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ స్థానం నుంచి తప్పించి సెక్రటరీ స్థాయి అధికారిని వెంటనే నియమించాలని సిఎస్‌ను ఆదేశించారు. కాగా ప్రస్తుతం కమిషనర్ రంగనాథ్ కేరళటూర్‌లో ఉండగా..ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందని ఆసక్తిగా మారింది.

## ప్రతి కుటుంబానికీ 'ఫ్యామిలీ రిజిస్టర్' సర్టిఫికెట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై27:** తెలంగాణలో ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్' జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ పథకాలకు దరఖాస్తు చేసేటప్పుడు ఫ్యామిలీ వివరాల సమర్పణలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బంది దీంతో తొలగుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఐడి నెంబర్,ఫ్యామిలీ హెడ్, సభ్యులు, వారి ఆధార్, చిరునామా ఇందులో ఉంటాయి. ఇది కుటుంబానికి అధికారిక గుర్తింపు పత్రంగా ఉంటుంది అని వివరించింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించింది. పౌర సేవలను సులభతరం చేసే లక్ష్యంతో కుటుంబ రిజిస్టర్. రికార్డ్‌రూపంలో కుటుంబ వివరాలు అందుబాటులో ఉండేలా కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మీ సేవ కేంద్రం ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, మీ సేవ ఆన్‌లైన్ లేదా పోర్టల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

# హై కమాండ్ ఆగ్రహం

>> ఉంటుందని హెచ్చరికలు జారీచేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఇటీవల ఒక పోక్సో కేసు విషయంలో ప్రభుత్వం అనుసరించిన తీరుపై కూడా చర్చ వేడివేడిగా కొనసాగినట్లు తెలిసింది. ఒక మంత్రి శాఖలో ఆయనకు తెలియకుండానే విజిలెన్స్ దాడులు చేయడం, మరో మంత్రి శాఖలో ఒక ఎమ్మెల్యే రివ్యూచేయడం వంటి సమాంతర ప్రభుత్వ విధానాలు ఆచరించేలా ఎవ్వరు కూడా ప్రోత్సహించకూడదని హెచ్చరికలు జారీ చేసినట్లు పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. మరోవైపు 'సర్' కార్యక్రమాలు బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరిగిన సంస్థాగత కార్యక్రమాలపై కెసి వేణుగోపాల్ సంతృప్తి చేశారు..సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాలు పనితీరును కెసి వేణుగోపాల్ మెచ్చుకొన్నారు. ఓటర్ల జాబితాలో చోటు ఉండి మ్యాపింగ్ కానీ అనామలిస్ ఓట్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ముసాయిదా తయరైనా తుదిజాబితా వరకు చిన్న నిరక్ష్యం కూడా ఉండకూడదని వేణుగోపాల్ సూచించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఢిల్లీ ఇందిరా భవన్‌లో ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన సమావేశం కాబోతున్నారు. టిపిసిసి కో ఆర్డినేషన్ కమిటీతో సమావేశంలో పార్టీ సంస్థాగత కార్యక్రమాలు జరిగాయి.

# వార్‌కు సడెన్ బ్రేక్!

>> క్షిపణుల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు సమాచారం. సరిగ్గా ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వాషింగ్టన్‌లో పర్యటించనుండటంతో, రాయబార చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా ఈ విరామం ప్రకటించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలు జరుగుతున్నా అటు యెమెన్‌లో మాత్రం హౌతీ రెబెల్స్ హల్ చల్ చేస్తూనేఉన్నారు. ఇరాన్ మద్దతున్న హౌతీలు సౌదీ అరేబియా సరిహద్దులలోని ఆరామ్‌కో ఆయిల్ ప్లాంట్లపై వరుస క్షిపణి దాడులకు దిగాయి. గల్ఫ్ దేశాలపై పెరిగిన ఈ ముప్పును ఎదుర్కొనేందుకు సౌదీలో మొహరించిన గ్రీక్ రక్షణ దళాలు రెండు బాలిస్టిక్ క్షిపణులు, ఓ డ్రోన్ ను అడ్డుకున్నట్లు గ్రీస్ వాయుసేన వర్గాలు నిర్ధారించాయి.

## సమృద్ధిగా ఎరువులు

>> సరఫరా చేసి, ఇప్పటికే ఉన్న రిటైల్ పంపిణీ నెట్‌వర్క్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నిజామాబాద్, జగిత్యాల వంటి ప్రధాన వ్యవసాయ జిల్లాలతో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాలతో సహా, స్థానికంగా పెరిగిన డిమాండ్‌ను తీర్చడానికి అవసరమైన చోట అదనపు సరఫరాలు ఏర్పాటు చేయబడినట్లు నడ్డా వెల్లడించారు.

## దుబాయ్ విమానం అత్యవసర లాండింగ్

**జైపూర్,జులై 27:** దుబాయ్ నుంచి ముంబై వెళుతున్న ఇండిగో విమానంలో కలకలం రేగింది. విమానంలోని కార్గో విభాగంలో పొగలు రావడాన్ని గుర్తించిన పైలట్లు వెంటనే అప్రమత్తమై, విమానాన్ని గుజరాత్‌లోని రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో విమానంలో సిబ్బందితో సహా మొత్తం 194 మంది ప్రయాణికులు ఉండగా, వారందరూ సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## వారం - వర్జ్యం

28-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
చతుర్దశి సా.6.17,
పూర్వాషాఢ ము.1.09
వర్జ్యం : రా.9.58-రా.11.44
దు.ఉ.8.21-ఉ.9.13,
2)రా.11.50-రా.12.42
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**మిథునం:** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. భూముల క్రయ విక్రయాలతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది.

**కర్కాటకం:** పెట్టుబడులకు అనుకూల కాలం. సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**సింహం:** ఇంటి యందు శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. సంతాన విద్య విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

**కన్య:** వ్యవహారాలలో ఇతరుల జోక్యాన్ని ఆదిలోనే తుంచివేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది.

**తుల:** ఆలోచనలు ఫలిస్తాయి. కావు అనుకున్న మొండి వసులలో చలనం ఏర్పడుతుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అందరిలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. సాంకేతిక రంగంలోనివారికి అనుకూలంగా ఉంటుంది.వస్త్రలాభం.

**ధనుస్సు:** వివాదాస్పద అంశాలు ఎదురయి నప్పుడు సమాధానాలు ఇవ్వక మౌనం వహించండి. ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

**మకరం:** అన్ని విషయాలు నిబంధనలకు అనుగుణంగా జరగవని లౌక్యం అవసరమని గుర్తించి వ్యవహరించడం వలన లాభపడతారు.

**కుంభం:** మొండి ధైర్యంతో ఒకానొక ముఖ్య నిర్ణయం తీసుకుని అమలు చేస్తారు. దాని తాలూకు ఫలితాలు భవిష్యత్తులో అందుతాయి.

**మీనం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలలో నిదానం అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద భార్యతో కలిసి బాపూజీకి నివాళులర్పిస్తున్న వాంగ్‌చుక్

# ఆసుపత్రి నుంచి వాంగ్‌చుక్ డిశ్చార్జి

## రాజ్‌ఘాట్‌వద్ద బాపూజీకి నివాళులు

**న్యూఢిల్లీ,జులై 27:** సామాజిక కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ సోమవారం గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. తనను ప్రాణాలతో కాపాడిన మేదాంత హాస్పిటల్ వైద్య సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయన లడఖ్‌కు బయలుదేరే ముందు రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తారు. కాగా, ఇటీవల జరిగిన నీట్ వైద్య ప్రవేశ పరీక్షలో ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గతనెల 28న నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు.

26 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. సోనమ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో జూలై 18న ఆయనను పోలీసులు బలవంతంగా సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు తరలించారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు వాంగ్‌చుక్‌ను మేదాంత హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) 36 రోజుల పాటు చేపట్టిన ఆందోళనతో కేంద్ర విద్యా విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో సమస్య సద్దుమణిగిన విషయం తెలిసిందే.

# వర్షాకాల అసెంబ్లీ!

>> ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 యేండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సిఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు.

ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం సిఎంఒ ముఖ్యకార్యదర్శి ఎస్.శ్రీధర్ అసెంబ్లీకివచ్చి అక్కడ జరుగుతున్న పనులపై అసెంబ్లీ అధికారులతో సమీక్ష చేశారు.

# నేడు ఇ-20 జనతాపార్టీ

>> ఇంధనం విషయంలో కూడా వినియోగదారులకు తాము ఎంచుకున్న పెట్రోల్ కొనుగోలు చేసే హక్కు కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇ20ను అందుబాటులో ఉంచినా, దానితో పాటు 100 శాతం పెట్రోల్‌ను కూడా విక్రయించాలని కోరుతున్నారు. మా కార్లపై ప్రయోగాలు ఆపండి ఇంధనాన్ని ఎంచుకునే హక్కు భారతదేశానికి కావాలి మా వాహనాలు ప్రయోగ యంత్రాలు కావు. సంవత్సరాల ముందే పన్నులు చెల్లించి, మా కష్టార్జితంతో వాటిని కొన్నాము. మనది మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న దేశం, మరియు ఇంధన సామర్థం ప్లస్ వాహన పనితీరు మా రోజువారీ జీవనంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయి. అలాంటప్పుడు వాహన మాన్యువల్‌ను అనుసరించకుండా, మా ఇంజిన్లపై ఎందుకు ప్రయోగాలు చేస్తున్నారని ఇజెపి అడుగుతోంది. కొందరు వాహన యజమానులు 20 శాతం ఇథనాల్ కలిపిన ఇ20పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజన్లు దెబ్బతింటున్నాయని, మైలేజ్ తగ్గిందని ఆరోపిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇ20 జనతా పార్టీ పేరిట ఉన్న ఎక్స్ ఖాతాకు 13 వేలకుపైగా, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 8,800కుపైగా ఫాలోవర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

# కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

>> తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వనిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సి.వి. కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి పిటిషనర్ల వాదనను సమర్థించింది. అంతకుముందు, నియామక ఉత్తర్వులను పంపిణీ చేయడానికి జులైలో కరూర్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు అనుమతినిచ్చింది. అయితే, ఆ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కోర్టు అప్పుడే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ద్విసభ ధర్మాసనం సోమవారం విచారణ జరిపి విస్పష్ట తీర్పునిచ్చింది.

# చిన్న బోయిన సింగరేణి

>> చింది. రూ.684 కోట్ల అప్పుపై మారటోరియం విధించింది. సింగరేణి అభివృద్ధికి అదనంగా రూ.525 కోట్ల ఆర్థిక సహకారం అందించింది.

సహకార సమాఖ్య స్ఫూర్తితో సింగరేణి భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతర సహకారం అందిస్తోందన్నారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను 2015లో సింగరేణికి విద్యుదుత్పత్తి కోసం మోడీ సర్కారు కేటాయించింది. కెసిఆర్ ఏమాత్రం దీన్ని పట్టించుకోలేదు. ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోలేదన్నారు. తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్ కేటాయింపులో ఉన్న న్యాయపరమైన అంశాలను పరిష్కరించి సింగరేణికి వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో.. జై తెలంగాణ అన్న పాపానికి.. 369 మందిని పోలీసు తూటాలతో కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. చలో రాజ్ భవన్ పిలుపునిస్తే.. సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ధర్నా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. మెదక్ జిల్లా సదాశివపేటలో.. ఇలాగే కాల్చి చంపింది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ.. దీనిపై మాట్లాడాలి. జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తే.. వేలాది మందిని అరెస్టు చేసి ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రయత్నించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ పెట్టి పత్రికా స్వేచ్ఛను హరించి వేసి.. వేలాది మంది రాజకీయ నాయకులను జైల్లో పెట్టి, సామాజిక సంస్థలపై నిషేధం విధించి.. పౌరహక్కులను కాలరాసింది. అలాంటి కాంగ్రెస్ పార్టీకి.. ఇవాళ విద్యార్థుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు,

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యపద్ధతిలో వ్యవహరిస్తోంది. రైతు చట్టాల సమయంలోనూ.. రైతులతో మాట్లాడి బిల్లును వెనక్కు తీసుకుంది నరేంద్ర మోదీ ప్రభుత్వం. మొన్నటికి మొన్న విద్యార్థులతోనూ చర్చలు జరిపి పరిష్కారం కోసం కృషిచేశాం. రాజ్యాంగాన్ని కాలరాసే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తే.. ప్రజాస్వామ్య బద్ధంగా పరిష్కరించాం. తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ బలిదానాలు చేసుకున్న 1,200 మందిలో మెజారిటీ విద్యార్థులే. పార్లమెంటు ముందు యాదిరెడ్డి.. తన చావుకు, కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ కారణం అని లేఖ రాసి ఆత్మబలిదానం చేసుకున్నది మరిచిపోయారా? అని ప్రశ్నించారు.

# నాలుగు రోజులు భారీ వర్షసూచన

>> ఖమ్మం జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు, భువనగిరి, నల్గొండ జిల్లాల్లో చిరుజల్లులు పడతాయని పేర్కొన్నారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో 100 నుంచి 120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావొచ్చని తెలిపారు.

తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు మార్పులు చోటు చేసుకున్నాయి. గత 24 గంటల్లో తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో, రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. హైదరాబాద్‌లో మోస్తరు వర్షం నమోదు కాగా, జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఆకాశం మేఘావృతమై, తడి వాతావరణం కారణంగా హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరాలు ప్రకారం, సోమవారం పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు 22 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 33 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైన విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇది గణనీయమైన తగ్గుదలే. అలాగే రాష్ట్రంలోని జగిత్యాల, సంగారెడ్డి, రంగారెడ్డి సహా పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేటలో అత్యధికంగా 45.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జిల్లాల్లో అత్యధికంగా జగిత్యాలలోని మెట్‌పల్లెలో 77.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులతో కీలకచర్చలు



## తాడిచెర్ల-2 స్థానికులకు ఉద్యోగకల్పన చేస్తూ ప్రాజెక్టును వేగవంతం చేయాలి

### మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఎంపి గడ్డం వంశీకృష్ణ

**హైదరాబాద్ జులై 27, ప్రభాతవార్త:** తాడిచర్ల బొగ్గుగనిలో నిర్వాసితులయ్యే గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించాలని సింగరేణిలో పనిచేసి పదవీవిరమణ పొందిన కార్మికులకు కనిష్టంగా పదివేల పింఛను ప్రకటించాలని రాష్ట్ర కార్మిక, శిక్షణ ఉపాధి ఫ్యాక్టరీస్ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అభ్యర్థించారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ కార్మిక, శిక్షణ, ఉపాధి ప్యాక్టరీస్ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణతో కలిసి సోమవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఉపాధికల్పన, నైపుణ్యాభివృద్ధి, గనుల పురోగతి, మౌలిక వసతుల విస్తరణ, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముందుగా కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిసి తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు, కేంద్ర పథకాల అమలులో రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని కోరారు. అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌద రిని కలిసి యువతకు అత్యా ధునిక నైపుణ్య శిక్షణ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల అభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. తదనంతరం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి అత్యంత కీలకమైన తాడిచెర్ల-2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టు ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేసి, స్థానిక యువతకు కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సమగ్ర పునరావాసం, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస నెలవారీ రూ.10 వేల పెన్షన్ అందేలా కేంద్ర ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తక్కువ పెన్షన్‌తో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న వేలాదిమంది రిటైర్డ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని కోరారు. కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తాడిచెర్ల-2 ప్రాజెక్టు పనుల వేగవంతం, స్థానికులకు ఉద్యోగాల కల్పన, ఆర్‌అండ్‌ఆర్ అమలు, సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ అంశాలను సంబంధిత శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, 'తెలంగాణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ, కార్మికుల సంక్షేమం, గనుల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తాం. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం' అని పేర్కొన్నారు

## అబ్దుల్‌కలాం జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయం: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 27:** మాజీ రాష్ట్రపతి భారతరత్న ఎపిజె అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆ మహనీయుడికి వినమ్ర నివాళులర్పించారు. భారత అంతరిక్ష, క్షిపణి సాంకేతిక రంగాల అభివృద్ధిలో విశేష కృషిచేసి, రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో అబ్దుల్‌కలాం పాత్ర చిరస్మర ణీయమని స్మరించుకున్నారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యా యుడిగా వారు చూపిన నిబద్ధత, నిరాడంబర జీవనం, అసాధారణ ప్రతిభకు, అచంచలమైన దేశభక్తికి ప్రతీక అని, కలాం జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



రాంనగర్‌లో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న మంద కృష్ణ మాదిగ

## కుల వివక్ష, పేదరిక నిర్మూలనకు ఉద్యమిద్దాం

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జులై 27, ప్రభాతవార్త:** దేశంలో కుల వ్యవస్థ, పేదరికం వల్ల తీవ్రనష్టం జరుగుతోందని, వీటి నిర్మూలన కోసం భవి ష్యత్తు పోరాటాలకు సమాయత్తం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. సోమవారం రాంనగర్‌లోని బి.ఆర్. కన్వెన్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఇంజం వెంకట్‌స్వామి మాదిగ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ సుదీర్ఘకాలం సాగించిన రాజీలేని పోరాటం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, దీనివల్ల విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగ యువతకు గణనీయ మైన అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ పోరాటానికి అన్ని రాజకీయపక్షాలు, మేధావులు, సమాజం లోని అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలిపారని, అందుకే జాతి బాధ్యతతో పాటు సామాజిక బాధ్యత కూడా ఎమ్మార్పీఎస్‌పై ఉందన్నారు. దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తీవ్రఆందోళన కలిగిస్తున్నాయని, ఇవి దేశాభివృద్ధికి నిరోధకంగా మారాయని పేర్కొన్నారు. సంపదలో అన్ని వర్గాలకూ సమాన భాగస్వామ్యం కల్పించి కులవ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రంగాలతోపాటు ఆర్థికంగా, రాజకీయంగా మాదిగలు అట్టడుగుస్థాయిలో ఉన్నారని, వారి అభి వృద్ధితోపాటు పీడితవర్గాల సంక్షేమం కోసం భవిష్యత్తులో నూతన ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జిల్లా ఇన్‌ఛార్జి గోవింద్‌నరేష్ మాదిగ, ముషీ రాబాద్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయ కులు చిలక ఎల్లయ్యమాదిగ, ఎంఇఎఫ్ సీనియర్ నాయకులు గండి కృష్ణ మాదిగ, సీనియర్ నాయకులు ఎడవల్లి యాదయ్యమాదిగ, టి.వి. నరసింహ మాదిగ, డప్పు మల్లికార్జున్‌మాదిగ, మునిరాజు అరుణ్ కుమార్‌మాదిగ, వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు మాచర్ల ప్రభాకర్ ప్రభృతులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతికి కొత్త సారథి మారిపల్లి మాధవి

### ఫౌండర్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగనున్న కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 27:** తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. రెండు దశాబ్దాలుగా సంస్థను నడిపించిన కల్వకుంట్ల కవిత ఇకపై ఫౌండర్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలి బాధ్యతలను మారిపల్లి మాధవికి అప్పగించారు.

సంస్థ ప్రయాణంలో ఇది కొత్త అధ్యాయమని చెబుతున్న నాయకత్వం, తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలతో ముందుకు సాగుతామనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మారిపల్లి మాధవిని నియమిస్తూ కవిత సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

కొత్త నాయకత్వంలో జాగృతి మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవం, ఆత్మగౌరవ పరిరక్షణే జాగృతి ప్రధాన లక్ష్యమని కవిత పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో 2006లో ఈ సంస్థను స్థాపించినట్లు గుర్తు చేశారు. ఉద్యమానికి సాంస్కృతిక బలం చేకూర్చ డంలో జాగృతి కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణ ప్రత్యేకతను దేశవ్యాప్తంగా చాటి చెప్పేందుకు సంస్థ నిరంతరం కృషి చేసిందని చెప్పారు.

అదే స్ఫూర్తితో ముందుకూ ప్రయాణం కొనసాగుతుందని వెల్లడించారు. తెలంగాణ పల్లెలకే పరిమితమైన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి విశేష కృషి చేసిం దని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ ఉత్సవాల ద్వారా మహిళలను పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత ఈ సంస్థకే దక్కుతుందన్నారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమా లతో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు నిరంతరం పనిచేసిందని వివరించారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన కెసిఆర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జులై 27, ప్రభాతవార్త:** తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి సోమవారం సికింద రాబాద్ యశోద ఆసుపత్రికి బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చారు. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య స్థితిగ తులను డాక్టర్లు, కుటుంబసభ్యులను అడిగి తెలుసు కున్నారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జనగాం ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్‌రెడ్డిలతోపాటు కంటోన్మెంట్ తెలంగాణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్‌లతోపాటు బిఆర్‌ఎస్ ముఖ్య నేతలు పాల్గొని చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



సికిందరాబాద్ యశోద ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి పిటిషన్ విచారణ రేపటికి వాయిదా

### లైంగిక వేధింపుల కేసులో నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, జులై 27, ప్రభాతవార్త:** ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణా రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం జరిగిన విచారణ బుధవారానికి వాయిదా పడింది. సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికా రిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన అభియోగాలకు సంబంధించి ఉదయ్ కృష్ణారెడ్డిపై మొదట అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆ తరువాత దీనిని మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు)కు బది లీ చేయడం తెలిసిందే. డబ్ల్యుఎస్‌డబ్ల్యు డిసిపి లావణ్య జాదవ్ ఈ కేసును విచారిస్తున్నారు. మరోవైపు తనపై నమోదైన లైంగిక వేధింపుల కే సును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వారం రోజుల క్రితం విచారణ చేబట్టగా ఇది సోమ వారానికి వాయిదా పడింది.

ఈ కేసులో తనను పోలీసులు అరెస్టు చేయకుండా చూడాలని ఉదయ్‌కృష్ణారెడ్డి కోరగా అందుకు హైకోర్టు నిరాక రించడంతోపాటు ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది.

అయితే సోమవారం నాటి విచారణకు హాజరైన పోలీసు లు కేసు వివరాలు అందించేందుకు కొంత సమయం కావాలని కోరారు. దీంతో ఈ కేసు విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది.

కాగా ఈ కేసులో ఉదయ్ కృష్ణారెడ్డి నుంచి మరోసారి వాంగ్మూలం తీసుకునేందుకు డబ్ల్యు ఎస్‌డబ్ల్యు పోలీసులు రెండు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. పోలీసు అకాడమి నుంచి సస్పెండ్ అయిన తరువాత ఎస్‌ఆర్ నగర్‌లోని తన మిత్రుడి ఇంటి చిరునామాను ఇచ్చిన ఉ దయ్ కృష్ణారెడ్డి అక్కడ లేక పోవడంతో పాటు సెల్‌ఫోన్‌ను కూడా స్విచాఫ్ చేయడంతో అతని కోసం పోలీసులు గాలింపు చేబట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి తరపున హైకోర్టులో వాదించిన న్యాయవాదికి దీనికి సంబంధించిన సమాచారాన్ని అందించిన పోలీసులు అతన్ని వెంటనే తమ ఎదుట హాజరుపరచాలని కోరారు.



సోమవారం అసెంబ్లీని సందర్శించిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీష్‌మహానా దంపతులకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## అసెంబ్లీని సందర్శించిన యుపి స్పీకర్ సతీష్‌మహానా

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 27:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా, ఆయన సతీమణి అనితామహానాతో కలిసి సోమవారం అసెంబ్లీని సందర్శించారు. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్.. వారిని సాదరంగా కార్యాలయంలోకి ఆహ్వానించారు, ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంప తులను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి జ్ఞాపికను బహూకరించినారు. అనం తరం సతీష్‌మహానాతో గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఎథిక్స్ కమిటీతో పాటు అనేక కమిటీలు వేసి చట్టసభల్లో మరింత ప్రజాస్వామికరణ చేయడంతోపాటు పౌరులకు పారదర్శకంగా చట్టసభల్లో జరిగే అంశాలను వివరించడానికి చర్యలు చేపడుతున్నట్లు ప్రసాద్ వివరించారు. ఇరువురు స్పీకర్లు తెలంగాణ, ఉత్తరప్రదేశ్ శాసనసభల నిర్వహణపై ముచ్చటించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సెక్రటరీ వి.నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు సిఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 27:** వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని తెలిపింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయిందన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. చెరువుల సంరక్షణ పేరుతో హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా పేదల ఇళ్లను కూల్చివేశారని విమర్శించారు. శని, ఆది వారాల్లో వేలాది మంది పోలీసులతో వెళ్లి ఇళ్లను నేలమట్టం చేశారని అన్నారు. దుర్గం చెరువు సమీపంలోని సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇంటిపై మాత్రం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దోడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

## గువాహతి ఐఐటి విద్యార్థి అనుమానాస్పద మృతి



**గువాహతి, జులై 27:** గువాహతిలోలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో బీటెక్ మూడవ సంవత్సరం విద్యారి ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో శవమై కనిపించాడు. మృతుడిని ఒడిశాలోని పూరీకి చెందిన రితేష్ రాజ్ సింగ్‌గా గుర్తించారు. అతను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) విభాగానికి చెందిన విద్యార్థిగా గుర్తించారు. రితేష్ రాజ్ సింగ్ ఇటీవలే గోల్డ్‌మన్ సాక్స్‌లో ఇంటర్న్‌షిప్ సంపాదించాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గువాహటి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు పంపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యార్థులపై వ్యాఖ్యలు సిగ్గుచేటు

### బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి: ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, జులై 27, ప్రభాతవార్త:** విద్యార్థులపై బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విద్యార్థి లోకం పట్ల బీజేపీ నాయకుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. తమ హక్కుల కోసం న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్న విద్యార్థులపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం, 'కాల్చిపారేయాలి' అంటూ బాధ్యతా రాహిత్యంగా మాట్లాడడం అత్యంత అభ్యంతరకరం, సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి ప్రధానంగా విద్యార్థులకు తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉందన్నారు. విద్యార్థులను నేరస్థులుగా చిత్రీకరిస్తూ, వారిపై హింసను ప్రోత్సహించేలా మాట్లాడడం బీజేపీ నాయకుల ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు.

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన
ప్రణాళికా విభాగం

Fil No. 016616/HMDA/04326/SWBP/CMC/2026-REV

ఫైల్ నం. 008966/ GHMC/4423/SLP1/2022-BP, తేదీ: 28.12.2022 ప్రకారంగా, శ్రీ లేగాల విజయానంద్ రెడ్డి మరియు ఇతర ఇద్దరు వ్యక్తులు, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, శేరిలింగంపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 71/P, 72/P, 73/P లలో గల 37543.37 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నివాస భవన నిర్మాణానికి A నుండి G వరకు (7) ఏడు బ్లాకులు – ప్రతి బ్లాకులో 4 ఉమ్మడి బేస్‌మెంట్లు + గ్రౌండ్ ఫ్లోర్ + 47 పై అంతస్తులు; మరియు క్లబ్ హౌస్ – 4 ఉమ్మడి బేస్‌మెంట్లు + గ్రౌండ్ ఫ్లోర్ + 7 పై అంతస్తులు గతంలో అనుమతి పొందారు.
అనంతరం, శ్రీ లేగాల విజయానంద్ రెడ్డి మరియు ఇతర ఇద్దరు వ్యక్తులు తేదీ 28.03.2026 నాటి దరఖాస్తు ద్వారా, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, శేరిలింగంపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 71/P, 72/P, 73/P లలో గల 37543.37 చదరపు మీటర్ల సవరించిన నివాస బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి కోరారు. ఈ సవరించిన ప్రణాళికలో A నుండి G వరకు (7) ఏడు బ్లాకులు ప్రతి బ్లాకులో 4 ఉమ్మడి బేస్‌మెంట్లు + గ్రౌండ్ ఫ్లోర్ + 47 పై అంతస్తులు మరియు క్లబ్ హౌస్, 4 ఉమ్మడి బేస్‌మెంట్లు + గ్రౌండ్ ఫ్లోర్ + 11 పై అంతస్తులు ఉన్నాయి.
కావున, సదరు సవరించిన భవనానికి సంబంధించి ఫ్లాట్ యజమానులు / కొనుగోలుదారులు / ఒప్పందదారులు ఎవరైనా తమ అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే, ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి (15) రోజుల లోపు ఈ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించవచ్చు. నిర్ణీత గడువులోగా ఎటువంటి అభ్యంతరాలు లేదా సూచనలు అందకపోతే, శేరిలింగంపల్లి గ్రామం, శేరిలింగంపల్లి మండలం రంగారెడ్డి జిల్లాలోని సర్వే నంబర్లు 71/P, 72/P, 73/P లలో 37543.37 చదరపు మీటర్ల విస్తీర్ణం క్లబ్ హౌస్‌కు అదనపు పై అంతస్తులతో కూడిన సవరించిన నివాస బహుళ అంతస్తుల భవన నిర్మాణ అనుమతి కోసం చేసిన దరఖాస్తు పరిశీలించబడుతుంది. ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ ఆధారంగా పరిగణనలోకి తీసుకోబడుతుంది.

సం/- కొట్టాల యశ్వంత రావు, మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున
డైరెక్టర్ ప్లానింగ్, (CMC & GHMC) HMDA

DIPR.No.6859-PP/CL/Advt/1/2026-27, తేదీ: 27.07.2026

## 31 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

### 1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

### 3 నుంచి 8 వరకు వెబ్‌ఆప్షన్లు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐ సెట్-2026 కౌన్సెలింగ్‌ను ఈ నెల 31 నుంచి ప్రారంభించనున్నారు. ఆగస్టు 5 వరకు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ శ్రీదేవసేన విడుదల చేశారు. సోమవార ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఐ సెట్-2026 అడ్మిషన్స్ కమిటీ సమావేశం జరిగింది. తరువాత ఐ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 5 వరకు వివరాలను తెలుపుతూ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిసానతరు. ఆగస్టు 3 నుంచి 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశమించ్చారు. ఆగస్టు 11న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని కమిషనర్ తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. ఐ సెట్ పరీక్ష పరీక్ష ఫలితాలను జూన్ 5న విడుదల చేశారు. ఐ ఐసెట్ పరీక్షలో 91.22 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. బాలికల్లో 91.62 శాతం అర్హత సాధించగా, బాలురు 90.74 శాతం అర్హత సాధించారు.

ఐ సెట్ పరీక్షలను మే 13, 14 తేదీల్లో నిర్వహించారు. ఐసెట్‌కు 56,206 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 51,146 మంది పరీక్షలకు హాజర య్యారు. అందులో 46,654 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 91.22 శాతం మంది అర్హత సాధించారు. పరీక్షకు 30,299 మంది మహిళలు దర ఖాస్తు చేసుకోగా వారిలో 27,793 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 25,463 మంది(91,62శాతం) అర్హత సాధించారు.

25,907 మంది పురుషులు దరఖాస్తు చేసుకోగా వారిలో 23,353 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 21,191 మంది(90.74శాతం) అర్హత సాధించారు. తెలంగాణ వ్యాప్తంగా 16 రీజినల్ సెంటర్లలో, 69 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించారు. గత ఏడాది 71,746 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 64,938 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 58,985 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 90.51 శాతం అర్హత సాధించారు. రాష్ట్రంలో గత ఏడాది 287 ఎంబీఏ కాలేజీలు ఉండగా వాటిలో 40,601 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 35,141 సీట్లు భర్తీ అయ్యాయి. 80 ఎంసీఏ కాలేజీలు ఉండగా వాటిల్లో 9360 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో 5420 సీట్లు భర్తీ అయ్యాయాయి. ఆగస్టు 17 నుంచి ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ కొనసాగుతుందని కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ఆగస్టు 18న సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుంది. ఆగస్టు 18, 19 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. ఆగస్టు 22న సీట్ల కేటాయింపు చేసానతరు. ఆగస్టు 22 నుంచి 25 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని కమిసనర్ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 24న స్పాట్ అడ్మిషన్లకు మార్గదర్శకాలను జారీ చేయనున్నారు. కౌన్సెలింగ్ కోసం రాష్ట్రంలో 22 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ప్రకటనలో తెలిపారు.

## సంగ్రూర్ బిజెపి కార్యాలయంపై పెట్రోల్‌బాంబు దాడి



**సంగ్రూర్, జులై 27:** పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో బీజేపీ కార్యాలయంపై సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబుతో దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో కార్యాలయం బయటి గోడకు స్వల్పంగా మంటలు అంటుకుని కాలిన ఆనవాళ్లు కనిపించగా, ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి పెట్రోల్‌తో నింపిన గాజు సీసాను బీజేపీ కార్యాలయంపైకి విసిరాడు. ఆ సీసా భవనం బయటి గోడను తాకి మంటలు చెలరేగాయి.

అయితే మంటలు పెద్దఎత్తున వ్యాపించకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కీలక ఆధారాలను సేకరించారు. పెట్రోల్ బాంబుగా ఉపయోగించిన గాజు సీసా అవశేషాలను కూడా స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించే ప్రక్రియ చేపట్టారు.

దాడికి పాల్పడిన నిందితులను గుర్తిం చేందుకు బీజేపీ కార్యాలయం, ప్రాం తాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలి స్తున్నారు. దుండ గుడు ఒంటరిగా ఈ దాడికి పాల్పడ్డాడా లేక మరెవరైనా సహకరించారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనపై సంగ్రూర్ ఎస్పీ దివేంద్ర అత్రి మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. సంఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలను విశ్లేషిస్తు న్నామని, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించే ప్రయ త్నం జరుగుతోందన్నారు. 'బీర్ బాటిల్‌లో పెట్రోల్ నింపి దానిని పెట్రోల్ బాంబుగా మార్చి కార్యాలయంపైకి విసిరారు. నిందితులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తున్నాం. వారిని త్వరలోనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దివేంద్ర అత్రి వెల్లడిం చారు. ఘటనాస్థలికి ఫోరెన్సిక్ బృందాన్ని పంపించి ఆధారాలను సేకరి స్తున్నారు.

పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిందితులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై స్పందించిన బీజేపీ నేతలు, ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన దాడి అని ఆరోపించారు. పంజాబ్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై భగవంత్ మాన్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


వార్త

తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహసంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు.

- శామ్యూల్ జాన్సన్

# 'జై యువ'తకు సెల్యూట్!

ఎవరు అన్నా అనకున్నా ఇప్పుడు భారతీయ యువత ను అభినందించాల్సిన పరిణామాలే తారసపడుతున్నాయి. ఓ పక్కజీవితాల్లో వెలుగులు నింపాల్సిన ప్రభుత్వాలు ఇన్నాళ్లూ వారి వారి సొంత ఎజెండాలతో కాలక్షేపం చేసేస్తాయి. కొత్త తరపు ఆలోచనలను ఎవరైనా, ఎప్పుడైనా స్వాగతించవలసిందే. యువత తమ భవిత కోసం రోడ్డెక్కితే వారిని ఏలిన వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో విదేశీ నిధులు వస్తున్నాయనో, వారి వెనుక ఉండి ఎవరో నడిపిస్తున్నారనో ఒకవర్గం సామాజిక మాధ్యమాల్లో ఊదరగొడుతున్నాయి. అంటే ప్రశ్నించే వారు ఉండకూడదనేది వారి ఆంతర్యమా!? ప్రశ్నిస్తే తప్పా? మరెందుకలా ఉద్యమకారులపై బురద జల్లి యువత గొంతు నొక్కాలన్న ప్రయ్నత్న మంచిది కాదేమో? ఉద్యమకారుల్లో గత రాజకీయ నేపథ్యం ఉండడం నేరమా? వాళ్ళకి సిద్ధాంతాలు ఉండవా? ఉండకూడదా? అయినా యువ చైతన్యాన్ని ఎవరూ ఆపలేకపోయారు. నిజానికి అతి చిన్న వయసు లోనే ఈ తరం యువత పరిణితి చెందారు. ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకొని పట్టుసాధిస్తున్నారు. వాళ్లల్లో మేధాశక్తికి కొదువ లేదు. వారికి అనుభవం తక్కువని అనుకోవాలి తప్ప కొత్త తరంలో మానసిక పరివర్తనను ఏమాత్రం తక్కువ చేయలేం. వీధుల్లోకి వచ్చిన యువత ఆగ్రహం ఒక్క పరీక్ష గురించో, ఒక్క మంత్రి రాజీనామా గురించో కాదు. అది చాలా కాలంగా విద్యావ్యవస్థపై పేరుకుపోయిన అసంతృప్తి. తమ చదువుకు విలువ ఉందో లేదో? ఉద్యోగం వస్తుందో రాదో? భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనే ఆందోళన. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన 'నీట్' ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి వారి ఆకాంక్షలపై సానుకూలంగా స్పందించడం, తమకు తమ భవితవ్యమే తప్ప ఈ దేశ రాజకీయాలతో సంబంధం లేదని చెప్పడంలో యువత విజ్ఞత చెప్పుకోదగినది. అందుకే యువత వైఖరితో యావత్తు భారత దేశం ఊపిరిపీల్చుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద యువదేశం భారత్ . 2026 నాటికి భారత జనాభాలో 65 మంది 35 ఏళ్లలోపు వారు. 15-29 ఏళ్లమధ్య ఉన్న యువత 25కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోని ప్రతి 5గురు యువకుల్లో ఒకరు భారతీయుడు. దీన్నే 'యూత్ బుల్జ్ లేదా డెమోగ్రాఫిక్ డివిడెండ్' అంటారు. యువత ఎక్కువ, వృద్ధులు తక్కువ ఉన్నప్పుడు పని చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఉత్పత్తి, పొదుపు, పెట్టుబడి పెరుగుతాయి. 2026-2047 వరకు ఇదే భారత్ వికసిత్ భారత్‌గా మారేందుకు స్వర్ణావకాశం. జపాన్, చైనా, యూరప్ వృద్ధుల దేశాలుగా మారుతున్నాయి. 2030 నాటికి ప్రపంచానికి 12 కోట్ల మంది పనివారు కావాలి. ఆ ఖాళీని భారత యువత మాత్రమే భర్తీ చేయగలదు. భారత యువత ప్రపంచంలోనే అత్యంత ధైర్యవంతులు, ఆశావాదులు, టెక్ సావీ.వారికి సరైన విద్య, నైపుణ్యం, అవకాశం ఇస్తే వారు 'వికసిత్ భారత్'ని నిర్మించడమే కాదు, ప్రపంచాన్నే నడిపిస్తారు. ప్రతి ఏడాది కోటికి పైగా యువత డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. 2023-24లో సుమారు 1.1 కోట్ల మంది, 2024-25లో దాదాపు 1.2 కోట్ల మంది గ్రాడ్యుయేట్లు బయటకు వచ్చారు. కానీ వారందరికీ ఉద్యోగాల వేటలో తలపండిపోతోంది ఫలితం శూన్యం. 2000 నుంచి 2010 మధ్య దేశంలో ప్రతి ఏడాది సగటున రెండున్నర కోట్లమంది పిల్లలు జన్మించారు. ఆ తరం ఇప్పుడుఉపాధి కోసం బయటకు వస్తోంది. రాబోయే మరో 15 నుంచి 20 సంవత్సరాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఆర్థికవేత్తలు దీనినే "డెమోగ్రాఫిక్ డివిడెండ్"లేదా 'యూత్ బల్జ్' అంటారు. ఇది ఏ దేశానికైనా ఒక్కసారి మాత్రమే దక్కే అవకాశం. 2050 నాటికి ఈ అవకాశం క్రమేపీ ముగుస్తుంది.అంటే మరో పాతికేళ్లే భారత్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి ఏడాదిసంక్షేమ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, తయారీరంగం, చిన్న పరిశ్రమలపై కూడా భారీ పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చింది. యువత ఉచితాలు కోరుకోవడం లేదు. భారత్ ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆర్థికశక్తిగా నిలిపేయువతమనకు సొంతం.'జెన్ జీ' ఉద్యమ స్పందనతో యువశక్తిని సరైన దారిలో నడిపించి దేశభవితలో వారిని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక సందర్భంలో అభిప్రాయపడ్డారు. 'జై జవాన్', 'జై కిసాన్' లతో ముందుకుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ 'జై యువ' నినాదాన్ని కలుపుకొనిముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చినందున 21ఏళ్ల వయసుకే ఐఎఎస్, ఐపిఎస్‌లు అవుతున్నారు. అదేదారిలో యువతను పార్లమెంట్ తదితర చట్టసభల్లో భాగస్వాములు అయ్యేందుకు వీలుగాఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించే అంశంపైచర్చ పూర్తిస్థాయిలో కొనసాగాలని అభిలషించారు. అసెంబ్లీ, లోక్‌సభకు పోటీచేసే వయసు 21 సంవత్సరాలకు, రాజ్యసభ, శాసనమండలికి పోటీ చేసే వయసు 25 సంవత్సరాలకు తగ్గించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. యువతకు ఉద్యమాలతో పనిలేకుండా వారి ఆకాంక్షలను నెరవేర్చగలిగితే వారిలో అసంతృప్తి దూరమవుతుంది. యువతకు రాజకీయ నాయకత్వ అవకాశాలు ఇవ్వడమే కాదు ప్రజాసేవపట్ల నిబద్ధత ఉన్న వారికే ఆ అవకాశం దక్కేటట్లు చూస్తేనే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. అనేకరంగాల్లో యువత నిర్మాణాత్మక హోదాల్లో తమను తాము నిరూపించుకున్న యువతకు పాలనలో భాగస్వామ్యం కల్పించడంలోనూ ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదు. యువశక్తిని గుర్తించిననాడే వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరి వికసిత్ భారత్‌కు కొత్తదారి గోచరమవుతుంది.



నిన్నటి తప్పుల గురించి కాని, రేపు రాబోయే కష్టం గురించి కాని దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.

మహాత్మా గాంధీ



మనం ఎప్పుడూ ఏదో ఒకటి ఆశిస్తూనే ఉంటాం. ఆశ నెరవేరినా, నెరవేరకపోయినా మనిషిలో ఆశ చావదు. జీవితమే ఆశల వల.

సెసిల్

## ప్రజావాక్కు



### వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం

**పోటీ పరీక్షలు** లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి.అలాంటి పరీక్షల్లోప్రశ్నపత్రాల లీకేజీ జరగడంవల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్షపడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాలపాటు సాగుతుంటాయి. దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైన అభ్యర్థులు తీవ్రమానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య,ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రా ల రవాణా, నిల్వ ప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### హెల్త్ కార్డులు ఎవరికోసం?

**రాష్ట్ర ప్రభుత్వం** ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఈ విధానం ద్వారా తమకు హెల్త్‌కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.డిఎలు పిఆర్‌సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు కంగుతింటున్నారు.

- బి. దేవయ్య, హైదరాబాద్

### కూలీల రేట్లు నియంత్రించాలి

**సన్న చిన్నకారు** రైతుల వ్యవసాయ పనుల దృశ్య, సామాన్య ధరలు, ఆర్థికవ్యవస్థ,కూలీల రేట్లు అమాంతం వందలు వందలుగా విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారుతుంది. గ్రామంలో కమిటీలు వేసి ధరలను నియంత్రించాలి లేదంటే వ్యవసాయం చేసి వృథా. కూలీ రేట్లు తగ్గించి రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రజాస్వామ్యం గెలిచింది

**బొద్దింకల** దెబ్బకు 56 ఇంచిల బాహుబలి దిగివచ్చింది. ఈ దేశాన్ని మత రాజ్యంగా చేయాలనుకున్న వారికి చెంప దెబ్బ.'తమకున్న మతవాద బలంతో ఈదేశాన్ని రామరాజ్యంగా చెయ్యాలని పలుమార్లు ఊకదంపుడు మాటలు పలికే 56 ఇంచిల బాహుబలి బొద్దింకల దెబ్బకు దిగి రాక తప్పలేదు. బలవంతుమైన పాము చలి చీమల చేత చచ్చునట్లు మాకు తిరుగులేదు, మేము చెప్పిందే వేదం అనే రీతిలో నడుస్తున్న, ఎదురు తిరిగినవారిపై దేశద్రోహం కేసులు అంటూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం చివరికి దేశ యువతకు తలవంచక తప్పలేదు.నెహ్రూ ప్రాజెక్టులు కడితే, మోడీ దొంగబాబాల ఆశ్రమాలు, బాలరాముని గుళ్ళు, పటేల్ విగ్రహాలు కట్టారు. నెహ్రూ శాస్త్రీయ విద్య విద్యార్థులకు నేర్పితే, మోడీఇతిహాసాలు, పుక్కిటి పురాణాలు, అశాస్త్రీయ వాస్తు, జ్యోతిష్యాలు, మంత్ర తంత్రాలు, చేతబడులు, గాయత్రీమంత్రాలు,పాఠ్యాంశాలుగా పెట్టాడు.సైన్స్ కాంగ్రెస్ సదస్సులను మంత్రగాళ్ల సభలుగా మార్చారు.అహంకారంతో ఏదైనా చేస్తాం అనుకునే వాళ్లకు ఇది ఒక గొప్ప గుణపాఠం. ఇప్పటికైనా ప్రభుత్వాల తీరు మారాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఉద్యోగాల కోత

**ఇప్పటివరకు** ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. కొత్తగా జాయిన్ అయిన వాళ్ల కూడా ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయోననే భయపడుతున్నారు. నైపుణ్యం గలవారే ఎక్కువ కాలం ఉంటున్నారు. ఉద్యోగాలు కల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం ఏమిటి?

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### స్పెషల్ ప్రమోషన్లు ఇవ్వాలి

**తెలంగాణా** రాష్ట్రంలో ఉన్న వివిధ శాఖల వికలాంగుల ఉద్యోగులకు స్పెషల్ డిపార్టుమెంటు ప్రమోషన్స్ ఇవ్వాలి. ఉన్నత అర్హత, డాక్టరేట్ పట్టభద్రుల వికలాంగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి. వీరికి తప్పకుండా జి. ఓ 34 వర్తింపజేయాలి.దివ్యాంగులైన ఉన్నత ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పిస్తే వారికి కూడా గౌరవం దక్కుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సర్టిఫికెట్లు కాదు, విద్యార్థులకు నైపుణ్యం ముఖ్యం

*విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్ర మలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించడం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరిపోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రాల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే.*

డి.వి.బి శ్రీహరిన్

ఒకప్పుడు విద్య ఉద్యోగానికి మార్గం. నేడు విద్య ఉద్యోగానికి హామీ కాదు. ఇదే ఇరవై ఒకటో శతాబ్దపు అతి పెద్ద సామాజిక, ఆర్థిక వైరుధ్యం. ప్రతి సంవత్సరం లక్ష లాది మంది యువత డిగ్రీలు, పీజీలు, వృత్తిపరమైన అర్హ తలు సంపాదించి ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు.అయినప్పటికీ నిరుద్యోగం తగ్గడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు మాత్రం 'పనికి సిద్ధంగా ఉన్న నైపుణ్యం కలిగిన యువత దొరకడం లేదు' అని వాపోతున్నాయి. ఒకవైపు సర్టిఫికెట్లు పెరుగుతుంటే, మరోవైపు సామర్థ్యం కొరత కొనసాగుతోంది. సమస్య ఉద్యోగాల్లో లేదు. సమస్య విద్యలో లేదు, సమస్య ఈ రెండింటి మధ్య తెగిపోయిన సంబంధంలో ఉంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ నైపుణ్యాలను కోరుతున్న వేళ, మన విద్యా వ్యవస్థ ఇంకా సర్టిఫికెట్లను ఉత్పత్తి చేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు భారత ఉన్నత విద్య విస్తరణను చూడాలి. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ) ప్రకారం దేశంలో 4.3 కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో భారత్ ఒకటి. స్వాతంత్ర్యం తర్వాత విద్యను ప్రజలకు చేరువ చేయడంలో ఇది గొప్ప విజయమే. ఇది విద్యఅందుబాటులోకి వచ్చిందనే విజయాన్ని సూచిస్తుంది. కానీ అదే విద్య ఆర్థికవ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలుగా మారకపోవడమే అసలు ఆందోళన. అందుకే విద్యా విస్తరణ, ఉద్యోగ యోగ్యత విస్తరణగా మారలేదు. ఇండియా స్కిల్స్ రిపోర్టు ప్రకారం సుమారు సగం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే పరిశ్రమలకు వెంటనే ఉపయోగపడే స్థాయిలో ఉన్నారు. అంటే సమస్య చదువుకున్న వారి సంఖ్యలోలేదు. వారు సంపాదించిన విద్య, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన సామర్థ్యంగా మారకపోవడంలో ఉంది. ఇక్కడే డిగ్రీల ద్రవ్యోల్బణం అనే భావన ప్రాధాన్యం సంతరించుకుం టుంది. ద్రవ్యోల్బణంలో కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గినట్లే, డిగ్రీలు విపరీతంగా పెరిగినప్పుడు వాటి ప్రత్యేకత కూడా తగ్గుతుంది.ఒకప్పుడు ఇంటర్ లేదా డిప్లొమాతో లభించిన ఉద్యోగానికి ఇప్పుడు డిగ్రీ అవసరమవుతోంది. నిన్న డిగ్రీ సరిపోతే, నేడు పీజీ కోరుతున్నారు. ఉద్యోగ స్వభావంఅంతగా మారకపోయినా, విద్యార్హతలు మాత్రం పెరుగుతున్నాయి. డిగ్రీలు జ్ఞానాన్ని కొలిచే సాధనంగా కాకుండా, అభ్యర్థులను వడపోసే సాధనంగా మారుతున్నాయి. ఆర్థిక శాస్త్రంలో 2001 నోబెల్ బహుమతి గ్రహీత మైకేల్ స్పెన్స్ ఈ పరిస్థితిని దాదాపు అర్థశతాబ్దం క్రితమే వివరించాడు. ఉద్యోగం ఇవ్వబోయే సంస్థకు అభ్యర్థి నిజంగా ఎంత సమర్థుడో ముందుగానే తెలుసుకోవడం సాధ్యం కాదు. అందుకే అది డిగ్రీని ఒక సంకేతంగా ఉపయోగిస్తుంది. మంచి డిగ్రీ అంటే నేర్చుకునే సామర్థ్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న వ్యక్తి అని భావిస్తుంది. కానీ అదే డిగ్రీ లక్షల మందికి వచ్చినప్పుడు ఆ సంకేతం బలహీనపడుతుంది. అప్పుడు మరింత ఉన్నత విద్యార్హతలను కోరడం ప్రారంభమవుతుంది. ఇదే డిగ్రీల ద్రవ్యోల్బణానికి మూల కారణం.సమస్య విద్యార్థుల్లోలేదు. విద్యను ఎంపిక ప్రమాణంగా ఉపయోగించే వ్యవస్థలోఉంది. ఆర్థిక శాస్త్రంలో 1992 నోబెల్ బహుమతి గ్రహీత గ్యారీ బెకర్ విద్యను మానవ మూల ధనంగా అభివర్ణించాడు. యంత్రాల్లో పెట్టుబడి పెడితే ఉత్పత్తి పెరిగినట్లే, విద్యపై పెట్టుబడి పెడితే మనిషి ఉత్పాదకత పెరగాలి. కానీ విద్య సామర్థ్యాన్ని పెంచకుండా కేవ



లం సర్టిఫికెట్‌ను మాత్రమే ఇస్తే, అది మానవ మూలధనంగా మారదు. నేడు భారత్ ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. మనం విద్యలోపెట్టు బడి పెడుతున్నాం, కానీ ఉత్పాదకతలో అదే స్థాయి పెరు గుదల కనిపించడం లేదు. డిగ్రీల సంఖ్య పెరుగుతోంది. కానీ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అదే వేగంతో పెరగడం లేదు. అందుకే విద్య విస్తరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మానవ మూలధనం అదే వేగంతో పెరగడం లేదు. ఇది కేవలం విద్యావ్యవస్థ వైఫల్యం కాదు. ఇది సమాజం నిర్మించుకున్న ఒక ఆలోచనా విధాన ఫలితం. దశాబ్దాలుగా భారతీయ కుటుంబాల్లో 'మంచి డిగ్రీ అంటే మంచి ఉద్యోగం' అనే సమీకరణ బలంగా స్థిరపడింది.పాఠ శాలలు మార్కుల కోసం, కళాశాలలు డిగ్రీల కోసం, విద్యా ర్థులు ఉద్యోగాల కోసం పరుగు తీశారు. కానీ ప్రపంచఆర్థిక వ్యవస్థ అంతలోనే మారిపోయింది. నేడు ఉద్యోగదాత అడుగుతున్న ప్రశ్న 'ఏ డిగ్రీ చేశావు?' కాదు. 'ఏం చేయగలవు?' అన్నది. ఈ మార్పును మరింత వేగవంతం చేసింది కృత్రి మ మేధ. గత పారిశ్రామిక విప్లవాలు శారీరక శ్రమను భర్తీ చేశాయి. కానీ కృత్రిమ మేధ విశ్లేషణ, సమాచార ప్రాసెసింగ్, పునరావృత మేధోపరమైన పనులను కూడా స్వీకరిస్తోంది. అందువల్ల పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడం కంటే, సమస్యలను కొత్త కోణంలో చూడడం, వేగంగా నేర్చుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం, విభిన్న రంగాల జ్ఞానాన్ని అనుసంధానించడం వంటిసామర్థ్యాలే ఎక్కువ విలువ పొందుతున్నాయి. ప్రపంచ ఆర్థిక నివేదిక విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్‌జాబ్స్ రిపోర్టు-2025 ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబించింది. 2030నాటికి ఉద్యోగాలకు అవసరమైన ప్రధాన నైపుణ్యాల్లో దాదాపు 39శాతంమార్పు వస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది. అదే సమయంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడగా, 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ గణాంకాలు ఉద్యోగాల సంక్షోభాన్ని కాదు, నైపుణ్యాల సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచం ఇప్పుడు డిగ్రీల ఆధారంగాకాదు, నైపుణ్యాల ఆధారంగా మానవ వనరులను అంచనా వేయడం ప్రారంభించింది. భారత్‌కు ఈమార్పు మరింత కీలకం. ప్రతి సంవత్సరం ఒక కోటినుంచి 1.2కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఇదే మన జనాభా ప్రయోజనం. కానీ నైపుణ్యాలుగా మారని విద్య ఈజనాభా ప్రయోజనాన్ని నిరుద్యోగ భారంగా మార్చేప్రమాదం ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు వేల సంఖ్యలో ఇంజినీర్లు, పీజీలు దరఖాస్తు చేస్తుండగా, మరోవైపు పరిశ్రమలు శిక్షణ పొందిన వెల్డర్లు, యంత్ర నిర్వహణ నిపుణులు, డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, కృత్రిమ మేధ ఇంజినీర్ల కోసం వెతుకుతున్నాయి. చదువుకున్న నిరుద్యోగం, నైపుణ్యాల కొరత ఒకేసారి కనిపించడం కంటే పెద్ద హెచ్చరిక ఇంకేముంటుంది? విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. నైపుణ్యం ఆ జ్ఞానాన్ని ఆర్థిక విలువగా మారుస్తుంది. ఈ రెండింటిమధ్య సంబంధం తెగిపోయినప్పుడు డిగ్రీల ద్రవ్యోల్బణం ప్రారంభమవుతుంది. అందుకే సంస్కరణలు కూడా విద్యార్థులతో మొదలై విద్యార్థుల దగ్గరే ముగియ కూడదు. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించ డం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరి పోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రా ల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే. •

# డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థకు మరింత భద్రత

సి.హెచ్.ప్రతాప్

సాంకేతిక విప్లవం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా రూపాంతరం చెందిస్తోంది. ఒకప్పుడు వస్తు మార్పిడి విధానం నుంచి నాణేలు, కాగితపు నోట్లు,బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపుల వరకు అభివృద్ధి చెందినద్రవ్య వ్యవస్థ ఇప్పుడు కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ యుగంలోకి అడుగుపెట్టింది. ఈ మార్పులో భాగంగానే భారతీయ రిజర్వ్ బ్యాంకు డిజిటల్ రూపాయిని ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారంచుట్టింది. డిజిటల్ రూపాయి అనేది మనం వినియోగించే కాగితపు నోట్లకు డిజిటల్ రూపం. ఇది సాధారణ డిజిటల్ చెల్లింపు విధానాలైన యూపీఐ లేదా మొబైల్ వాలెట్లతో సమానం కాదు. యూపీఐలో ఒక బ్యాంకు ఖాతా నుంచి మరొక ఖాతాకు నిధులు బదిలీ అవుతాయి. అయితే డిజిటల్ రూపాయి విషయంలో డబ్బు స్వరూపమే డిజిటల్‌గా ఉంటుంది. ఇది నేరుగా ఆర్‌బీఐ జారీచేసే చట్టబద్ధమైన అధికారిక కరెన్సీ కావడంతో భౌతిక నగదుకు సమానమైన విశ్వసనీయతను కలిగి ఉంటుంది. డిజిటల్ రూపాయి వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. కరెన్సీనోట్ల ముద్రణ,రవాణా, భద్రత, నిర్వహణ వంటి వ్యయాలు తగ్గుతాయి. లావాదేవీలు వేగంగా, సులభంగా పూర్తవడంతో సమయం ఆదా అవుతుంది. నగదు వినియోగం తగ్గడంవల్ల నకిలీ నోట్ల సమస్యను నియంత్రించడంతో పాటు ఆర్థికవ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. చిన్న మొత్తాల చెల్లింపుల నుంచి పెద్ద లావాదేవీల వరకు దీన్ని వినియోగించే అవకాశం ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం హోల్‌సేల్ డిజిటల్ రూపాయి, సాధారణ ప్రజల కోసం రిటైల్ డిజిటల్ రూపాయిని ఆర్‌బీఐ దశలవారీగా ప్రవేశపెడుతోంది. డిజిటల్ రూపాయి వ్యాపార రంగానికి కూడా మేలు చేస్తుంది. నగదు నిర్వహణ ఖర్చుతగ్గడం, తక్షణ చెల్లింపులు, మెరుగైన నగదు ప్రవాహం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పన్నుల వసూళ్లు, ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరగడానికి కూడా ఇది తోడ్పడుతుంది. భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపులను మరింత వేగవంతంగా, తక్కువ వ్యయంతో నిర్వహించే అవకాశాలను కూడా ఇది విస్తరించగలదు. అదేవిధంగా, డిజిటల్ రూపాయి డిజిటల్ ఇండియా, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ వంటి జాతీయ లక్ష్యాలకు మరింత బలం చేకూరుస్తుంది. బ్యాంకింగ్ సేవలు పూర్తిగా అందని ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలను విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు వేగంగా,పారదర్శకంగా అందించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే డిజిటల్ కరెన్సీ విజయవంతం కావాలంటే కొన్ని సవాళ్లనుఅధిగమించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్‌మౌలిక సదుపాయాల విస్తరణ, సైబర్ భద్రత బలోపేతం,ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు,వినియోగదారుల గోప్యత పరిరక్షణ వంటి అంశాలకు అధికప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహన ఉన్నవర్గాలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ రూపాయిని బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలతో పోల్చడం సరైందికాదు. క్రిప్టోకరెన్సీలు మార్కెట్ ఆధారంగా విలువ మారే ప్రైవేట్ డిజిటల్ ఆస్తులు కాగా, డిజిటల్ రూపాయి భారతీయ రిజర్వ్ బ్యాంకు జారీ చేసే అధికారిక చట్టబద్ధకరెన్సీ. ప్రపంచంలోని అనేకదేశాలు కేంద్రబ్యాంకు డిజిటల్ కరెన్సీలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో,భారత దేశం కూడా ఈ రంగంలో ముందంజలో నిలుస్తోంది.డిజిటల్ కరెన్సీ సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది. సమర్థవంతమైన నియంత్రణ, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, బలోపేతమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, ప్రజల విశ్వాసం కలిసి నడిస్తే డిజిటల్ రూపాయి భారత ఆర్థిక వ్యవస్థను మరింత ఆధునికంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. •

# బాధ్యత కలిగిన యువతతోనే దేశ భవిష్యత్తు


దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో వివిధ వైద్య కళాశాలలో వైద్య కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం పరీక్ష కంటే ముందుగానే బయటికి రావడం గత కొంతకాలం నుండి పెద్ద దుమారాన్నే రేపింది. ఈ క్రమంలో అభ్యర్థుల నుండి మొదలైన నిరసనలు క్రమ క్రమంగా అధికమై దేశంలో యువతరం వరకు వ్యాప్తి చెంది పరీక్ష లీక్ తీరుపై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం ప్రభుత్వాన్నీ ఆలోచనలో పడవేయడం, యువత చేసిన నిరసనలో భాగంగా ఆ శాఖను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రితప్పని పరిస్థితుల్లో యువత కోరుకున్న విధంగానే రాజీనామా చేయవలసిన పరిస్థితి రావడం ఇదంతా ఒక ఎత్తు అయితే, యువత జరిపే నిరసనతో ప్రభుత్వమే దిగి రావడం యువత అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదనే ఇలాంటి విషయం ఎల్లప్పుడు ప్రతి ఒక్కరు గుర్తించుకొనే విధంగా మిగిలిపోవడంతో ఇకపై అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారి తీరు మారాల్సిన అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులు కూడా యువతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. పరీక్ష విధానంలో కూడా పారదర్శకత కలిగిన విధానంతో సరికొత్త సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తే భారతదేశంలో నవతరం నిరంతరం దేశ పరిణామాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గోచరిస్తుంది. ప్రధానంగా ప్రభుత్వాలు విధానపరమైన కఠినమైన చర్యలు తీసుకోకపోవడం, జాగ్రత్తలు పాటించకపోవడం వలన అవినీతి అక్రమాలు లాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయనే విషయాలు ఎంతో కాలం నుండి చదువుకున్న యువతలో ఎంతో కొంత అశాంతికి అలజడికి కారణం అవుతున్నాయి. ఈ అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత పార్టీలకతీతంగా తొలిసారిగా బయటికి వచ్చి నీట్ ప్రవేశ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా దేశంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా మొదట ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వంలోని సంబంధిత శాఖ మంత్రులు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో దేశంలోని యువత మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ సందేశాల పురోగతి అతివేగంగా జరగడంతో చాలామంది తొలిసారిగా యువతను మేల్కొలిపే విధంగా గ్రూపులను రూపొందించుకుని సమస్యలపై స్పందించేందుకు నిర్భయంగా యువతరం నేడు ప్రభుత్వాలను నేరుగా ప్రశ్నిస్తున్నది అంటే ప్రభుత్వాలు ఎంతో కొంత యువతరం ఆలోచనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విధంగా దేశంలోని యువతరానికి జరు



గుతున్న నష్టాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాకుండా ఎన్నుకున్న ప్రభుత్వాల అజెండా అమలు విధానాల పైన కూడా రాబోవు కాలంలో యువత ప్రశ్నించేందుకు వెనుకాడదేమో. ఏ విషయంలోనైనా సమాజానికి భంగం వాటిల్లే క్రమంలో అందుకు సంబంధించిన వారు ఎవరైనా జవాబుదారీతనంగాఉండాల్సి వస్తుంది అనేచర్చ జరుగుతుంది. నేటి యువత రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాదులు అలాంటి యువత భారతదేశ సమైక్యతను దేశభక్తి సమగ్రతతోపాటుజాతీయ వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. అలాంటి యువతరం భారతదేశం ఉన్నతికి భద్రతకు వెన్నంటి ఉంటారు అనేది అక్షరసత్యం. అందుకు ప్రభుత్వాలు కూడా దేశ భవిష్యత్తులో కీలకంగా మారనున్న యువత సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కాలయాపన చేయకూడదనే విషయంపై అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. విద్యావంతులు చదువుకున్న వారు భారత దేశంలో ఎక్కువ అవుతున్నారు. దేశంలో ఎలాంటి అంశాల్లోనైనా లోపాలు కనపడితే ప్రశ్నించేందుకు నేటితరం యువత సిద్ధంగా ఉంటుందని, లోపాలను సవరించే వరకు జవాబుదారీతనం వచ్చేంతవరకు నిరసన వ్యక్తం అవుతుందని, తలచుకుంటే సాధించేందుకు యువతరానికి ఏది అడ్డు లేదని చెప్పే రీతిలో యువతరం దేశవ్యాప్తంగా చేసిన శాంతియుత నిరసన విధానాలు చెప్పకనే చెప్తున్నాయి. నేటితరం యువతరం ప్రశ్నించే విషయాలను నిజానిజాలను విశ్లేషించుకోవాలి, నిర్ధారణ చేసుకోవాలి. సరైన విధానం ఉంటే దాన్ని తప్పనిసరిగా అమలు చేసే విధంగా సమస్య కఠినతరం కాకుండా యువతరాన్ని కూడా కలుపుకుపోతూ వారి అభిప్రాయాన్ని కూడా స్వాగతించాల్సిన అవసరం కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు ఉండాల్సిందేమో. ఈ క్రమంలో దేశ పరిస్థితుల విషయాలపై యువత మేల్కొని అప్రమత్తంగా ఉంటుందని పాలకులు అందించే విధానాలను నిరంతరం గమనిస్తూ సమాధానం కొరకు నిరంతరం ప్రశ్నిస్తామంటూ ముందుకు వస్తున్న యువతరానికి పాతతరం అనుభవాల సారం కూడా భవిష్యత్ భారత దేశ యువతకు దిశా నిర్దేశం ఆధిక్యత మార్గదర్శకం అవుతాయని భావించే వారు లేకపోలేదు. యువత ఐక్యత రాగానికి సంబంధించి ప్రభుత్వ ప్రజాపాలనలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత పరిపాలనా ప్రతినిధులు బాధ్యత వహించవలసి ఉంటుందనే సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. దేశ సమగ్రతకు దేశ భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా యువత మంచి ఆలోచన విధానాలు న్యాయ సమ్మతమైనవి అయితే పార్టీలకు రాజకీయాలకతీతంగా యువత ప్రశ్నిస్తే దానికి తప్పనిసరిగా జవాబుఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందేమో. రాబోవు కాలంలో ఎలాంటి ప్రభుత్వాలు వచ్చినా యువతకు నష్టం చేసే ప్రతి అంశాన్ని జాగ్రత్తతో ఆచితూచి ఆలోచించి ముందుగానే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారేమో. ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత పారదర్శకమైన పాలన విధానాలు అనుసరించడమే కాకుండా ప్రతి అంశంలో జవాబుదారీతనాన్ని ప్రదర్శించడంతో పాటు అడపాదడపా తలెత్తుతున్న సమస్యలపై యువత చేస్తున్న నిరసనలపై స్పందించి ఆచితూచి సమయానుకూలంగాసరైన సమయంలో వివరణ ఇచ్చేందుకు తరచూ ప్రయత్నించి సఫలం కావడం ఒకఎత్తు. దేశభక్తి భారతదేశ జాతీయ సమైక్యత సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరిస్తున్న తీరు మరొక ఎత్తుకావడం దేశ భవిష్యత్తుకు శుభపరిణామమే. •

# మీ గుండె 'లయ' తప్పుతోందా?




**న్యూఢిల్లీ, జులై 27:** గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో దడ, లేదా కారణం లేకుండా ఆయాసం రావడం వంటి లక్షణాలను చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, ఇవి ఏట్రియల్ ఫిబ్రిలేషన్ అనే ఏఎఫ్ అని పిలిచే తీవ్రమైన గుండె జబ్బుకు సంకేతాలు కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైన ఈ గుండె లయ రుగ్మత, నివారించగలిగే పక్షవాతానికి ఒక ప్రధాన కారణంగా మారుతోంది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో సుమారు 80 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారు. వృద్ధాప్యం, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరగడంతో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టోఫర్ గ్రాంగెర్ ప్రకారం, గుండె పై గదుల్లో అసాధారణమైన ఎలక్ట్రికల్ సంకేతాలు ఏర్పడినప్పుడు ఏట్రియల్ ఫిబ్రిలేషన్ సంభవిస్తుంది. దీనివల్ల గుండె పై గదులు ఒక క్రమపద్ధతిలో కాకుండా అస్తవ్యస్తంగా, వేగంగా కొట్టుకుంటాయిఅని ఆయన వివరించారు. కొంతమందిలో గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే చాలా మందిలో ఇది సైలెంట్ ఏఎఫ్‌గా ఉంటుంది. అంటే, ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించవు. తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే వరకు ఈ వ్యాధి ఉన్నట్టు కూడా తెలియదు. అసాధారణ గుండె లయను గుర్తించే స్మార్ట్‌వాచ్‌ల ద్వారా కూడా ఈ పరిస్థితిని ముందుగా పసిగట్టే అవకాశం ఉందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల ఎదురయ్యే అతిపెద్ద ప్రమాదం పక్షవాతం. గుండె గదులు సరిగా సంకోచించనప్పుడు, రక్తం అక్కడే నిలిచిపోయి గడ్డకట్టే అవకాశం ఉంది. ఈ రక్తం గడ్డకట్టిన ముక్క మెదడుకు ప్రయాణించి రక్తనాళాలను అడ్డుకుంటే, ఇస్కీమిక్ స్ట్రోక్ (పక్షవాతం) వస్తుంది. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల పక్షవాతం వచ్చే ప్రమాదం ఐదు రెట్లు పెరుగుతుందని, ప్రతి ఐదు పక్షవాత కేసులలో ఒకటి దీనితో సంబంధం కలిగి ఉంటుందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఈ రకమైన స్ట్రోక్స్ చాలా తీవ్రంగా ఉండి, శాశ్వత అంగవైకల్యానికి దారితీస్తాయి. ఏఎఫ్ సంబంధిత పక్షవాతాన్ని నివారించడానికి యాంటీకాగ్యులెంట్లు అంటే రక్తాన్ని పలుచనచేసే మందులు అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఈ మందులు వాడటం ద్వారా ఏఎఫ్ వల్ల వచ్చే పక్షవాతాలలో 70 శాతం వరకు నివారించవచ్చని డాక్టర్ గ్రాంగెర్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో గుండె లయను నియంత్రించే మందులు లేదా కాథెటర్ అబ్లేషన్ అనే ప్రక్రియ ద్వారా కూడా చికిత్స అందిస్తారు. వయసు, జన్యుపరమైన కారణాలు ప్రమాదాన్ని పెంచినప్పటికీ, జీవనశైలి మార్పుల ద్వారా దీనిని నివారించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పని వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండటం, ఆల్కహాల్ పరిమితం చేయడం వంటివి చాలా ముఖ్యం. పక్షవాతం వచ్చిన తర్వాత చికిత్సకు అయ్యే భారీ ఖర్చుతో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌ను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.



# మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు

## మరోమారు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

## రివ్యూ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, జులై 27:** షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, మతమార్పిడి జరిగిన క్షణం నుంచే షెడ్యూల్డ్‌కుల హోదాను కోల్పోతారని పేర్కొన్న సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రికార్డులో ఎటువంటి లోపం కనిపించడం లేదని పేర్కొంటూ, జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 24 నాటి తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది."సమీక్షా పిటిషన్‌పై మౌఖిక విచారణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించడమైనది. తాము సమీక్షా పిటిషన్‌ను పరిశీలించి, సమీక్షించాలని కోరిన మార్చి 24, 2026 నాటితీర్పును కూడా పరిశీలించాము.రికార్డులో ఎటువంటి లోపం స్పష్టంగా కనిపించడం లేదు. అందువల్ల, సమీక్షా పిటిషన్‌ను కొట్టివేస్తున్నామ్ము అని సమీక్ష పిటిషన్‌పై జులై 15న జారీ చేసిన తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. మార్చి 24న, ఒక కీలకమైన తీర్పులో, షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, పుట్టుకతో సంబంధం లేకుండా మతం మారిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే తన షెడ్యూల్డ్ కుల హోదాను "తక్షణమే మరియు పూర్తిగ్గా కోల్పోతారని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును ఇదిసమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లోని క్లాజ్ (1) ప్రకారం, భారత రాష్ట్రపతి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల (యూటీలు)కోసం 'షెడ్యూల్డ్ తెగల్లుగా గుర్తించబడిన తెగలు, గిరిజన వర్గాలను గుర్తిస్తూ 1950నాటిరాజ్యాంగ (షెడ్యూల్డ్‌తెగలు) ఉత్తర్వును జారీ చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది.

# ఇక 'జీహాద్' ఒక్కటే మార్గం

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన



**టెహ్రాన్, జులై 27:** ఇజ్రాయెల్‌పై పోరాటం సాగిస్తున్న లెబనాన్‌లో హెజ్బొల్లా సాయుధ గ్రూప్‌నకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ పునరుద్ఘాటించారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దాడులు, కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోతేనే అమెరికాతో ఇరాన్ ఘర్షణ ముగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇప్పుడు జీహాద్, ప్రతిఘటన తప్ప మరో మార్గం లేదని మొజ్తబా తేల్చిచెప్పారు. హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయీమ్ ఖాసీమ్, గ్రూప్ యోధులను ఉద్దేశించి ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. హెజ్బొల్లా దృఢవైఖరిని ప్రశంసిస్తూ వారిని రక్షించుకోవడం ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాతో ఇరాన్ యుద్ధం ముగియడానికి ఒప్పందం కుదరాలంటే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్‌కు తమ విధేయతను ప్రకటిస్తూ హెజ్బొల్లా రాసిన లేఖకు సమాధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి 'జీహాద్, ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు' అని ఆయన పేర్కొ న్నారు. తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని అమెరికా, ఇరాన్‌లు ఉల్లం ఘించడంతో మరోసారి పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగామారాయి. 'ప్రజల ప్రాణాలను తీస్తూ, భవిష్యత్తు తరాలను నాశనం చేస్తున్న అమెరికా ప్రభుత్వం, జియోనిస్టులు(ఇజ్రాయెల్) అణచివేత, నిరంకుశత్వం, దుర్మార్గాలతో ప్రపంచ దేశాలు విసిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో 'జీహాద్', ప్రతిఘటన తప్ప మనకు వేరే మార్గం లేదు' అని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడే గ్రూపులకు హెజ్బొల్లా ఒక కొండలా ముందుండి నడిపిస్తుందని, ఈ తిరుగులేని పోరాటం ప్రపంచంలోనే స్వేచ్ఛను కోరుకునే దేశాలకు స్ఫూర్తిదాయక సందేశంగా మారిందని ఆయన ప్రశంసించారు.

# ఆ 'సిట్‌'లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చండి

## యుపి సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు

## రెండు వారాల్లో స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 27:** అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశిస్తూ డెడ్‌లైన్ విధించింది న్యాయస్థానం. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరిచర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

# నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా, చట్టబద్ధంగా జరిగే నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టంచేసింది. కేవలం ఆందోళన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జ్‌కు దిగడం సరికాదని పేర్కొంది. పోలీసులు హద్దులు మీరి వ్యవహరించి ఉంటే స్వతంత్రంగా దర్యాప్తు జరగాలని సూచించింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'సంసద్ చల్లో' నిరసన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం విచారించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించాల్సిన విధానంలో ఏకరూపత అవసరమని అభిప్రాయపడింది. నిరసన జరిగిందనే కారణంతో బలప్రయోగం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా గాయపడిన పోలీసుల కుటుంబాల తరఫున వాదించేందుకు వచ్చిన న్యాయవాదికి కూడా కోర్టు అనుమతి ఇచ్చింది. విద్యార్థులకైనా, పోలీసులకైనా గాయాలు కావడం సమానంగా ఆందోళనకరమేనని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ వ్యాఖ్యానించారు. నిరసనలను ఎదుర్కొనే పోలీసులకు హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు ఎందుకు అందించలేదని రాష్ట్రాలను ప్రశ్నించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని పిటిషన్లను మంగళవారం కలిపి విచారించనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

# సిజెపి నేతలకు సొమ్ములెక్కడినుంచి వచ్చాయి?

## సుప్రీం న్యాయవాది మహేష్ జెత్మలానీ

**న్యూఢిల్లీ, జులై 27:** నిరవధిక ఆందోళన నిర్వహించిన సిజెపి నేతలకు సొమ్ములు ఎక్కడినుంచవ ఇచ్చాయో ఆరద్యప్తు చేయించాలని సీనియర్ న్యాయవాది స్పందించారు. సిజేపీ నేతల సంబరాలపార్టీలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టి పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా వేడుకల తీరును న్యాయవాది మహేశ్ జెత్మలానీ విమర్శించారు. హోటల్‌లో పార్టీ చేసుకోవడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. నిజంగానా సీజేపీ నాయకత్వం హోటల్‌లో విజయోత్సవం జరుపుకుంటోందా, ఢిల్లీలో రోజుల తరబడి హింసాకాండ జరిగిన తర్వాత ఈ యువ కార్యకర్తలమని చెప్పుకునే వారు డ్యాన్సులు చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. అలాగే ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనల వెనుక ఉన్న ఆర్థిక వనరులపైనా జెత్మలానీ ప్రశ్నలు లేవనెత్తారు. ఢిల్లీ ఆందోళనల సమయంలో సీజేపీ నేతలు, కార్యకర్తల ప్రయాణం, ఆహారం, వసతి, లాజిస్టిక్స్ వంటి వాటికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీని అట్టుడికించిన వారికి ఆర్థిక సహాయం ఎవరు చేశా రంటూ ప్రశ్నలు సంధించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే ఈ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది.

# నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లను ఇప్పటికీ ఎత్తివేయలేదు

## సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ నిరసన

**న్యూఢిల్లీ, జులై 27:** నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు, నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలాచూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతేతదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుం దని హెచ్చరించారు. అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# పాట్నాలో ఎకె47 ఉపయోగించిన కానిస్టేబుల్ సస్పెన్షన్



**పాట్నా, జులై 27:** నీట్ పరీక్ష అక్రమాలపై బిహార్‌లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా ఏకే47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జులై 25న నిర్వహించిన బిహార్ బంద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పలు చోట్ల పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను పోలీసులు వినియోగించారు. సివాన్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు గాయపడగా వారిలో 15 ఏళ్ల మహ్మద్ ఆరిఫ్ మెడలో బుల్లెట్ తగిలింది. శస్త్రచికిత్స ద్వారా బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్, బిహార్‌లో ఏకే47 వినియోగించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు ఘటనపై శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధ వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అనే అంశాన్ని విచారణలో తేల్చనున్నట్లు తెలిపారు.

# జెన్జీ సిజెపి ఉద్యమానికి పొరుగుదేశాల్లోను ప్రశంసలు



**న్యూఢిల్లీ, జులై 27:** భారత జెన్‌జీ తమ బలహీనతలనే బలంగా మార్చుకుంది. పరీక్షా పత్రాల లీకేజీపై వారు చేసిన వినూత్న ఉద్యమం, కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి ఏకంగా విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసింది. ఈ ఉద్యమ ప్రభావం కేవలం దేశానికే పరిమితం కాలేదు. సరిహద్దులు దాటి పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల యువతను సైతం ఆకర్షించి, వారి నుంచి ప్రశంసలు అందుకుంటోంది. కాక్రోచ్ జనతా పార్టీ సీజేపీ పేరుతో మొదలైన ఈ ఉద్యమంలో మీమ్స్ మేనిఫెస్టోలుగా, రీల్స్ నియామక సాధనాలుగా మారాయి. పోలీసుల చర్యలకు సంబంధించిన షార్ట్ వీడియోలు ఆధారాలుగా నిలిచాయి. ఈ వినూత్న పోరాట పటిమ ఇప్పుడు పొరుగు దేశాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత జెన్‌జీ ఉద్యమంపై పాకిస్థాన్ నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. అక్కడి యువత భారత యువతరం ధైర్యాన్ని, ఐక్యతను చూసి ముగ్ధులవుతున్నారు. మీరు ఇలాగే అద్భుతమైన పనులు చేస్తుంటే, మేం మిమ్మల్ని ఎలా ద్వేషించగలం బహుశా ప్రేమలో పడతామేమోనని ఒక పాకిస్థానీ యువతి చెప్పడం విశేషం. కులం, మతం వంటి విభేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఏకతాటిపై నిలవడాన్ని వారు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఈ ఉద్యమానికి పాకిస్థాన్ నిధులు ఇస్తోందని కొందరు అంటున్నారు. మా దేశాన్ని నడుపుకోవడానికే మా దగ్గర డబ్బు లేదు. ఇక మీకెలా ఇస్తామని బిలాల్ హాసన్ అనే కంటెంట్ క్రియేటర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2022లో ఆర్థిక సంక్షోభంపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దింపిన శ్రీలంక యువతకు, భారత జెన్‌జీ ఉద్యమం తమ పోరాటాన్ని గుర్తు చేస్తోంది. అక్కడి కార్టూనిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు భారత యువతకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ముంబైలో పోలీసు వ్యాన్‌ను ఒక యువతి ఒంటరిగా అడ్డుకున్న ఫొటోను, చైనాలోని చారిత్రక ట్యాంక్ మ్యాన్ ఫొటోతో పోలుస్తూ ప్రశంసిస్తున్నారు. నేపాల్ యువత కూడా భారత విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకుం టోంది. విద్యార్థులు రోడ్లపైకి రావడం చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. మీ పోరాటం సరైనదే. మీ లక్ష్యం ఏమిటో ఎప్పుడూ మర్చిపోవద్దని నేపాల్‌కు చెందిన ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు.

# సంక్షిప్త వార్తలు


## ఉక్రెయిన్‌ను వదలం..తగిన బుద్ధి చెబుతాం: ఇరాన్



**టెహ్రాన్, జులై 27:** కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు ఇరాన్ తెలిపింది. ఈ ఘటనపై టెహ్రాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ దాడికి కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యుద్ధం మరింత విస్తరించకుండా ఉండాలంటే కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ డిమాండ్ చేసింది.

## చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**జైపూర్, జులై 27:** రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అక్కడి ఓ చెరువులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే వారంతా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌దేవ్రా పోలీసు స్టేషన్ పరిధిలోని లోహార్కి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నీటిలోకి దూకిన నలుగురిలో జస్రాజ్ అనే వ్యక్తి కేకలు వేయడం గమనించి కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అక్కడకు పరుగెత్తుకెళ్లారు. కానీ చెరువు దగ్గరికి చేరుకునే సరికే వారంతా నీటిలో మునిగిపోయారు.



## అమెరికాలో కాల్పులు, ముగ్గురి మృతి


**వాషింగ్టన్, జులై 27:** అమెరికాలోని సియాటెల్‌లో తుపాకీ సంస్కృతి పడగవిప్పింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో జరుగుతున్న వార్షిక ఫుడ్ ఫెస్టివల్ దగ్గర దుం డగులు సామూ హిక కాల్పులకు తెగబడటంతో ముగ్గురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు ఒక దుండగుడిని అరెస్టు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ సామూ హిక కాల్పుల ఘటన జరిగింది. వందలాదిగా ఉన్న ఫుడ్‌స్టాళ్లు, లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌తో కళకళ లాడుతున్న సియాటెల్‌లో అకస్మాత్తుగా తుపాకీ మోతలు వినిపించాయి.

## తాహిర్ హుస్సేన్‌కు శిక్షపై తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు




**న్యూఢిల్లీ, జులై 27:** 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్ల సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో దోషులుగా తేలిన మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, మరో నలుగురికి విధించాల్సిన శిక్షా పరిమాణంపై ఢిల్లీ కోర్టు సోమవారం తన తీర్పును రిజర్వ్ చేసింది. శిక్షకు సంబంధించిన అంశంపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ తరఫు వాదనలు వివరంగా విన్న తర్వాత జులై 31న తీర్పును వెల్లడిస్తామని కర్కర్‌డూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి(ఎఎస్‌జె) ప్రవీణ్ సింగ్ తెలిపారు. శర్మ హత్యను 'పక్కాని', 'క్రూరమైన' హత్యగా అభివర్ణిస్తూ, గరిష్ట శిక్షను కోరుతూ ఢిల్లీ పోలీసులు మరణశిక్ష విధించాలని కోర్టును అభ్యర్థించారు.

## రూ.25వేల వరకూ భారత్ కరెన్సీకి నేపాల్‌లో అనుమతి



**ఖాట్మండు, జులై 27:** భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ.200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరుదేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ.25వేల పరిమితికి లోబడి ఈ నోట్ల ను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది.

## బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ఒక టెరాబైట్ డేటా చోరీ

**ముంబయి, జులై 27:** దేశంలోని ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ సైబర్ దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బ్యాంక్ వ్యవస్థలోకి చొరబడ్డామని ప్రకటించిన ఓ హ్యాకర్ దాదాపు ఒక టెరాబైట్ కీలక డేటాను డార్క్‌వెబ్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నాడు. ఇందులో ఖాతాదారుల ఆధార్ నంబర్లు, పేర్లు, రుణాల వివరాలు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల సమాచారం, నెట్‌బ్యాంకింగ్, ఎన్ఆర్ఐ, కార్పొరేట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన రికార్డులు ఉన్నాయని చెబుతున్నాడు. ఈ డేటా లీక్‌కు సంబంధించిన కొన్ని నమూనా పత్రాలను కూడా హ్యాకర్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.

# విద్యార్థులపై అణిచివేత ఇంకా ఆగలేదు

## మోడీజీ క్షమాపణలు చెప్పాల్సిందే: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, జులై 27:** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహి రంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

# పిఒకెలో జాక్ లాంగ్ మార్చ్..పరిస్థితులు ఉద్రిక్తం

**ముజఫరాబాద్, జులై 27:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. పాక్ అధికారులతో చర్చలు విఫలమవడంతో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయవద్దని యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ యూకేపీఎన్‌పీ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీలు రావల్‌కోట్‌లో కలుసుకున్నాయి. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పాక్‌ప్రభుత్వం రేంజర్స్, ఫ్రంటియర్ కానిస్టేబులరీ (ఎఫ్‌సీ), పంజాబ్ కానిస్టేబులరీ (పీసీ)దళాలను అదనంగా మోహరించినట్లు సమాచారం.

# అమిత్ షా వివరణ కోరుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ, జులై 27:** పార్లమెంట్‌లో సోమవారం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొన్నాయి. జులై 20న ఢిల్లీలో జరిగిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల కార్యకలాపాలను అడుకున్నాయి. ఈ మేరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే నిర్ణయించిన చర్చల్లో పాల్గొనకుండా, ఢిల్లీలో కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి సభలో ప్రకటన చేయాలని పట్టుబట్టాయి.

సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో ఆందోళనకు దిగారు. దీంతో లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాం. అన్ని రాజకీయ పార్టీలు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరుతున్నామని రిజిజు చెప్పారు. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందిస్తున్నామని, ఇలాంటి కీలక బిల్లుపై చర్చకు దూరంగా ఉండి సభలో గందరగోళం సృష్టించడం ప్రజలకు మంచి సందేశం కాదని ఆయన స్పష్టం చేశారు.



# పార్లమెంటులో ధర్మేంద్ర ప్రధాన్‌కు ఘనస్వాగతం

## జైరామ్ రమేష్ వ్యాఖ్యలకు ప్రధాన్ కౌంటర్

**న్యూఢిల్లీ, జులై 27:** నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతూ కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని, ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు.

# రేపు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గాంధీభవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి'



**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** ప్రజా పాలనలో ప్రజాసమస్యల పరిష్కారానికి గాంధీ భవన్‌లో ప్రతి బుధవారం జరిగే 'ప్రజలతో ముఖాముఖి' కార్య క్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటున్నారు. ఉయదం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రజల నుంచి విన్నపాలు గాంధీభవన్‌లో స్వీకరింస్తారు.

వెంటనే పరిష్కారం అయ్యేవి ఉంటే ఆయా బాధ్యత కలిగిన అధికారులకు ఫోన్‌లో తెలపడంతోపాటు సంబందిత జిల్లా కలెక్టర్‌లకు కూడా సమస్య సాధనకు అత్యంత ప్రాధాన్యత చూపాలని సూచనలు మంత్రులు చేస్తారు. ఏవైనా సమస్యలు వెంటనే పరిష్కారం కాని ఉంటే వాటిపై విచారణచేసి తగు న్యాయం చేయడానికి అధికారులకు ఆదేశాలతో నిర్ధేశి స్తారు. పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ తన మార్కుగా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని గాంధీ భవన్‌లో ప్రారంభించారు. పార్టీకి ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గర చేయడానికి ఈ కారక్రమం ఎంతగానో దోహదం చేస్తుంది.

# ఫీజు రియింబర్స్ చేయకపోతే పేద విద్యార్థులకు నష్టం

## నా పేరు హానుమంతు.. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఉంటా : విహెచ్

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఫీజు రియంబర్స్ మెంట్ అమలు చేయాలని నా రిక్వెస్ట్ ఫీజు రియంబర్స్మెంట్ చేయకపోతే పేద పిల్లలు ఉన్నత చదువులు చదివే అవకాశం కోల్పోయి నష్టపోతారనీ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో విహెచ్ విలేఖరులతో మాట్లాడుతూ భట్టి విక్రమార్క రాజశేఖర్ రెడ్డి శిష్యుడిని అంటారు అత్యంత ప్రాధన్యత కలిగిన ఈ ప్రోగ్రాంకు నిధులు కేటాయించాలని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఫీజు రియంబర్స్ మెంట్,చేశారుఆయన ఉన్నంత వరకు పీజు రియంబర్స్మెంట్ జరిగిందనీ ఆతర్వాత రియంబర్స్మెంట్ చేయడం లేదనీ ఆవేదన చెందారు. ఒబిసి ల ప్రతినిధిగా బిసిలు నామీద ఒత్తిడి తెస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యా శాఖ మంత్రిగా సిఎం రేవంత్ రెడ్డి ఫీజ్ రియంబర్స్ ను చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫీజ్ రియంబర్స్మెంట్ చేయకపోతే సడక్ సేసదావ్ ముందుకు పోదునా అని అడిగారు. నా పేరు హానుమంతు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఉంటానని అన్నారు. తెలంగాణ సాధించడలో విద్యార్థులు కీలకమని గుర్తుచేసుకొన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది విద్యార్థులు చనిపోయారనీ అన్నారు.

# విద్యార్థులపై అమానుష దాడికి కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

## జన్-జికి చట్టసభల్లో ప్రాధాన్యత ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** విద్యార్థులపై జరిగిన అమానుష దాడికి హోమ్ మంత్రి క్షమాపణలు చెప్పాలనీ భువగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో పార్లమెంట్ వద్ద మీడియాతో సోమవారం మాట్లాడుతూ బాధ్యులైన పోలీసుల అధికారుల పై చర్యలు తీసుకోవాలనీ కోరారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తో అంతా అయిపోయిందని చేతులు దులుపు కుంటే ఉపేక్షించేది లేదనీ అన్నారు. పార్లమెంట సమావేశాలు సజావుగా జరగాలంటే ప్రభుత్వం భాధ్యతతో వ్యవహరించాలనీ అధికార పార్టీకి సూచించారు.సింగపూర్, బ్రిటన్ లాంటి దేశాల్లో "జెన్ జీ" కి చట్టసభల్లో ప్రతినిధులు ప్రాధాన్యత ఇస్తున్నారనీ భారత్ లో కూడా 21 ఏళ్ళ నుంచి 25 ఏళ్ళ లోపు ఉన్న యువత కు చట్టసభలో ప్రాతినిధ్యం కల్పిస్తే, వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి, సమస్యల పరిష్కారం చేయవచ్చని చెప్పారు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని, 'ఇండియా కూటమి' నేతలకు ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి వివరించనున్నారనీ వచ్చే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో, ఈ అంశంపై చర్చించి, తీర్మానం చేసే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని తెలిపారు.

# దొడ్డు బియ్యం టన్నుకు రూ.21,700 ధర

## ఇ-వేలం ద్వారా అమ్మకాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని ఇవేలం ద్వారా ప్రభుత్వం అమ్మకాలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ఉండగా వాటిని నాలుగు లాట్ చేసి ఈ వేలం నాలుగుసార్లు నిర్వహించారు. ఐతే మూడు లాట్లు మాత్రం ఇప్పటివరకు వేలం ప్రక్రియలో అమ్ముడుపోయాయి.అందులో రెండో లాట్లో ఉన్న 43,479 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ఈ వేలంలో రూ. 21700 టన్నుచొప్పున చెన్నైకి చెందిన సంస్థకు విక్రయించారు. ఎఫ్‌సిఐ కస్టమ్ మిల్డ్ రైస్‌కు కిలోకు 40 నుంచి 42రూపాయలు చెల్లిస్తుంది. టన్నుకు 40వేల నుంచి 42వేల వరకు ఎఫ్‌సిఐ ధర చెల్లించి కొనుగోలు చేసిన దొడ్డబియ్యం ప్రస్తుతం రూ.21700కు విక్రయించారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాలకు సన్న బియ్యం ప్రారంభించడానికి ముందే సేకరించిన దొడ్డు బియ్యం పలు ప్రాంతాల్లోని గోదాముల్లో భారీగా నిల్వలు ఉన్నాయి.బియ్యం పూర్తిగా పురుగు పడుతున్నాయని నివేదికలు రావడంతో అమ్మేందుకు టెండర్లు పిలవగా.. ఒక సంస్థ రెండో లాట్లో ఉన్న 43,479 మెట్రిక్ టన్నుల బియ్యం దక్కించుకుంది.బఫర్‌గోదాముల్లో నిల్వలు ఈ వేలంతో కొనుగోలుదారులు తీసుకొన్నారు. చౌకధరల దుకాణంలో నిల్వ ఉన్న బియ్యం విషయంలో వ్యాపారులు ముందుకు రావడంలేదు దీనికోసం పౌరసరఫరాల శాఖ 2025 మార్చిలో సన్న బియ్యం పథకం ప్రారంభించి గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇవ్వడం ప్రారంభించింది.

# ఒఆర్‌ఆర్ పరిధిలోని ఆటోరిక్షా యజమానులకు ఊరట

## ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ లేకుండానే పర్మిట్ బదలీకి అనుమతి: రవాణా శాఖ కమిషనర్

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్) పరిధిలో తిరుగుతున్న పాత ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోరిక్షాల యజమానులు, తమ వాహ =నాల యాజమాన్యం, సిటీ పర్మిట్‌లను పాత వాహనాన్ని స్క్రాప్ చేసి అదే పర్మిట్‌పై కొత్త ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోరిక్షాను భర్తీ చేయాలనుకునే కొనుగోలుదారులకు బదలీ చేసేందుకు వీలుగా తెలంగాణ రవాణా కమీషనర్ ఊరట కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సీఎఫ్‌ఎస్‌టి సాఫ్ట్‌వేర్ ప్రకారం రిజిస్ట్రేషన్,పర్మిట్ బదిలీ చేయాలంటే వాహనానికి చెల్లుబాటులో ఉన్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) తప్పనిసరి కావడంతో, వెంటనే స్క్రాప్ చేయబోయే వాహనానికి కూడా కొనుగోలుదారులు ఎఫ్‌సీ రెన్యువల్ చేయించుకోవాల్సి వస్తోందని, ఇది అనవసర ఆర్థిక భారంగా మారుతోందని పలు వినతులు అందాయన్నారు. ఈ వినతులను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఒఆర్‌ఆర్ పరిధిలోని పాత ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోరిక్షాల యాజమాన్యం పర్మిట్ బదిలీని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్‌ను తప్పనిసరి చేయకుండానే అనుమతిస్తారు.

# ఐఐటి, నీట్ ర్యాంకులు సాధించే లక్ష్యంగా విద్యార్థులు చదువుకోవాలి

## మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించిన సిఎస్ సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదారబాద్,జులై27:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం మహేశ్వరం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తు న్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాల యం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.పాఠశాల సమయాల్లో విద్యార్థుల రాక పోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) బస్సు సేవల ను పాఠశాల వరకు పూర్తి స్థాయిలో అందు బాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సందర్శన ముగింపులో పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రజలను మళ్లీ మోసగించేలా బిఆర్‌ఎస్ రాజకీయాలు

## కర్ణాటకలో డ్యామ్‌లు కట్టినప్పడు అధికారంలో ఉండి ప్రశ్నించని బిఆర్‌ఎస్ పాలకులు

## బీమా, కృష్ణా నదులపై బ్యారేజ్ కమ్ బ్రిడ్జిలు నిర్మించాలన్న ఆలోచన చేయలేదు: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** కర్ణాటకలో డ్యాంలు కట్టినపుడు అధికారంలో ఉండి బిఆర్‌ఎస్ పాలకులు ప్రశ్నించలేదని పాలమూరు ప్రజలను మరోమారు మోసం చేయడానికి కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విమర్శిం చారు. సోమవారం హైదారబాద్‌లో ఆయన మాట్లా డుతూ పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి "కర్ణాటకలో నీళ్లు - తెలంగాణలో బీళ్లు" అంటూ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమే తప్ప, పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం కాదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిందని చెప్పుకునే వారు, బిఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో కర్ణాటకలో ఆనకట్టలు నిర్మించినప్పుడు ఒక్కసారి కూడా వెళ్లి ప్రశ్నించలేదని ఆయన అన్నారు. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. భీమా, కృష్ణా నదులపై బ్యారేజ్‌కమ్‌బ్రిడ్జిల నిర్మాణం ద్వారా నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదని ఎత్తిచూపారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజ్‌కమ్‌బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్ సిద్ధం చేశామని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక ప్రస్తుత ముఖ్యమంత్రి డికె శివకుమార్, కర్ణాటక సాగునీటి శాఖ మంత్రులతో కలిసి హెలికాప్టర్ ద్వారా ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి, సాంకేతికంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.జూరాల ముంపు గ్రామాలైన భూత్పూర్, నేడుగం, అనుగొండ, అంకెనపల్లి, దాదంపల్లి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

దశాబ్దకాలంగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, తగిన నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం వల్ల ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రైతులు, యువత అన్ని విషయాలు గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు విరమించుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులకు సూచించారు. 'మంచి చేయలేకపోయినా కనీసం చెడు చేయకండి, ప్రజలను మోసం చేసే రాజకీయాలు మానుకోండి, పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది' అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో ముగిసిన ఆప్షన్ల గడువు

## 30న సీట్ల కేటాయింపు

## మూడు విడతల్లో సీట్ల కేటాయింపు పూర్తి

## ఇప్పటివరకు 1,41,143 మంది చేరిక

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) పేరుతో డిగ్రీలో అడ్మిషన్లు చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. ఈ నెల 16న స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల కోసం షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. స్పెషల్ ఫేజ్‌లో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు రూ. 400తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సోమవారంతో వెబ్ ఆప్షన్ల గడువు సైతం ముగిసింది. సోమవారం స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ రిపోర్ట్ చేసిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి ఆగస్టు 1 వరకు ఆయా కాలేజీల్లో చేరాలి. మూడు విడతల్లో డిగ్రీ అడ్మిషన్ల కేటాయింపు చేశారు.

ఇప్పటి వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తే రాష్ట్రంలో 1,41,143 మంది డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరారు. ఇంకా రాష్ట్రంలో 2,96,66 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 929 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,37,809 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1.41,143 మంది మాత్రమే చేరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించిన దోస్త్ అడ్మిషన్ల లెక్కల ప్రకారం రాష్ట్రంలో 780 డిగ్రీ కాలేజీల్లో 3,71,919 సీట్లు ఉండగా వాటిలో 1,19,016 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. వివిధ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న 79 సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 23,834 సీట్లు అందుబాటులో ఉంటే అందులో 9,271 సీట్లు భర్తీ అయ్యాయి. నాన్ దోస్త్ విధానంలో అడ్మిషన్లు తీసుకుంటున్న 70 కాలేజీల్లో 42,056 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 12,856 సీట్లను భర్తీ అయ్యాయి. స్వయం ప్రతిపతి (అటానమస్) హోదా కలిగిన 36 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 45,120 సీట్లు ఉంటే అందులో 27,434 సీట్లు భర్తీ అయ్యాయి. అటానమస్ కాకుండా ఉన్న 116 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 50,940 సీట్లు అందుబటులో ఉంటే వాటిలో కేవలం 19,389 సీట్లు భర్తీ కాగా ఇంకా 31,551 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఉన్న సీట్లలో కేవలం 43 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 580 ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 2,48,330 సీట్లు ఉంటే వాటిలో కేవలం 59,615 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 1,88,715 సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి.

# జార్జియాటెక్ వర్సిటీలో అడ్మిషన్ వచ్చిన విద్యార్థికి ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి అభినందనలు

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** అమెరికాలోని ప్రముఖ జార్జియాటెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గ్రాడ్యుయేషన్ సీటు సంపాదించిన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన యరమాద అశ్మిత్ ను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు. సోమవారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా యరమాద అశ్మిత్ కలిశారు. తన ప్రతిభతో ప్రముఖ జార్జియాటెక్ యూనివర్సిటీలో సీటు సంపాదించిన అశ్మిత్ ను మంత్రి అభినందించారు. నల్లగొండకే కాదు యావత్ తెలంగాణకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా కష్టపడి చదివి, ప్రయో జకుడు కావాలని ఆశీర్వదించారు. అశ్మిత్ తల్లి దండ్రులు యరమాద జగదీష్ రెడ్డి శ్రీలత లకు శుభాకాంక్షలు తెలిపారు. అశ్మిత్ తండ్రి జగదీష్ రెడ్డి ఎవర్జెంట్ టెక్నాలజిస్ అమెరికా హెడ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తన తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, అస్మిత్ కు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి.. విమర్శలు చేయడం తగదు

## ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు విమర్శలు చేయడం తగదని విద్యార్థుల జీవితంతో కేంద్రంలోని బిజెపి చెలగాటం అడుతోందని ప్రభుత్వవిప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ విమర్శించారు. సోమవారం సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను పూర్తి చేస్తాం, త్వరలోనే పోలీసు ఉద్యోగాల భర్తీ, మరో 30 వేల ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది, త్వరలో వాటిని కూడా భర్తీ చేస్తామనీ చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత బిజెపి కి లేదనీ అన్నారు.యువతకు పెద్దపీట వేసి, రాష్ట్రంలో దేశంలో చట్టసభ కు పంపించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందనీ తెలిపారు. యువత గురించి, యువతకు అవకాశాల గురించి బిజెపి రామ చందర్ రావు మాట్లాడుతుంటేనవ్వొస్తుందనీ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు మొదటి నుంచి అవకాశాలు ఇచ్చారనీ తెలిపారు. అందుకు ఎంఎల్‌సినేను, ఎంపిగా అనిల్ కుమార్ యాదవ్, మరో 20 మంది యువ నాయకులకు కార్పొరేషన్లలో అవకాశం కల్పించారనీ తెలిపారు.ఇటీవల కేరళలో యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి వర్గంలో చోటు కల్పించారనీ చెప్పారు.



సచివాలయంలో ఎస్సీ వర్గీకరణ సబ్‌కమిటీ మంత్రులకు రోస్టర్ పాయింట్లపై సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్న జి.చెన్నయ్య

# రోస్టర్ పాయింట్లపై సమీక్షించండి

## సబ్‌కమిటీకి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య విజ్ఞప్తి

**హైదారబాద్ (సైఫాబాద్), జులై 27, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణలో ద్వారా వచ్చిన రోస్టర్ పాయింట్ల వల్ల మాల, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాలపై సమీక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమ వారం సచివాలయంలో వర్గీకరణ సబ్ కమిటీ మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారులు విజయే ంద్రబోయి, శ్రీధర్ తదిత రులను కలిసి జి.చెన్నయ్య కలిసి రోస్టర్ పాయింట్ల వల్ల మాలలకు జరు గుతున్న అన్యాయాలపై వినతిపత్రాన్ని అందజేసి వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వర్గీకరణ లోని రోస్టర్ పాయింట్ల వల్ల మాల, మాల ఉపకులాలకు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సబ్ కమిటీ సమీక్షించాలని, సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాలలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేరాల దర్యాప్తులో ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదికలు కీలకం

## డిజిపి ఆనంద్ వెల్లడి




ఎఫ్‌ఎస్‌ఎల్‌లో జరిగిన కొత్త ఉద్యోగుల నియామక ప్రక్రియ కార్యక్రమంలో పాల్గొన్న డిజిపి సి.వి ఆనంద్. ఫొటోలో ఎఫ్‌ఎస్‌ఎల్ డైరక్టర్ శిఖాగోయల్ తదితరులు

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో ఫోరెన్సిక్ విభాగం ఎంతో కీలకమైనదని డిజిపి సి.వి ఆనంద్ అన్నారు. కీలక కేసుల్లో ఈ విభాగం అందించే నివేదికలు కేసుల విచారణ వేగవంతం అయ్యేందుకు, నిందితులకు శిక్షలు పడేలా చేసేందుకు ఉపయోగపడతాయని ఆ యన తెలిపారు. నాంపల్లిలోని ఎఫ్‌ఎస్‌ఎల్ విభాగంలో కొత్తగా చేరిన 57 మంది సైంటిఫిక్ ఆఫీసర్లకు డిజిపి సోమవారం నాడు నియామక ప త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నిరూపణలో ఎఫ్‌ఎస్‌ఎల్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. దేశంలో అమ ల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా శాస్త్రీయ దర్యాప్తు ప్రమాణాలను మరింత మెరుగుపడాలని ఆయన అన్నారు. ఈ విభా గం అందించే నివేదికలు ఛార్జిషీట్‌కు కోర్టుల్లో కేసుల నిరూపణలకు దోహదం చేస్తాయని ఆయన తెలిపారు. కీలక కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు బలంగా లేకుంటే నేరస్తులు శిక్షల నుంచి తప్పించుకుంటారని డిజిపి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఎస్‌ఎల్ ఉద్యోగుల విధి నిర్వహణ ఎంతో ముఖ్యమైనదని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు మరింత పరిణతి చెందాలని, నివేదికలు రూపొందించడంలో పక్కాగా వుండాలని, నేరగాళ్లు శిక్షల నుంచి తప్పించుకునేందుకు అవకాశం లేకుండా చూడాలని ఆయన వెల్లడిచారు.

ఎఫ్‌ఎస్‌ఎల్‌లో మరింత సిబ్బ ందిని పెంచేందుకు కృషి చేస్తామని, దీంతో పాటు ఈ విభాగానికి కావాలసిన సాంకేతిక ఉపకరణాలను అందజేస్తామని డిజిపి హామీ ఇచ్చారు. ఎఫ్‌ఎస్‌ఎల్ డైరక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ తమ విభాగంలో సిబ్బంది కొరతవున్నా విధి నిర్వహణలో ఎక్కడా రాజీ పడడం లేదని తెలిపారు. సిబ్బంది కొరతవున్నా 80 శాతం కేసులను పరిష్కరించామని ఆమె తెలిపారు. డిఎన్ఎ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్, నార్కోటిక్స్, టాక్సి కాలజి తదితర విభాగాల్లో అధునాతన పరిజ్ఞానంతో సేవలందిస్తు న్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఎల్ జాయింట్ డైరెక్టర్లు మధుశ్రీ, ధార్మిత, మధుకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైసు మిల్లర్లపై పిడి చట్టంతో విరుచుకుపడుతున్న విజిలెన్స్

## సిద్దిపేటలో బియ్యం అక్రమ రవాణాదారు బచ్చు రత్నాకర్‌పై పిడియాక్టు ప్రయోగం

**హైదారబాద్, జులై 27,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా రైసుమిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేయడంతోపాటు ధాన్యం పక్కదారి పట్టించిన వారిపై పిడియాక్టు ప్రయోగం చేస్తూ అక్రమార్కులను నియంత్రించే కఠిన చర్యలు తీసుకొంటున్నారు. మరోవైపు రేషన్‌బియ్యంతో అక్రమదందా చేస్తున్నవారిని కూడా వదిలి పెట్టంలేదు. సూర్యాపేట జిల్లా బాలెంల పరిధిలోని వజ్ర రైస్ కార్పొరేషన్, వజ్ర వికాస్ రైస్ మార్ట్‌లలో విజిలెన్స్ అధికారులు తనిఖీచేయగా ధాన్యాన్ని మాయమైనట్లు గుర్తించి వట్టె జానయ్య యాదవ్ పై పిడియాక్టు ప్రయోగించారు.టిఆర్‌పి పార్టీ జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్‌పై కేసు నమోదయింది. రూ.73 కోట్ల విలువైన ధాన్యాన్ని వట్టె జానయ్య పక్కదారి పట్టించి దోచుకున్నాడని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు నిర్ధాంచినట్లు తెలిసింది. 29,188 టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించడంతో జానయ్య కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వడ్లను అక్రమంగా తరలిస్తున్న లారీలను అదుపులోకి తీసుకుని, రెండు మిల్లులలోని ధాన్యాన్ని సీజ్ చేశారు.రూ.73 కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లుల నుంచి దొడ్డిదారిన మళ్ళించిన టిఆర్‌పి పార్టీ జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్ పరారిలో ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు యాదాద్రి భువనగిరి జిల్లాలోని రైస్ మిల్లులో భారీగా సిఎంఆర్ రైస్ మాయమైంది. భువనగిరి మండలం అనంతారంలో యాదాద్రి రైస్ ఇండస్ట్రీలో 2022-23, 2024-25 రబీ సీజన్లకు చెందిన 6.700 మెట్రిక్ టన్నుల రైస్ కనిపించకుండా పోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.24.30 కోట్లుగా అంచనా వేస్తున్నారు. మిల్లుకు చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేటకు జిల్లా గజ్వేల్ కు చెందిన బచ్చు రత్నాకర్‌పై పోలీసులు పిడి యాక్ట్ నదమోదు చేసి అరెస్టుచేశరు రేషన్‌బియ్యం అక్రమంగా రవణా చేస్తూ ఆరు సార్లు పోలీసులకు పట్టుబడ్డారు. రేషన్ లబ్దిదారులనుంచి డిలర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసి వద్దేపల్లి రైస్‌మిల్లులో నిల్వచేసి బ్లాక్‌లో విక్రయించడం ఇతనికి అలవాటుగా నేరం మారింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కింద అతనిని అరెస్టుచేసి చర్లపల్లిజైలుకు పోలీసులు తరలించారు.

# రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్

## ఆర్డర్ కాపీ వచ్చాక డివిజన్ బెంచ్‌కు వెళ్లే అవకాశం

## హైడ్రాతో లక్షన్నర కోట్ల విలువైన 3,350 ఎకరాల భూమిని రక్షించాం

## ఇదే వాదనతో అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశాల పరిశీలన

## ఢిల్లీలో ఉన్న సిఎం రేవవంత్‌రెడ్డికి సమాచారం ఇచ్చిన సిఎంఒ అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 27:**హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాట్ నెక్స్ట్ అనేది ఉత్కంఠగా మారింది. సర్కార్ నెక్స్ట్‌స్టెప్‌పై చర్చోపచర్చలు జరుగుతున్నాయి.హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశించడంప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టినట్లయింది. రంగనాథ్‌ను తప్పించాలన్న హై కోర్ట్ ఆదేశాల తర్వాత సర్కార్ ఏం నిర్ణయం తీసుకోనుందనేది చర్చ నీయాంశంగా మారింది.
రంగనాథ్‌ను తప్పిస్తుందా? లేక తీర్పును సవాల్ చేస్తుందా? ఇంతకీ ప్రభుత్వం ముందున్న ఆప్షన్స్ ఏంటి? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. మొత్తంగాకోర్ట్ ఆదేశాలతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. హైడ్రాపై మొదటి నుంచి విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు ప్రతిపక్షాలకు కోర్టు తీర్పు అస్త్రంగా మా రనుంది. సమీప భవిష్యత్ లో జిహెచ్ఎంసీ, పరిషత్ ఎన్నికలు ఉన్నాయి, ఈ ఎన్నికల ముంగిట హైకోర్టు వ్యాఖ్యలు తలనొప్పిగా మారాయి. ప్రభుత్వ నెక్స్ట్ స్టెప్ పై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో సిఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఎఐసిసి సమావేశంలో పాల్గొ నేందుకు ఢిల్లీకి వెళ్లారు. సిఎస్ సంజయ్ జాజు, సిఎంఒ అధికారులు ఫోన్ ద్వారా హైకోర్ట్ ఆదేశాలను సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు.
ఆర్డర్ కాపీ వచ్చిన తర్వాత న్యాయ నిపుణులతో సిఎం చర్చించనున్నారు. ప్రభుత్వం ముందున్న ఆప్షన్ల పై చర్చ చేయనున్నారు.సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు పై డివిజన్ బెంచ్ కు వెళ్లే అవకాశంఉందని తెలుస్తోంది. అవసరం అయితే సుప్రీంకోర్ట్ కు వెళ్లే ఛాన్స్ కూడా ఉంది. కోర్ట్ ఆదేశాల మేరకు రంగ నాథ్‌ను మారిస్తే ప్రతిపక్షాల ముందు డిఫెన్స్ లో పడతామని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇన్నాళ్లు హైడ్రా పై విపక్షాలు చేసిన విమర్శలకు బలం చేకూరుతుందని ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. హైడ్రా పై ఆరోపణలను మొదటి నుంచి తిప్పికొడుతున్న సర్కార్‌రూ.లక్షన్నర కోట్ల విలువైన 3,350 ఎకరాల భూములను హైడ్రా పరిరక్షి ంచినట్లు ప్రభుత్వం చెబుతుంది. 25చెరువులను పునరుద్ధరించాం అంటున్న సర్కార్... ఇదే వాదనతో హైకోర్టుకి వెళ్లే అవకాశాలను రేవంత్ సర్కార్ పరిశీలించనుందని తెలుస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ పై సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తంగా హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పలువురు అధికారుల మీద కోర్టు ధిక్కరణలు ఇంతకంటే పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ హైకోర్టు ఇంత తీవ్రంగా ఎన్నడూ స్పందించలేదు.కాగా, లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఐజి స్థాయి అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.



సోమవారం ఇ-సిటీలోని ఓ పరిశ్రమను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

# ఇ-సిటీ మహేశ్వరం పారిశ్రామిక పార్కుల్లో పలు సంస్థలను సందర్శించిన సిఎస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 27:** ఇ-సిటీలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను, ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమ, మంఖాల్ పారిశ్రామిక పార్కును సందర్శించి, ఎం/ఎస్.చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సందర్శించారు. సి.ఎస్‌తో పాటు టిజిఐఐసి. వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంకతోపాటు సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ముందుగా, మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఇ-సిటీలో 25ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సంస్థ సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీచేస్తోంది. రూ.1,240 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.అనంతరం ఎం/ఎస్. అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ సంస్థ 4 ఎకరాల విస్తీర్ణంలో ఈసిటీలో ఉన్న ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్,శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఉన్న ఈ సంస్థలో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మంఖాల్ పారిశ్రామిక పార్కును సందర్శించి, మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. ఈ సంస్థకు ప్రారంభంలో 1,20,881 చదరపు మీటర్లు (29.87 ఎకరాలు) విస్తీర్ణం గల భూమి బీఓపీపీ /బీఓపీఈటీ ఫిల్మ్ తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు.ఇందులో కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్,రీసైక్లింగ్ ఉత్పత్తులు జరుగుతాయి. కాగా, తమకు కేటాయించిన స్థలంలో ఈ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ సంస్థ తన తయారీ యూనిట్‌ను విజయవంతంగా నెలకొల్పి, ప్రాజెక్టుతో పాటు విస్తరణ ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పిస్తోంది. అనంతరం, మహేశ్వరం జనరల్ పార్క్‌లోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్ (ప్రైవేట్) లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ సంస్థకు 1,21,410 చదరపు మీటర్లు (30 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి కేటాయించారు. ఈ సంస్థ 331 మందికి ఉపాధి కల్పిస్తోంది. చివరిగా ఎం/ఎస్. మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సంజయ్ జాజు సందర్శించారు. ఈ సంస్థకు మహేశ్వరం జనరల్ పార్క్‌లోని మొత్తం 14,973 చదరపు మీటర్లు (3.7 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. ఈ సంస్థకు కేటాయించిన స్థలంలో తయారీ యూనిట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసి విస్తరణ ప్రాజెక్టులను పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.37,405 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 2,782 మందికి ఉపాధి కల్పిస్తోంది.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలని సిఎస్ సంజయ్ జాజు అధికారులను కోరారు.

# పోలీసులను కారుతో ఢీకొన్న డ్రగ్స్ కొనుగోలుదారుడు

## సిఐ, కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

**హైదరాబాద్ (గోషామహల్), జులై 27, ప్రభాతవార్త:** పక్కా సినీతరహాలో డ్రగ్స్ కేసును ఛేదించేందుకు వెళ్లిన సిఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను ఏకంగా డ్రగ్స్ కొనుగోలుదారుడైన ఓ యువకుడు కారుతో ఢీకొట్టడంతో వారు తీవ్రగాయాలకు గురైన ఘటన సోమవారం తెల్లవారుజామున తిలక్‌రోడ్డు అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం ప్రకారం.. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్ శ్రీ కాంత్, కానిస్టేబుళ్లు మహేష్‌యాదవ్, విష్ణు తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కారును వెంబడిస్తున్నారు. హుస్సేనీఆలం ప్రాంతానికి చెందిన సైఫ్ కారు నడుపుతుండగా అడ్డుకోబోయిన కానిస్టేబుళ్లు మహేష్ యాదవ్, విష్ణును కారు డ్రైవింగ్ చేస్తున్న డ్రగ్స్ కొనుగొలుదారుడు ఏకంగా ఢీకొట్టడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్రగాయాలకు గురయ్యారు. అక్కడి నుంచి తప్పించుకుని కారులో పారిపోతున్న సైఫ్‌ను ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ వెంబడించారు. అఫ్జల్‌గంజ్ వద్ద కారును అడ్డుకున్న సిఐ శ్రీకాంత్, వంశీధర్‌లను ఢీకొట్టాడు. దీంతో స్వల్పగాయాలకు గురయ్యారు. గాయాలకు గురైన మహేష్‌యాదవ్ కాలు ఫ్రాక్చర్ కావడంతో చికిత్స నిమిత్తం సోమాజీగూడ యశోద ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన సైఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. మహేష్‌యాదవ్ ఫిర్యాదు మేరకు అబిడ్స్ పోలీసులు నమోదు చేసుకుని అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లలో హత్యాయత్నంసహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను అదుపులోకి తీసుకుని డ్రగ్స్ వ్యవహారంపై ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై విచారణ కొనసాగిస్తున్నారు. సైఫ్‌పై రెండు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు.

# సెప్టెంబరు 1లోపు పిఆర్‌సి ప్రకటించాలి

## లేకపోతే ఉద్యమం తప్పదు

## టిటి జెఎసి సమావేశంలో ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** సెప్టెంబర్ 1వ తేదీ లోపు పిఆర్‌సి ప్రకటించాలని, లేకపోతే ఉద్యమం తప్పదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం పిఆర్‌టియు టిఎస్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో చైర్మన్ పుల్గం దామోదర్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిటిజేఏసీ) సమావేశం జరిగింది. సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఇప్పటికే పిఆర్‌సి 3 సంవత్సరాలు ఆలస్యమైందని, 6 డిఏలు పెండింగ్‌లో ఉండటం బాధాకరమన్నారు. సీపీఎస్‌ని రద్దుచేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని, ఈహెచ్‌ఎస్‌ను వెంటనే స్ట్రీం లైన్లోనికి తీసుకువచ్చి ఆగస్టు 1 వరకు అన్ని ఆస్పత్రులలో నగదు రహిత చికిత్స అమలుచేయాలన్నారు. సర్వీస్ రూల్స్ అమలుచేసి విద్యావ్యవస్థను పటిష్టపరచాలని, బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలన్నారు. 342 ఉత్తర్వులు అమలులోకి తెచ్చి ఎస్సీ, ఎస్టీలకు ఉన్నత చదువులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. 190 ఉత్తర్వులను అమలుపరచాలని, అలాగే గురుకుల, మోడల్ స్కూల్, కె.జి.బి.వి. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టిటిజేఏసీ తీర్మానం చేసినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. జేఏసీ ప్రతిపాదించిన సమస్యలను పరిష్కరించనట్లయితే ఉద్యమం తప్పదని తీర్మానించినట్టు ఎమ్మెల్సీ తెలిపారు. ఈ సమావేశంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్, టిటిజేఏసీ భాగస్వామ్య సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. రాజగంగారెడ్డి, గిరిధర్ గౌడ్ (టిఎస్‌జీహెచ్‌ఎంఏ), కటకం రమేష్, అంజిరెడ్డి (టిఆర్‌టిఎఫ్), క్రాంతికృష్ణ (ఆర్‌యుపిపి), కృష్ణమూర్తి (పిఈటిఏ టిఎస్) విద్యాసాగర్, నాగరాజు (టిజీపీఈటీ), కుత్బుద్దీన్, షకీల్ (యుటిఏటిఎస్), దానయ్య (ఎస్సీ, ఎస్టీ యుఎస్), రమేష్ (పిఆర్‌జిటిఏ), అశోక్ (పిఎంటిఏ), సుధాకర్ (పిఆర్‌విటి), స్వాతి, సంధ్యారాణి (కెజిబివి) పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రారంభమైన విత్తన మేళా

## తక్కువ నీటితో సాగయ్యే పంటలపై అవగాహన

**హైదరాబాద్, జులై 27, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కానున్న నేపథ్యంలో, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ఈ విత్తన మేళాలు ఈ నెల 29 వరకు అన్ని మండల కేంద్రాల రైతు వేదికల్లో నిర్వహిస్తున్నారు. తక్కువ నీటితో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని ప్రతి రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ విత్తన మేళాలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పంటల ఎంపిక, సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ పద్ధతులపై శాస్త్రీయ సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆయా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు సిఫారసు చేసిన నాణ్యమైన విత్తనాలు కూడా ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంచారు. విత్తన మేళ ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ కాల వ్యవధిలో దిగుబడి ఇచ్చే, ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు రకాల వరి విత్తనాలనే సాగు చేయాలని రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో ఇవి రైతులకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం గుర్తింపు పొందిన కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాల రసీదులను తప్పనిసరిగా భద్రపరుచుకోవాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# ఆర్‌టిసి యాజమాన్యం అంగీకరించిన అంశాలు తక్షణమే అమలుచేయాలి

## రాష్ట్రవ్యాప్తంగా డిపోల దగ్గర ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నాలు

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** ఆర్‌టిసి సమ్మె సందర్భంగా కార్మిక సంఘాలతో ఆర్‌టిసి యాజమాన్యం అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా డిపోల వద్ద కార్మికులు ధర్నాలు నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని రాష్ట్రంలోని డిపోల వద్ద ధర్నాలు నిర్వహించినట్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు విరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు తెలిపారు. ధర్నా అనంతరం స్థానిక డిపో మేనేజర్లకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌టిసి యాజమాన్యము వేసిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ యూనియన్లతో చర్చించి పలు అంశాలను అంగీకరించిందన్నారు. వాటిలో రెండు నెలలు కావస్తున్న పేస్కేలు తప్ప, ఏ ఒక్క అంశము కూడా పరిష్కారం కాలేదన్నారు. ఈడీల కమిటీ అంగీకరించిన సమస్యలపై వెంటనే అమలుకు ఆదేశించాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. ఉద్యోగ భద్రతపై కమిటీని వెంటనే నియమించాలని, అలవెన్స్‌లు 80 శాతం పెంచుతామని మూడు నెలల క్రితమే అంగీకరించిన ఇంతవరకు అమలు జరగలేదన్నారు. నెలకు మూడు కోట్లకు పైగా కార్మికులు నష్టపోతున్నారని, తక్షణమే అమలుకు ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో అపాయింట్ అయిన వారిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాసైవారందరికీ పోస్టింగ్‌కు అంగీకరించిన ఫైలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని, దానిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఫైలును పరిష్కరించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు 2017, 2021 ఆర్‌పిఎస్ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. తక్షణమే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# జంతర్‌మంతర్ నిరసనల్లో నేరగాళ్లు!

## 2,873 మంది వచ్చారని ఢిల్లీ పోలీసులు వెల్లడి

**న్యూఢిల్లీ, జులై 27:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన నిరసనలో భారీ సంఖ్యలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు ఉన్నట్టు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. జులై 20 నుంచి 25 మధ్య జరిగిన ఈ ఆందోళనల్లో ఏకంగా 2,873 మంది నేర నేపథ్యం ఉన్న వ్యక్తులు పాల్గొన్నారని పోలీసు వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్), ఇతర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీరిని గుర్తించినట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఈ పరిణామం ఢిల్లీ పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు గుర్తించిన ఈ వ్యక్తులలో చాలా మందిపై హత్య, అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు, కిడ్నాప్, దోపిడీ వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. వీరిలో కనీసం 989 మంది అత్యంత తీవ్రమైన నేరాలకు పాల్పడినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిలో కొందరు పదేపదే నిరసన ప్రదేశానికి వచ్చి వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. విద్యార్థుల ముసుగులో సంఘ విద్రోహ శక్తులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా నిరోధించేందుకే జంతర్ మంతర్ వద్ద నిఘా పెంచినట్టు అధికారి వివరించారు. నిరసన ప్రదేశం యొక్క ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు, నగరంలోని కీలక ప్రాంతాలు, సరిహద్దు ప్రవేశ మార్గాల వద్ద పోలీసులు హైరిజల్యూషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ ఎఫ్ఆర్ఎస్ కెమెరాలు తీసిన చిత్రాలను, వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన నేరస్థులు, పరారీలో ఉన్నవారు, హిస్టరీషీటర్ల వివరాలున్న డేటాబ్యాంక్‌తో పోల్చి చూశారు. ఈ ప్రక్రియలోనే ఇంత పెద్ద సంఖ్యలో నేరస్థులు ఆందోళనల్లో పాల్గొన్నట్టు బట్టబయలైంది. గుర్తించిన వారిలో ఎక్కువ మంది ఈశాన్య ఢిల్లీలోని సీలంపూర్, చాంద్ బాగ్, జాఫ్రాబాద్‌తో పాటు ఆగ్నేయ ఢిల్లీలోని జామియా నగర్, షాహీన్ బాగ్, ఓఖ్లా ప్రాంతాలకు చెందిన వారని తేలింది.

# రాష్ట్రంలో హైడ్రాను నిషేధిస్తే పేదల ఇళ్లు సురక్షితం

## హైకోర్టు తీర్పు సిఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు: బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై27:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పందించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఆ పోస్టు నుండి తక్షణమే తప్పించాలని తెలంగాణ ఉన్నత న్యాయ స్థానం (హైకోర్టు) జారీ చేసిన చారిత్రాత్మక ఆదేశాలను భారతీయ జనతా పార్టీ పక్షాన మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు.. ఈ తీర్పు ప్రజాస్వామ్యాన్ని కాల రాస్తూ పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు.



సామా న్య ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ, అక్రమ నిర్మాణాల పేరుతో దౌర్జన్యాలకు వేదికగా మారిన ఈ హైడ్రా వ్యవస్థను ప్రభుత్వం తక్షణమే పూర్తిగా ఎత్తివేయాలని బిజెపి డిమాండ్ చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ హైడ్రా ఏ క్షణంలోనూ సామాన్య పేదలు, సన్నకారు రైతులకు వ్యతిరేకంగా ప్రవర్తించకూడదని బిజెపి మొదటి నుంచి స్పష్టంగా చెబుతోంది. కానీ రేవంత్ ప్రభుత్వం పేదల రక్షణ ముసుగులో ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తూ, హైడ్రా ద్వారా దౌర్జన్యాలకు ఒడిగట్టిందన్నారు. ప్రజాస్వామ్యం లో న్యాయవ్యవస్థ (జ్యుడిషియరీ) కీలకమైన పిల్లర్. రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి పనిచేయాల్సిన అధికారులు కోర్టు ఆదేశాలను పదేపదే ధిక్కరించడం తీవ్రమైన నేరమన్నారు. ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయంటే, ఈ ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులు కోర్టులను ఏ స్థాయిలో నిరక్ష్యం చేశారో అర్థమవుతోందన్నారు. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ ప్రైవేటు భూముల్లోకి చొరబడటం, కనీస చట్ట నిబంధనలు పాటించకపోవడం రూల్ ఆఫ్ లా (చట్ట పాలన)ను పూర్తిగా అదుపు తప్పేలా చేసింది.అది ప్రభుత్వమైనా, ఎంతటి ఉన్నతాధికారి అయినా చట్టానికి అతీతులు కారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి, కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయడంతో పాటు, ప్రజావ్యతిరేక సంస్థగా మారిన, పేదలు, రైతులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న హైడ్రాను సంపూర్ణంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని పక్కనబెట్టి, కోర్టులను ధిక్కరిస్తూ పాలన సాగిస్తామంటే బిజెపి చూస్తూ ఊరుకోదు. బాధితుల తరఫున, ప్రజల వైపు నిలబడి మా పోరాటం కొనసాగిస్తామన్నారు.

# సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రపంచస్థాయి హంగులు

## రూ.714.73 కోట్లతో శరవేగంగా పునరాభివృద్ధి పనులు

## ప్రయాణికుల సౌకర్యాలకు పెద్దపీట

## డిసెంబరు నాటికి పూర్తి లక్ష్యం

**హైదరాబాద్ (తార్నాక), జులై 27, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రూ.714.73 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రస్తుతం సుమారు 64 శాతం పూర్తికాగా, 2026 డిసెంబర్ నాటికి మొత్తం పనులను పూర్తి చేయాలని రైల్వే అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రోజుకు సగటున 180 రైళ్ల రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌ను దాదాపు 1.5 లక్షల మంది ప్రయాణికులు వినియోగిస్తున్నారు.ప్రయాణికుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం....పునరాభివృద్ధి పనుల్లో భాగంగా ఉత్తర, దక్షిణ వైపుల అత్యాధునిక జీ ప్లస్ 3 స్టేషన్ భవనాలు, రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్, అన్ని ప్లాట్‌ఫారాలను ఒకే చోట నుంచి అనుసంధానించే విశాలమైన నడక మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు మెట్లు ఎక్కాల్సిన ఇబ్బందులు లేకుండా 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, రెండు ట్రావెలేటర్లు (కదిలే నడక మార్గాలు) ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులతో ప్రయాణించే కుటుంబాలు, భారీ సామాన్లు తీసుకెళ్లే ప్రయాణికులు ప్లాట్‌ఫారాల మధ్య సులభంగా రాకపోకలు సాగించవచ్చు. అలాగే విశాలమైన నిరీక్షణ మందిరాలు, ఫుడ్ కోర్టులు, రిటైల్ దుకాణాలు, విశ్రాంతి కేంద్రాలు, ఆధునిక మరుగుదొడ్లు, అధునాతన సీసీ కెమెరాలు, బ్యాగేజీ స్కానర్లు, యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థలతో భద్రతను మరింత బలోపేతం చేస్తున్నారు.

**భారీ పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు**

స్టేషన్‌కు వచ్చే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉత్తర భాగంలో బేస్‌మెంట్ ప్లస్ గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్తులతో 400 ఈసీయూల సామర్థ్యం గల మల్టీ లెవల్ పార్కింగ్, దక్షిణ భాగంలో రెండు బేస్‌మెంట్‌లతో 200 ఈసీయూల సామర్థ్యం గల భూగర్భ పార్కింగ్ నిర్మిస్తున్నారు. రాక, పోక ప్రయాణికులకు ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గించనున్నారు. అదేవిధంగా మెట్రో స్టేషన్లు, బస్ స్టేషన్‌తో నేరుగా అనుసంధానం కల్పించే స్కైవాక్ నిర్మాణం చేపట్టడంతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలగనుంది.....పర్యావరణ హిత చర్యలకు ప్రాధాన్యం....స్టేషన్‌లో 5,000 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్, 100 ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ పాయింట్లు, 500 కిలోలీటర్ల సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి కేంద్రం, వర్షపు నీటి సంరక్షణ గుంతలు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడనున్నాయి. ప్రస్తుతం దక్షిణ వైపు బేస్‌మెంట్ పనులు 98 శాతం పూర్తయ్యాయి. ప్రధాన భవనాలు, మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణాలు పూర్తికాగా, ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై భారీ కవర్ రూఫ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్ తదితర పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దేశంలోని అత్యాధునిక, ప్రయాణికుల సౌకర్యాలకు ఆదర్శంగా నిలిచే రైల్వే స్టేషన్లలో ఒకటిగా అవతరించనుంది.



సికిందరాబాద్ రైల్వే స్టేషన్ నూతన నమూనా



## గురుపౌర్ణమిన 155మందితో సమగ్రయోగా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** పతంజలి సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో 'డయాబెటిస్ రహిత తిరుపతి మిషన్' ప్రారంభిస్తున్నట్లు పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రితేదేవ్ జీ ప్రకటించారు. సమగ్ర యోగ విధానాల ద్వారా తిరుపతిని మధుమేహ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రీడయాబెటిస్, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు ప్రత్యేక యోగా శిబిరంలో నమోదు చేసుకుని వ్యాధి నియంత్రణ, నివారణకు యోగాను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ జిల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యోదయ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కుటుంబ ప్రబోధన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రాజు మాట్లాడుతూ భారతదేశం తన కుటుంబ విలువలు, సామాజిక వ్యవస్థను పరిరక్షించి బలోపేతం చేయడం ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రితేదేవ్ జీ మాట్లాడుతూ యోగా ప్రచారంలో తిరుపతి జిల్లా విశేష పురోగతి సాధిస్తోందని ప్రశంసించారు. జిల్లాలో 155 మంది యోగా ఉపాధ్యాయులకు విజయవంతంగా శిక్షణ అందించి, వారికి కార్యక్రమంలో ధ్రువ పత్రాలు ప్రదానం చేసినందుకు అభినందనలు తెలిపారు. పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ రాజ్ పురోహిత్, జిల్లా అధ్యక్షుడు హరి, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షురాలు ఉమ, భారత్ స్వాభిమాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం

**• 'డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి'లో శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని, ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు ఎస్‌పిడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పిడి తదితర సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా మాల్యవంతం గ్రామానికి చెందిన కైలాజ మాట్లాడుతూ తమ పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఐదు రోజుల్లోనే తమ సమస్యకు పరిష్కారం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912,1800 425 155333కు కాల్ చేయడంగాని వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

**రూఫ్ టాప్ సోలార్ పనులు**



## ఆగస్టు నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలి

**• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. కార్పొరేట్ కార్యాలయం నుండి సోమవారం సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్య సాయి జిల్లాల్లోని 2.07 లక్షల ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ఆయా జిల్లాల నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తూ, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఈ యేడాది ఆగస్టు నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతపురం సంస్థ పరిధిలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్ శోభ వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, లత, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, మోజెస్, ప్రదీప్ కుమార్, సుధాకర్, శ్రీనివాసులు, రాఘవేంద్రం, చంద్రశేఖరరావు, సోమశేఖర్‌రెడ్డి, అమర్‌బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో సంక్షేమ పథకాలు అమలుతో బాటు రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కృషి చేశామని తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలపై ఇంటింటికి టిడిపి కార్యక్రమం తిరుపతి నగరంలోని 50వ డివిజన్ తిమ్మినాయుడు పాలెంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. పార్లమెంటర్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి జెబి శ్రీనివాస్ ప్రజలతో మమేకమయ్యారు.



ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్న పథకాల గురించి వివరించడంతో బాటు వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బిజీ కృష్ణ యాదవ్, యూనిట్ ఇన్‌చార్జ్ ఖాయం వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షుడు దండు విజయ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు పులిగోరు మురళీకృష్ణ, ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, టిడిపి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొండా ఉమా వివాదం... త్రిసభ్య కమిటీ ఏర్పాటు

**నేడు వివరణ తీసుకోనున్న పల్లా, నిమ్మల**

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు(ఉమా) నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు తదితరులతో కలిసి వేదిక పంచుకున్నారు. 2019లో టిడిపి ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమ, అంబటి రాంబాబు వ్యవహారంపై త్రిసభ్య కమిటీని టటిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏర్పాటు చేసారు. పల్లాతో కలిపి మంత్రి నిమ్మల, కిలారు రాజేష్‌లతో త్రిసభ్య కమిటీ మంగళవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయానికి రావాలని బోండా ఉమకు పిలుపు పంపింది. చంద్రబాబు ఆదేశాలతో బొండా ఉమా నుంచి నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. వైఎస్సార్సీపీ నేతలతో వేదిక పంచుకోవడంపై నేతలకు బొండా ఉమా వివరణ ఇవ్వనున్నారు. ఉమా నుంచి వివరణ తీసుకొని నివేదికను చంద్రబాబుకు సమర్పించనున్నారు. గతంలో వైఎస్సార్సీపీ నేతలతో టిడిపి నేతలు వేదిక పంచుకోవటాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఘటనలు పునరావృతం కాకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయండి

**• కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు ఎంపిలు కేశినేని చిన్ని, మాగుంట లేఖ**

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయాలని లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాధ్ (చిన్ని) కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇఎస్ఐసి మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కేశినేని చిన్ని కేంద్రానికి తన లేఖలో విజ్ఞప్తి చేసారు. గుణదలలో ఇఎస్ఐ ఆస్పత్రిని 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ఎంపి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఇఎస్ఐ ప్రాంగణంలోనే నూతనంగా ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరుకు అవకాశాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రి ఆవరణలోనే 25 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అదనపు భూమి అవసరం లేకుండానే నిర్మించవచ్చని ఎంపి కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు సహా 8 జిల్లాల్లోని 2.88 లక్షల మంది కార్మికులు, 10 లక్షల మంది వారి కుటుంబ సభ్యులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎంపి కేశినేని చిన్ని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి లేఖను అందజేశారు.

# తిరుమల సమాచారం



## విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన ఉడిపి అద్మార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద చేసింది. సోమవారం శిష్యులతో కలసి తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు సాంప్రదాయంగా స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు బహుకరించారు. కలియుగంలో ప్రజలు భక్తిభావంతో మోక్షం పొందాలని అనుగ్రహించారు.

## ఆగస్టులో రెండు సార్లు గరుడసేవ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల్లో రానున్న ఆగస్ట్ నెలలో రెండు సార్లు గరుడసేవ నిర్వహించనున్నారు. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఆగస్టులో 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీథుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. ఈ అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టాన్ని కనులారా తిలకించడానికి లక్షలమంది భక్తులకు టిటిడి పిలుపునిచ్చింది. ఆగస్ట్ 28న జరిగే గరుడసేవ బ్రహ్మోత్సవాల గరుడసేవకు ట్రయల్‌రన్‌గా నిర్వహించనున్నారు.



## కపిలేశ్వరస్వామికి గ్రంధి పవిత్ర సమర్పణ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో సోమవారం గ్రంధి పవిత్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నడుమ అత్యంత శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కపిలేశ్వరస్వామిని మేల్కొలిపి, పవిత్ర అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం నిత్యహోమం, గ్రంధి పవిత్ర సమర్పణ, మూలమూర్తులకు విశేష ఉపచారాలు ఘనంగా చేపట్టారు. పవిత్రోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందారు. సాయంత్రం యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# కొండంత వివాదంలో అరకు కాఫీ రుచులు!

**తిరుమలలో జిసిసి రీటైల్ ఔట్‌లెట్‌కు టిటిడి సుముఖత**

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యం లక్ష మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలలో ఇప్పటికే దుకాణాల ఏర్పాటు కొండంత వివాదం రగులుతుండగా సందట్లో సడేమియా అన్నట్లు టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు అరకు కాఫీ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటుకు సుముఖత చూపడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే తిరుమలలో సిఆర్ఒ ప్రాంతం సమీపంలో, భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన రెండు మూడు ప్రైవేట్ డెయిరీలతో బాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పాల ఉత్పత్తుల విక్రయాల ఔట్‌లెట్‌లు నడుస్తున్నాయి.




తాజాగా తిరుమలలో భక్తుల కోసం జిసిసి ఔట్‌లెట్ ఏర్పాటుకు స్థలం ఎంపిక, అనుమతులివ్వడం వెనుక పెద్ద చర్చ మొదలైంది. తిరుమలలో ఏ వ్యాపారం అయినా భక్తుల సందడిపైనే ఆధారపడి నడుస్తుంది. అలాంటిది ఇప్పటికే స్థానికంగా వందల సంఖ్యలో టీ కేటిల్ నడుపుతున్న స్థానికులు ఉన్నారు. కొందరు అద్దెలు కూడా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో తిరుమలో జిసిసి ఉత్పత్తుల ఔట్ లెట్ నిర్వహించుకునే అవకాశం దక్కిందనేది కూడా గుప్పుమంటోంది. టిటిడి మాత్రం ఇదీ ప్రభుత్వ నిర్ణయమని, ప్రభుత్వం ఆదేశాలతోనే మన రాష్ట్రంలో గిరిజనులు పండించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని చెబుతున్నారు. అదేగాక దేవదేవుడు తిరుమలేశుని అవసరాల కోసం గిరిజన సహకార సంస్థ (జిసిసి) నుండి వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.12.97కోట్లతో నాణ్యమైన సరకులు తీసుకునేందుకు అధికారికంగా ఆమోదముద్ర వేశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని ఆలోచనతో నిర్ణయం తీసుకోవడం జరిగింది. తిరుమలలో సిఆర్ఒ ప్రాంతంలో జిసిసి రిటైల్ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పాటు నామినేషన్ పద్ధతిలో జిసిసి నుండి సరకులను కొనుగోలు చేసి, మార్కెట్లో దొరికే ఇతర బ్రాండ్లతో పోలిస్తే జిసిసి అందించే ఇన్‌స్టంట్ కాఫీ పొడి ధర కాస్త ఎక్కువ. అయినా టిటిడి బోర్డు దీనికే మొగ్గుచూపింది. జిసిసి సరఫరా చేసే సరుకుల నమూనాలను కూడా తిరుమలలోని డబ్ల్యుఎఫ్ పరిశోధనశాలలో పరీక్షించారు. టిటిడి నిబంధనల మేరకు నాణ్యత ఉన్నట్లు క్వాలిటీ మేనేజర్ ధ్రువీకరించడంతో ఇతర బ్రాండ్ల కంటే జిసిసి ఇన్‌స్టెంట్ కాఫీ పొడి ధర కొంత అధికమైనా అందులో కల్తీ లేకపోవడం, జిఐ ట్యాగ్ గుర్తింపుతో అరాబికా కాఫీ కావడంతో టిటిడి బోర్డు పెద్దలు అంగీకారం తెలిపారు. టిటిడి పెద్దల తాజా నిర్ణయంతో తిరుమలకు వచ్చే భక్తులకు జిసిసి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు విక్రయాలకు స్థలాన్ని కేటాయించింది. పిఎసి 2 వద్ద (రెండో న్యూ సత్రం దగ్గర గతంలో దొడ్ల డెయిరీ ఉన్న స్థలంలో) 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనుపషీట్ రూఫింగ్‌తో ఈ ప్రత్యేక దుకాణం అందుబాటులోకి రానుంది. ఇక్కడ గిరిజనులు సేకరించిన స్వచ్ఛమైన తేనె, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తులను భక్తులకు విక్రయిస్తారు.

కేటాయింపు విషయంలో టిటిడి కొన్ని కఠిన నిబంధనలు విధించినట్లు తెలుస్తోంది. తేనె, కుంకుడు కాయల పొడి, ఎండుమిర్చి తదితర వస్తువులను నామినేషన్ పద్ధతిలో తీసుకోవాలని కమిటీ సూచించింది. కుంకుమ పొడి, కారం, పసుపు వంటి వాటిని తగ్గింపు ధరలపైన అందుబాటులోకి తేవాలని చర్చలు జరుగుతున్నాయి.



## అనధికార స్టిక్కర్లపై కొరఢా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, విద్యాకేంద్రం తిరుపతి నగరంలో పలు రకాలుగా వాహనాలపై స్టిక్కర్లు వేసుకుని పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపించారు. అంబులెన్స్‌లు కూడా రోగులు లేకున్నా రద్దీ ప్రాంతాల్లో, కూడళ్లలో సైరన్‌లు వేసుకుని వాహనాలతో దూసుకెళుతున్న వారిపై కూడా తనిఖీలు చేశారు. ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్యానాయుడు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తిరుపతిలోని అనేక ప్రధాన కూడళ్లలో వాహనాలకు ప్రెస్, పోలీస్, జ్యూడీషియల్, ప్రభుత్వ వాహనాలు, ఆన్‌డ్యూటీ గవర్నమెంట్, ఎస్‌పిడిసిఎల్, ఎడ్యుకేషన్, మెడికల్ వంటి తదితర విభాగాలు ఇలా రకరకాల పేరుతో స్టిక్కర్లు వేసుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మందుసేవించి తిరుగుతున్నారు. దీనివల్ల నిజమైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం. ఈ సమాచారంతో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలపై ఉన్న అనధికారిక స్టిక్కర్స్ తీసివేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు.



శ్రీకాళహస్తి పురవీధుల్లో దర్శనం ఇస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు

## ద్రౌపదమ్మ వసంతోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్రౌపదమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో వైభవంగా ఊరేగింపు జరిపారు. వధువుగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్, ఆలయ చైర్మన్ ఎంఎస్‌రెడ్డి దఫేదార్ పాల్గొన్నారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాల్లో ఆలయ ఇఒ బికె వెంకటేశులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. తరువాత స్వామి వారికి ప్రత్యేకాలంకారం జరిపారు. వర్షాభావ కారణంగా ఆగస్టు 1న మృత్యుంజ స్వామి ఆలయం వద్ద శత సహస్రఘట్టాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టినట్లు ఇఒ వెంకటేశులు తెలిపారు.



## కృత్రిమమేధ సాంకేతికత పరిశోధనపై డిసెంబర్ 4, 5తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిసెంబర్‌లో 4, 5 తేదీల్లో రెండురోజులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ ఆవిష్కరించారు. "కృత్రిమ మేధస్సులో డేటా, హార్డ్‌వేర్ ఫిన్‌టెక్ సమగ్రతతో నూతన సాంకేతిక సరిహద్దుల అభివృద్ధి" అనే అంశంతో ఈ అంతర్జాతీయ సదస్సు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిఎస్టీ క్యూరీఏఐ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 4, 5 తేదీలలో హైబ్రిడ్ విధానంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష, ఐసిఎఐఆర్ 2026 కన్వీనర్ ఆచార్య పి. వెంకట కృష్ణ పాల్గొన్నారు. ప్రత్యక్ష వర్చువల్ విధానాల్లో పరిశోధనా పత్రాల ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, హార్డ్‌వేర్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అభివృద్ధి చెందుతున్న అంతరశాఖ పరిశోధనా రంగాల్లో తాజా పరిశోధనలు, సాంకేతిక పరిణామాలు, ఆవిష్కరణలపై చర్చించేందుకు పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పాలసీ మేకర్స్, పారిశ్రామికవేత్తలు విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం. సదస్సులో ఏఐ డేటా సైన్స్, ఏఐ హార్డ్‌వేర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అండ్ ఎఐడ్రివెన్ ఫైనాన్షియల్ సిస్టమ్స్, ఎమర్జింగ్ ఇంటర్‌డిసిప్లినరీ ఏరియాస్ అనే నాలుగు ప్రధాన ట్రాక్‌లలో పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు.



ఉత్తమ పరిశోధనలకు బెస్ట్ పేపర్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు, బెస్ట్ ఉమెన్ రీసెర్చర్ ప్రజెంటేషన్ అవార్డు, బెస్ట్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ పేపర్ అవార్డులను అందించనున్నారు. పూర్తి పరిశోధనా పత్రాల సమర్పణకు ఆగస్టు 10 గడువుగా నిర్ణయించారు. ఎంపికైన పత్రాల వివరాలను సెప్టెంబర్ 10న తెలియజేస్తారు. కెమెరారెడీ పేపర్ సమర్పణకు సెప్టెంబర్ 30 చివరి తేదీగా నిర్ణయించారు. ఉపకులపతి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష దేశ, విదేశాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఆవిష్కర్తలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి సదస్సులో చురుకుగా పాల్గొనాలని కోరారు.

# గురుసాక్షాత్ పరంబ్రహ్మ

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః



అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే జ్యోతినని వెలిగింఆచేవారు మన కన్నతల్లిదండ్రులు ప్రథమ గురువులుగా కాగా, మిగిలిన జీవితం మొత్తం మార్గనిర్దేశనం చేసేవారు గురువు. మానవ జీవిత చరితార్థానికి, భగవదర్శనానికి బాటలు వేసేవారే గురువులు. గురుపూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూర్ణిమ ఏదైనా పవిత్రమెనదే. వ్యాసభగవానుని జన్మదినం. అష్టాదశ పురణాలను మనకు అందించిన మహనీయుని జన్మదినం కారణంగా గురుస్థానములో ఆ వ్యాసభగవానుని స్మరిస్తూ చేసుకునే పవిత్రమైన రోజు. ఆషాఢ పూర్ణిమను గురు పూజతో ఉత్సవం చేయటం మన భారతీయ సంస్కృతిలో భాగమైనది. గురువుని త్రిమూర్తి స్వరూపంగా భావిస్తాము. మానవ చరిత్రలోనే అపూర్వమైన ఆధ్యాత్మిక పర్వదినంగా నిలచినది వ్యాస జన్మతిథి. పౌరాణికులు, కథకులు, బోధకులు కూడా గురువుతే పురాణాలలో నిగూఢంగా నిహితం చేయబడిన విషయాలను మానవజాతి జ్ఞానం సంపాదించాలంటే వ్యాస మహర్షి అనుగ్రహం అవసరము. అందుచేత మనం వ్యాస పూర్ణిమ నాడు పౌరాణికులను, మన గురువులను ధూపదీప నైవేద్యాలతో పూజించి తగిన విధంగా సత్కరించాలి. గురువులకు గురువుగా ఖ్యాతి గడించిన మహనీయుడు వ్యాసమహర్షి. అందువలన లోకంలో అందర్కూ శ్రీ వ్యాస మహర్షిని పూజించి, గౌరవించాలి. తమ జీవితాలకు సరైన మార్గ నిర్దేశనం చేయటానికి కావలసిన సాధన సంపత్తి గురువు ద్వారా లభిస్తుందని అందరి విశ్వాసం.



గురువులుగా ప్రసిద్ధిగాంచిన , ఆది శంకరులు, దత్తాత్రేయుడు, గురు దక్షి ణామూర్తి మొలైనవారిని ఈరోజు కొలుస్తారు. ఈ గురుపూర్ణిమ ఉత్సవాన్ని శ్రీ ఆదిశంకరులే ప్రారంభించారని చెబుతారు. గురుపూర్ణిమ నాడు ఈ రోజు దేవాలయాలలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఉదయం పాలాభిషే కాలు, అర్చనలు నిర్వహిస్తారు. రోజంతా శ్రీ గురుచరిత్ర, సాయిచరిత్ర పుస్తకాలను, ఉడకబెట్టిన శెనగలను ప్రసాదంగా పంచి పెట్టటమే విశిష్టత.

**కామధేనువు మరి కల్పవృక్షము కూడ గురువు మనసునందు కొలువుయుండు**
**గురువునకు సరియగు గురుదేవులే సుమా ప్రకృతి పలుకునిచ్చు ప్రభు మనకు !!**

సమస్త ప్రకృతిలో నిండి నిభిఢీకృత్కుడై జానానందాన్ని, ప్రేమను పంచటానికి గురువు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆ మహత్తర జ్ఞానాన్ని అందుకోవటానికి శిష్యులకు చిత్తశుద్ధి అవసరం. మనిషిలో గుప్తంగా దాగి యున్న జ్ఞానాన్ని, విశేష శక్తియుక్తులను వెలికితీసి మార్గనిర్దేశనం కలిగించేవారు గురువు. '

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# చిన్నారులకు దూరంగా !

**పిల్లలు టేబుల్ మూలలు తగలకుండా, మెట్ల మీద జారకుండా.. ఇలా చాలా జాగ్రత్తలే తీసుకుని ఉంటారు.**



మామూలు బ్యాటరీలు చిన్న పిల్లల చేతిలో కనిపిస్తాయి. వెంటనే తీసేయొచ్చు. కాని బటన్ తరహా వాటితోనే ప్రమాదం. పిల్లల బొమ్మలు, కొన్నరకాల రిమోట్‌లలో ఇవి ఉంటాయి. పొరపాటు పిల్లల చేతికి చిక్కి, నోట్లో పెట్టుకున్నారో ప్రమాదం. జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి కూడా. కాబట్టి, గమనించుకోండి.

- గోళీలు, పూసలు, మాగ్నెటిక్ బాల్స్.. ఇవీ చిన్నారులను ఆకర్షించేవే. మెరుసూనత రంగులతో ఉంటాయి కదా! వెంటనే నోట్లో పెట్టేసుకుంటారు. గొంతులో ఇరుక్కుపోవడమో, పేగులను దెబ్బతీ యడమో చేస్తాయి కూడా. కాబట్టి, గమనించుకోండి.
- గోళీలు, పూసలు, మాగ్నెటిక్ బాల్స్.. ఇవీ చిన్నారులను ఆకర్షించేవే మెరుస్తూ రంగులతో ఉంటాయి కదా! వెంటనే నోట్లో పెట్టేసుకుం టారు. గొంతులో ఇరుక్కుపోవడమో, పేగులను దెబ్బతీయడమో చేస్తాయి. వీటినీ అందని చోట్ల ఉంచడం మేలు.
- స్విచ్‌బోర్డుల్లో వేళ్లు ఎక్కడ పెడతారో అని చాలా మంది వాటిని మూసేస్తున్నారు. కానీ ఛార్జింగ్ వైర్లు, కేబుల్స్‌ని మాత్రం స్విచ్ బోర్డులకు పెట్టి వదిలేస్తుంటారు. పొరపాటున స్విచ్ ఆపడం మరిచిపోయినా, వైర్లు ఎక్క డైనా తెగినా ప్రమాదమే. వాటిని పిల్లలు నోట్లో పెట్టుకుంటే షాక్‌కి గురవుతారు.
- అవసరానికి పని కొస్తాయని బకెట్లు, టుబ్బల్లో నీటిని పట్టి ఉంచు తాం. కానీ చిన్నపిల్లలు నీటిపట్ల ఎలా ఆకర్షితు లవుతారో తెలిసిందేగా? చిన్న ప్రాణాలు పొం పాటున వాటిల్లో పడ్డారంటే ఊపిరాడదు. చిన్నారులకు అందుబాట ులో ఉండకుండా అయినా చూడండి. లేదా వాటిపై ఏవైనా మూతలు ఏర్పాటు చేయడమో మరేవైనా జాగ్రత్తలు తీసుకోవడమో. ▫



# 'మిన్ను' తాకిన సంకల్పంతో ..

సొంతంగా కలలు కని వాటిని నిజం చేసుకోవాలని మాజీ రాష్ట్రపతి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎపిజె అబ్దుల్‌కలాం ఉపదేశిస్తుం చారు. అలాంటి ధోరణిలోనే ఆలోచించిన ఓ తనయ మిన్నుజోషి తన తండ్రి కలనే తన కలగా ఎంచుకొని సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారు. సాధారణంగా 'వివాహం విద్యానాశాయః' అంటుంటారు దానిలోని అర్థం గ్రహించిన మిన్ను ఎంతో చాకచక్యంగా తొలుత కుటుంబాన్ని చదువును సమన్వయం చేసుకుంటూ పోలీసుశాఖలో క్లర్క్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సమన్వయం చేసుకుంటూ సివిల్‌లో విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె మహారాష్ట్రలోని అమరావతిలో ఉద్యోగం ఉన్నారు. కేరళలోని పత్తనంతిట్టకు చెందిన మిన్ను, ఓ పోలీస్ అధికారి కూతురు. ఆమె విద్యార్థిగా ఉండగానే తండ్రి మరణించారు. ప్రభుత్వం అందించే కారుణ్య నియామకం కింద 2012లో కేరళ పోలీస్ శాఖలో క్లర్క్‌గా చేరారు. తన కుమార్తె సివిల్ సర్వెంట్ కావాలన్నది ఆమె తండ్రి కల. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా చదువును కొనసాగించిన ఆమె, కేరళ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఇస్రో అధికారి జోషి డి.జె.తో వివాహమైంది. ఓ పాప కూడా. తనకున్న చిన్న ఉద్యోగంతో సరిపెట్టుకోకుండా ఒక పక్క ఇంటిపని, మరో పక్క ఉద్యోగం, ఇంకా పక్క సివిల్స్‌ను కఠోర శ్రమతో పూర్తి చేశారు. ఐదుసార్లు విఫలమైనా నిరాశ చెందలేదు. పట్టు విడవలేదు. ఆరో ప్రయత్నంలో 150 ఆల్ ఇండియా ర్యాంకు సాధించరు. తండ్రి కలను నిజం చేయగలిగానన్న సంతృప్తితో ప్రస్తుతం మిన్ను జోషి మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో భట్కులితివాసా సబ్‌డివిజన్‌కు అసిస్టెంట్ కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. ఎన్ని బాధ్యతలున్నా లక్ష్య సాధనలో పట్టుదల ఉంటే సాధించలేనిదే ఉండదని 'మిన్ను' ప్రయత్నం నిరూపించింది. ▫

# రోజువారీ శుభ్రంతో అందం



**కొంతమంది ముఖంపై ఎంత వెతికినా ఒక్క మొటిమైనా కనిపించదు. ఇక నల్లమచ్చల జాడే దొరకదు. మేకప్ మాయజాలం లేకుండానే న్యాచురల్ బ్యూటీస్‌గా కనిపించేస్తుంటారు. ఇలాంటి వాళ్లను చూడగానే.. అందం కోసం ఎన్నెన్ని సౌందర్య చికిత్సలు తీసుకుంటారో అనిపిస్తుంటుంది. నిజానికి ఈ మహిమంతా చికిత్సలు, చిట్కాల్లో కాదు. వారు పాటించే రోజువారీ అలవాట్ల.. మరి, అవేంటో తెలుసుకుందాం..**

- ఉదయం నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు ఈ రెండు సందర్భాల్లో ముఖం శుభ్ర పరచుకునే వారు చాలా తక్కువ మంది. ముఖంపై మొటిమలు రావడానికి ఈ నిర్లక్ష్యమూ ఓ కారణం. అందుకే ఈ రెండు సంద ర్భాలతో పాటు.. చెమట ఎక్కువగా వచ్చినప్పుడు తప్పని సరిగా ముఖం శుభ్రం చేసుకోవాలి. ఫలితంగా ముఖంపై దుమ్ము, జిడ్డుదనం తొలగిపోయి చర్మ రంధ్రాలు మూసుకుపోవు. తద్వారా మొటిమలూ ఏర్పడవు. అయితే ఈ క్రమంలో చర్మతత్వానికి సరిపడే ఫేస్‌వాష్‌ను ఎంచుకోవడమూ ముఖ్యమే.
- పబ్లిక్ టాయిలెట్ కంటే మొబైల్ స్క్రీన్ ఎక్కువ అపరిశుభ్రంగా ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఫోన్ మాట్లాడేటప్పుడు, మొబైల్‌ను తాకిన చేతులతోనే ముఖాన్ని తడుముకోవడం వల్ల ఈ క్రిములు ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. ఈ సమస్య దరిచేర కుండా.. ఫోన్ స్క్రీన్‌ను ఎప్పటికప్పుడు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు
- చేతుల్ని పదే పదే ముఖానికి తాకించే అలవాటు కొంతమందికి ఉంటుంది. ఫలితంగా చేతులకున్న నక్రిములు, మురికి ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. అందుకే ముఖం కడుక్కునేటప్పుడు తప్ప అసలు చేతుల్ని ముఖానికి తాకించకుండా జాగ్రత్తపడాలి
- రోజూ వాడే క్రమంలో మన చర్మం, జుట్టు కుదుళ్లలో ఉన్న జిడ్డు దిండు కవర్ల పైకి చేరుతుంది. అది వాతావరణంలోని దుమ్మును ఆకర్షిస్తుంది. ఈ అపరిశుభ్రమైన దిండ్లనే వారాల తరబడి వాడడం, ఇతరులు వీటిని ఉపయోగిం చడం వల్ల ముఖంపై మొటిమలొస్తాయి. కాబట్టి వారానికోసారైనా దిండ్ల కవర్లను మార్చుకోవడం, ఎవరి దిండువారే వాడుకోవడం మంచిదంటురు. ▫

# బుఖారీ పులావ్



బాస్మతి బియ్యం: అర కిలో, మటన్: అర కిలో, క్యారెట్ తురుము: ఒక కప్పు, పచ్చి బఠాణీ: అర కప్పు, టమాట ముక్కలు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, జీడిపప్పు: పావుకప్పు, కిస్మిస్: ఒక టేబుల్ స్పూన్, అక్రోట్స్: ఐదు, నూనె: అర కప్పు, కారం: ఒక టేబుల్ స్పూన్,

నంముందుగా బాస్మతి బియ్యాన్ని అరగంటపాటు నానబెట్టుకుని పొడిపొడిగా వండాలి. స్టవ్‌మీద కుక్కర్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడయ్యాక జీడిపప్పు, అక్రోట్స్, కిస్మిస్ జోడించి బాగా వేయించి పక్కన పెట్టాలి. అదే నెయ్యిలో నూనె వేసి దాల్చిన చెక్క, సాజీర, అనాస పువ్వు, యాలకులు, లవంగాలు వేయాలి. కాసేపు వేగాక తరిగిన ఉల్లిగడ్డ, మిర్చి, టమాట కలపాలి. అన్నీ బాగా వేగాక మటన్ వేయాలి. రెండు నిమిషాలు మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు, క్యారెట్ తురుము, పచ్చిబఠాణీ, తగినంత ఉప్పు వేసి పది నిమిషాలు సన్నటి మంటపై మగ్గనివ్వాలి. అర లీటర్ నీళ్ల పోసి కుక్కర్ మూత పెట్టి ఐదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. బాగా ఉడికిన మటన్‌లో.. ఉడికించి పెట్టుకున్న బాస్మతి రైస్ వేసి కలిపి పైనుంచి వేయించిన డ్రైఫ్రూట్స్, నెయ్యి వేసి మరో రెండు నిమిషాలు మూత పెట్టుకుంటే నోరూరించే బుఖారీ పులావ్ సిద్ధం. ▫

# తెర

## ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'



బ్లాక్ బస్టర్ 'బ్లాస్ట్ జోన్' తర్వాత 'పొలిమేర' ఫ్రాంచైజీలోకి యాక్షన్ కింగ్ అర్జున్.. ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'. ఓటీటీలో ..'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, థియేటర్లలో 'పొలిమేర 2'...తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న విజయవంతమైన హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ఇప్పుడు పొలిమేర3గా మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో 'పొలిమేర 3' చిత్రాన్ని వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ అండ్, ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు దివంగత నారాయణదాస్ నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సిని మాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్స్‌పై వంశీ నంది పాటి, జాన్వీ నారంగ్‌లు ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ రెండు సంస్థల కలయికతో మరింత పవర్‌ఫుల్‌గా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నేడు సికింద్రాబాద్‌లోని ఓ గణేష్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత, ఎగ్జిబిటర్ నారాయణదాస్ నారంగ్ జయంతి సందర్భంగా చిత్రాన్ని ప్రారంభించడం విశేషంగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇవ్వగా, సీనియర్ నిర్మాత డి. సురేష్ బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. యువ నిర్మాత బన్నీవాస్, ఎగ్జిబిటర్ సదానంద్ గౌడ్ చిత్ర బౌండెడ్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించి విజయాన్ని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ప్రముఖ నిర్మాత సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 'టాక్సిక్' స్టైల్ పోస్టర్ రిలీజ్



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్' విడుదలకు ఇక కేవలం నెల రోజులే మిగిలాయి. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా కౌంట్‌డౌన్‌ను ప్రారంభిస్తూ మేకర్స్ మరో కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ఫియర్, మిస్టరీ, స్టైల్ కలగలిసిన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ పోస్టర్‌లో యశ్ ప్రశాంతంగా సిగరెట్ వెలిగిస్తున్నట్లు కనిపిస్తున్నారు. పొగ, చీకటి కారణంగా ఆయన ముఖం పూర్తిగా కనిపించకుండా మిస్టరీని కొనసాగించారు. ఆయన చేతి మాత్రం రక్తంతో తడిసి ఉండటం, వేళ్ల నుంచి రక్తపు చుక్కలు జారుతూ తెల్లటి షర్ట్‌పై పడటం చూస్తే ఒక టెర్రిఫిక్ యాక్షన్ సీన్‌ని చూపిస్తోంది. యశ్ రఫ్ బియర్డ్, టాటూలతో చేతులు, స్టైలిష్ రింగ్స్, ట్రెంచ్ ఓవర్‌కోట్‌తో పవర్‌ఫుల్‌గా కనిపించారు. బ్లాక్ అండ్ వైట్ బ్యాక్‌డ్రాప్‌లో రక్తపు ఎరుపు రంగు, సిగరెట్ నిప్పు మాత్రమే ప్రత్యేకంగా హైలైట్ అవుతూ పోస్టర్‌ను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాయి. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మించిన 'టాక్సిక్' తన ప్రత్యేకమైన ప్రమోషనల్ క్యాంపెయిన్‌తో ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. కథ గురించి ఎలాంటి వివరాలు వెల్లడించకుండా విడుదల చేస్తున్న ప్రతి పోస్టర్ ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాక్సిక్ ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

## 'మహేంద్రగిరి వారాహి' సెప్టెంబర్ 11న విడుదల



సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మహేంద్రగిరి వారాహి' మహేంద్రగిరి నేపథ్యంగా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్నో అంతుచిక్కని సంఘటనలు, రహస్యాలు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించబోతుంది. ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. . ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ: . 'మహేంద్రగిరి వారాహి' జర్నీ రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైంది. సంతోష్ నాకు ఈ సబ్జెక్ట్ చెప్పిన తర్వాత ఒక మంచి నిర్మాత కోసం ఎదురు చూశాం. మధు, లక్ష్మణ్ చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. ఈ సినిమాకు ఏం కావాలో అన్నీ సమకూర్చి, చాలా గొప్పగా తీర్చిదిద్దారు. టీజర్‌ను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ఈ సినిమాలో ఇంకా చాలా సర్‌ప్రైజ్ ట్విస్టులు, ఊహించని సన్నివేశాలు, ఆసక్తికరమైన మలుపులు ఉన్నాయి. మీ అందరి ఆశీస్సులతో, అమ్మవారి ఆశీస్సులతో సెప్టెంబర్ 11న థియేటర్లలోకి వస్తున్నాం. సినిమాను మరింత అద్భుతంగా తీర్చిదిద్ది మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ సినిమా చూసిన తర్వాత మీరు తప్పకుండా సంతృప్తి చెందుతారు. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే సినిమా అవుతుంది. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ.. నాకు ఈ అవకాశం ఇచ్చిన లక్ష్మణ్ గారికి, మధు గారికి ధన్యవాదాలు. అలాగే సుమంత్ కూడా నన్ను బలంగా నమ్మారు

## 'భగవంతుడు' 'సిత్తరాల నవ్వు' పాటరిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా 'భగవంతుడు'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రవి పనస. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సిత్తరాల నవ్వు' రిలీజ్ చేశారు. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, డైరెక్టర్ జి జి విహారి ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. ప్రముఖ సింగర్ జావెద్ అలీ రిపీటెడ్‌గా వినేలా పాడారు. 'సిత్తరాల నవ్వు' పాట ఎలా ఉందో చూస్తే సిత్తరాల నవ్వు, అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు, అరే పారే సెలయేళ్లు, ఒంపు పరవళ్లు..అంటూ సాగుతూ ఏరువాక పున్నమి లాంటి అమ్మాయి, కొండగాలి దేవర వంటి అబ్బాయి మధ్య ప్రేమను చూపిస్తూ రూపొందించిన ఈ మట్టి పాట ప్రతి ఒక్కరిని ఇంప్రెస్ చేస్తోంది.

## నటుడిగానే నా ప్రయాణం: జై కృష్ణ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ బాబు సోదరుడు రమేశ్ బాబు తనయుడు జై కృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. నటుడిగా తనను తాను నిరూపించుకుని, ఇండస్ట్రీలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే తన లక్ష్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జై కృష్ణ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం శ్రీనివాస మంగాపురం విడుదల కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జై కృష్ణ మాట్లాడుతూ, "దర్శకుడు అజయ్ తీర్చిదిద్దిన పాత్రలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉన్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను. నటుడిగా నా ప్రతిభను చాటుకోవడానికి ఇది ఒక చక్కని కథ. మంచి సినిమాలు చేసే నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన," అని పేర్కొన్నారు. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, "మహేశ్ బాబుతరహాలోనే జై కృష్ణ కూడా ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలిచిపోయే కథానాయకుడు అవుతాడు. సినిమా నేను అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది," అని ధీమా వ్యక్తం చేశారు. నటుడు నరేశ్ విజయకృష్ణ మాట్లాడుతూ, కృష్ణవారసత్వాన్ని జై కృష్ణ ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకెళ్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నటులు బ్రహ్మాజీ, వడ్లమాని శ్రీనివాస్, సినిమాటోగ్రాఫర్ జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'తీరం' టైటిల్ సాంగ్ విడుదల



భావోద్వేగ కథతో ప్రేక్షకుల ముందుకు రానున్న 'తీరం' హైదరాబాద్‌ల టోని ప్రసాద్ ల్యాబ్‌లో శ్రీ భవానీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న భావోద్వేగ ప్రధాన చిత్రం 'తీరం' టైటిల్ సాంగ్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 'పుష్ప' ఫేమ్ నటుడు జగదీష్, ఫన్ బకెట్ మహేష్ విట్ట, నటుడు రాజ్ కుమార్ కసిరెడ్డి, దర్శకుడు ప్రసాద్, జబర్దస్త్ సద్దాం, నటుడు కుమానన్ తదితరులు హాజరై టైటిల్ సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ మునగాల మాట్లాడుతూ, తీరం' ప్రతి ఒక్కరి హృదయాలను తాకేలా భావోద్వేగభరితమైన కథతో రూపొందుతోందన్నారు. చిత్రీకరణ విజయవంతంగా పూర్తై ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు నిర్మాత ఉపేందర్ గంగావెల్లి మాట్లాడుతూ, దర్శకుడు వంశీ మునగాల కథ వినిపించిన వెంటనే ఎంతో నచ్చిందన్నారు. కథపై నమ్మకంతోనే ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చానని తెలిపారు. సినిమా నిర్మాణం తుది దశకు చేరుకుందని, విడుదల తేదీతో పాటు ఇతర విశేషాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. హీరో ప్రభు మాట్లాడుతూ, షార్ట్ ఫిల్మ్స్‌తో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించి ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌లో హీరోగా నటించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నటుడు జగదీష్ మాట్లాడుతూ, తీరం అనే టైటిల్ చాలా అర్థవంతంగా ఉందన్నారు.

## 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' అక్టోబరు 2 విడుదల



'చిట్టిబాబు'గా విక్టరీ వెంకటేష్ పాత్ర పరిచయం. విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొం దుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఎకె 47)' ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తొలి పాత్రగా విక్టరీ వెంకటేష్ పోషిస్తున్న 'చిట్టిబాబు' పాత్రను పరిచయం చేయగా, అనంతరం శ్రీనిధి శెట్టి, యువినా పార్థవి, రాజా ప్రజ్వల్ పాత్రలను పరిచయం చేయనున్నారు. ఈ నలుగురి పాత్రలు ఈ ఆత్మీయ కుటుంబ కథకు హృదయంగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ చిట్టిబాబు పాత్రలో అలరించ నున్నారు. కుటుంబాన్ని ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ఒకే తాటిపై నడిపించే కుటుంబ పెద్దగా ఆయన పాత్ర ఆకట్టుకోనుంది. విడుదలైన పాత్ర పరిచయ వీడియోలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్ కనిపిస్తూ, నవ్వులు, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలతో నిండిన చిత్ర ప్రపంచాన్ని అందంగా పరిచయం చేశారు. సహజమైన నటన, అద్భుతమైన కామెడీ టైమింగ్, కుటుంబ కథా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటేష్ మరోసారి అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే పాత్రతో రాబోతున్నారు. చిట్టిబాబు పాత్ర ఆయన కెరీర్‌లో మరో చిరస్మరణీ యమైన పాత్రగా నిలిచేలా కనిపి స్తోంది. ఆనందం, అనుబంధాలు, కుటుంబ విలువ లకు ప్రతిరూపంగా ఈ పాత్ర ఉండబోతోంది. తొలి పాత్ర పరిచయంతోనే చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక వరుసగా రానున్న ఇతర పాత్రల పరిచయాలు కూడా 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని మరింత ఆసక్తికరంగా ప్రేక్షకులకు చేరువ చేయనున్నాయి.

# టీమిండియా వరుస ఓటములపై..
# గంభీర్, శ్రేయస్ అయ్యర్‌లకు చెక్!



**న్యూఢిల్లీ:** టీమిండియా వరుస ఓటములపై సమీక్ష నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) సిద్ధమైంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ 6 టి20లు, రెండు వన్డేల్లో ఓటమిపాలైంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని విదేశాల్లో భారత జట్టు ప్రదర్శన మెరుగయ్యేందుకు చేపట్టాల్సిన మార్పులు, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలపై వివరంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ వరుస ఓటముల వెనుక గల కారణాలను బిసిసిఐ ఆరా తీయనుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో అత్యవసర సమావేశం నిర్వహించి వరుస పరాజయాలకు వివరణ కోరాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. భారత జట్టు పేలవ ప్రదర్శనపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో ప్రస్తుతం జరుగుతున్న టి20 సిరీస్ ముగిసిన వెంటనే ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టీమిండియా టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సెలెక్టర్లు, బిసిసిఐ అధికారులు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో తక్షణ నిర్ణయాలేవి తీసుకోనప్పటికీ గంభీర్, శ్రేయ్యర్ ఇద్దరికీ ఒక గట్టి వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉంది. గంభీర్‌కు 2027 వరకు ఒప్పందం ఉన్నందున అతని పదవికి వచ్చే ముప్పు ఏం లేనప్పటికీ, వన్డే, టి20 క్రికెట్‌లో జట్టు ఘోర ప్రదర్శన ఒత్తిడిని పెంచుతోంది. టెస్ట్‌ల్లో భారత ప్రదర్శన మరీ నాసిరకంగా తయారైంది.

పరిస్థితులు ఇలానే కొనసాగితే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా భారత్ పేలవ ప్రదర్శన కనబర్చే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దాంతోనే గంభీర్‌తో అత్యవసర సమావేశానికి బిసిసిఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొత్త టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వైఖరిపై కూడా ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. కాకపోతే అతనికి మరికొన్ని సిరీస్‌ల వరకు అవకాశం ఇవ్వవచ్చు. 2026 ఆసియా గేమ్స్‌లో భారత్ గోల్డ్ మెడల్ సాధిస్తే అతనిపై ఉన్న ఒత్తిడి తగ్గనుంది. ఇదే సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కింద పని చేసే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.



## వరల్డ్ కప్ మహిళల పిస్టల్..
# ఈషాకు స్వర్ణం
## మనుకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్ డబుల్ పోడియం ఫినిష్‌ను సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌లో ఈషా నిలకడైన ప్రదర్శన కనబరిచి, 40 హిట్‌లతో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మను పోరాడి, కీలకమైన షూట్‌ఆఫ్‌లో నెగ్గి, 28 హిట్‌లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇద్దరు భారతీయ షూటర్లు ఆకట్టుకున్నారు, మను 586-20న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఈషా 585-18న స్కోరుతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌లో తమ స్థానాలను సునాయాసంగా ఖరారు చేసుకున్నారు. ఇక మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్ రాహి సర్నోబత్ 582 -16న స్కోరుతో పతకాల రౌండ్‌కు అర్హత సాధించడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (576-20న) మరియు అభిజ్ఞా అశోక్ పాటిల్ (573-16న) ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ (ఆర్‌పీఓ) విభాగం కింద పోటీపడ్డారు. కాగా 21 ఏళ్ల హైదరాబాదీ షూటర్ ఈషా ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఈ యేడాది ఆరంభంలో మ్యూనిచ్‌లో జరిగిన ఫైనల్‌లో 43 హిట్స్‌తో సీనియర్, జూనియర్ ప్రపంచ రికార్డులు రెండింటినీ నెలకొల్పి ఆమె చరిత్ర సృష్టించింది. పారిస్ 2024 ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత అయిన ఈషా, ప్రపంచంలోని అగ్రశ్రేణి పిస్టల్ షూటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

## కామన్వెల్త్ గేమ్స్ మహిళల వెయిట్ లిఫ్టింగ్
# జ్ఞానేశ్వరికి రజతం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026 మహిళల 53 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి జ్ఞానేశ్వరి యాదవ్ రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. గ్లాస్గోలో సోమవారం జరిగిన స్నాచ్ విభాగంలో జ్ఞానేశ్వరి తన మూడు ప్రయత్నాలలో 82 కేజీలు, 85 కేజీలు, 88 కేజీలను విజయవంతంగా ఎత్తి, ప్రారంభ విభాగం తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా డిడిహ్ 93 కేజీలతో అగ్రస్థానంలో నిలవగా, కెనడాకు చెందిన రెబెకా గ్రౌల్క్స్ 83 కేజీలతో మూడవ స్థానంలో నిలిచింది. జ్ఞానేశ్వరి అదే ఊపును క్లీన్ అండ్ జర్క్‌లో కూడా కొనసాగించి, తొలి ప్రయత్నంలో 103 కేజీలను సునాయాసంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో దానిని 107 కేజీలకు మెరుగుపరుచుకుంది. రజత పతకం కోసం జరిగిన పోరులో, జ్ఞానేశ్వరి అత్యంత కీలకమైన సమయంలో తన చివరి ప్రయత్నంలో 111 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి సత్తా చాటింది. ఈ ప్రదర్శన ఆమెకు పోడియంపై స్థానాన్ని సంపాదించి పెట్టడమే కాకుండా, ఒక కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనను, క్లీన్ అండ్ జర్క్‌లో (111 కిలోలు) ఒక కొత్త భారత జాతీయ రికార్డును, మరియు మొత్తం 199 కిలోల (88 కిలోలు + 111 కిలోలు) బరువుతో ఒక కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది.



## హెచ్‌సిఎ డివిజన్ లీగ్ క్రికెట్‌లో
# రాణించిన శ్రేయ్‌సింగ్

**హైదరాబాద్,జులై 27:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచసిఎ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్, బీ డివిజన్ రెండు రోజుల లీగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. బ్యాటర్లు భారీ స్కోర్లు నమోదు చేయగా, పలువురు బౌలర్లు ఐదు, ఆరు వికెట్లతో మెరిశారు. వర్షం కారణంగా కొన్ని మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి. చార్మినార్ 308 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులోని బ్యాటర్ శ్రేయ్‌సింగ్ 97 పరుగులతో శతకాన్ని మిస్‌అయినా 8 బౌండరీలు, మూడు సిక్స్‌లు సాధించి శెహభాష్ అనిపించుకున్నాడు. భావేష్ సేథ్ 88 పరుగులు చేశాడు. రిషబ్ బస్లాస్ 6 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి ఈఎంసీసీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 107/1తో నిలిచింది.ఎ డివిజన్: దయానంద్, స్పోర్టింగ్ ఎలెవన్ విజయాలు రౌండ్ 1 తొలి రోజు మ్యాచ్‌లో ఆర్. దయానంద్ జెమినీ ఫ్రెండ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జెమినీ ఫ్రెండ్స్ 124 పరుగులకు ఆలౌటవగా చిరాగ్ యాదవ్ (52), అవేజ్ అహ్మద్ (40) రాణించారు. ఎం. ధీరజ్ రావు 6/29తో చెలరేగాడు. అనంతరం దయానంద్ 125/4తో లక్ష్యాన్ని చేరుకుంది. రవి తేజ అజేయ అర్ధశతకం (50..) సాధించాడు.స్పోర్టింగ్ ఎక్స్‌ఐ కూడా ఎస్‌బిఐపై ఐదు వికెట్లతో గెలిచింది. ఎస్‌బిఐ 133 పరుగులకు ఆలౌట్ అవగా తనయ్ త్యాగరాజన్ 5/14తో అద్భుత బౌలింగ్ చేశాడు. అనంతరం యశ్ సత్వాలేకర్ (52) అర్ధశతకంతో స్పోర్టింగ్ ఎక్స్‌ఐ 19.4 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది.బడ్డింగ్ స్టార్ 43 ఓవర్లలో 142/2తో బలమైన స్థితిలో నిలిచింది. జైరామ్ కశ్యప్ (70), విభాన్ ఆదిత్య వర్మ (32 నాటౌట్) రాణించారు.కేంబ్రిడ్జ్ ఎక్స్‌ఐ 256 పరుగులు చేయగా, ఆశ్లేష్ వామన్ 73, అర్హాన్ సత్వాలేకర్ 59 రాణించారు. ఇంపీరియల్ తొలి రోజు 18 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసింది.డెక్కన్ వాండరర్స్ 37 ఓవర్లలో 246/3తో భారీ స్కోరు సాధించింది. నితీష్ రెడ్డి 112 బంతుల్లో 107 పరుగులతో శతకం నమోదు చేయగా, సాయి శరణ్ 68, హర్షిత్ చౌదరి 44 పరుగులు చేశారు.ఉమ్మడి రెండు జిల్లాల జట్లు కూడా తొలి ఇన్నింగ్స్‌లో వరుసగా 117, 230 పరుగులుచేశాయి. ఏఓసీఎవర్‌గ్రీన్, ఎస్సీఆర్ఎస్‌ఏడెక్కన్ క్రానికల్‌మ్యాచ్‌లు తడి మైదానం కారణంగా ఒక్క బంతికూడా పడకుండానే రద్దయ్యాయి.

## కామన్వెల్త్ బాక్సింగ్‌లో..
# క్వార్టర్ ఫైనల్స్‌కు సచిన్


**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కేజీల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత్ బాక్సర్ సచిన్ సివాచ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. బాక్సింగ్‌ఈవెంట్‌లో 26 యేళ్ల క్రీడాకారుడు, సోమవారం ఇక్కడ స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో జరిగిన పోరులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను 4-1 పాయింట్ల తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. హెవిట్ వేసిన రెండు వేగవంతమైన పిడిగుద్దులు ఒకటి కుడి నుంచి, మరొకటి ఎడమ నుంచి పోటీ గమనాన్ని నిర్దేశించాయి. తర్వాత సచిన్ రింగ్‌లో తెలివిగా కదులుతూ ఆంగ్లేయుడిపై దాడికి దిగి తన పంచ్‌లను విజయవంతంగా సంధించాడు. అదే సమయంలో హెవిట్ స్పష్టంగా పంచ్‌లు కొట్టడం కష్టతరం చేశాడు. చివరిలో, సచిన్ పూర్తి నియంత్రణలోఉండి, పక్కలనుండి వరుసగా పదునైన పంచ్‌లు విసురుతూ, పాయింట్ల విషయంలో న్యాయనిర్ణేతలు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చాడు. రెండో రౌండ్‌లో హెవిట్ దూకుడుగా బరిలోకి దిగి, భారత ఆటగాడిని కలవరపెట్టే ప్రయత్నంలో అతనిపైకి దూసుకెళ్లాడు. కానీ సచిన్ సంయమనం కోల్పోకుండా ఆ ఒత్తిడిని తట్టుకుని, తన స్థానాన్ని తిరిగి పొంది, సరైన స్కోరింగ్ ప్రదేశాలను అత్యంత సునాయాసంగా లక్ష్యంగా చేసుకుని విజయం సాధించాడు.

# పాలిమర్ కరెన్సీ నోట్లకు తొలి అడుగు
## రూ.10, రూ.20 నోట్లపై పైలట్ పరీక్షలు



**న్యూఢిల్లీ,జులై 27:** భారతదేశంలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆర్బీఐ ప్రతిపాదించిన మేరకు రూ.10, రూ.20 విలువ కలిగిన తలా 100 కోట్ల పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా విడుదల చేయడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలిమర్ నోట్లు ఎలా పనిచేస్తాయో అంచనా వేయడానికి ఈ ప్రయోగాత్మక విడుదల చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతేనే దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రవేశపెట్టే అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయంతో పాలిమర్ నోట్లపై ఆర్‌బిఐ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు గతంలో వెలువడిన వార్తలకు అధికారిక ధృవీకరణ లభించింది. ఆర్‌బిఐ ప్రకారం, పాలిమర్ నోట్లు ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. అధిక నగదు లావాదేవీలు జరిగే దేశాల్లో పాలిమర్ నోట్ల జీవితకాలం ఎక్కువగా ఉండటంతో వాటి వినియోగం ప్రయోజనకరమని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయని తెలిపింది.అయితే పాలిమర్ నోట్ల ప్రవేశంతో కాగితపు నోట్లను పూర్తిగా రద్దు చేయాలనే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీతో పాటు పాలిమర్ నోట్లు కూడా చలామణిలో ఉంటాయని, కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావాలనే ప్రతిపాదన లేదని పేర్కొంది.పాలిమర్ నోట్లు డిజిటల్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని ఆర్‌బిఐ తెలిపింది. అవి సాధారణ చలామణిలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై సమగ్ర అంచనా వేయవచ్చని పేర్కొంది.భౌతిక కరెన్సీ మరియు డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలు కాకుండా పరస్పర అనుబంధ వ్యవస్థలని, భవిష్యత్తులో కూడా రెండూ కలిసి కొనసాగుతాయని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

## కోల్ ఇండియా తొలి త్రైమాసిక లాభం రూ.8,852 కోట్లు
### ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్



**న్యూఢిల్లీ,జులై 27:** ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీ కోల్ ఇండియా స్వల్ప లాభాల వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ నికర లాభం గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. షేర్‌హోల్డర్లకు కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను నిర్ణయించేందుకు జులై 31ని రికార్డు తేదీగా నిర్ణయించింది. డివిడెండ్ మొత్తాన్ని ఆగస్టు 25, 2026లోపు చెల్లించనున్నట్లు తెలిపింది.తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.46,255 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.42,919 కోట్లు. ఎబిట్డా 4.1శాతం తగ్గి రూ.12, 069 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇది రూ.12,588 కోట్లు. ఎబిట్డా మార్జిన్ 29.3 శాతం నుంచి 26.1 శాతానికి తగ్గింది. నికర లాభం 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. షేరు స్వల్ప లాభంతో ముగింపుత్రైమాసిక ఫలితాల అనంతరం కోల్ ఇండియా షేరు ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.02 శాతం పెరిగి రూ.427.50 వద్ద స్థిరపడింది. ఇదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 0.96 శాతం లాభపడింది. రోజంతా కంపెనీ షేరు రూ.425.75 నుంచి రూ.431.00 మధ్య ట్రేడైంది. ప్రారంభంలో రూ.429.50 వద్ద ప్రారంభమైన షేరు, అంతకుముందు ముగింపు ధర రూ.427.40గా ఉంది.



## నాలుగురెట్లు పెరిగిన బిలియనీర్ టాక్స్ పేయర్లు

**న్యూఢిల్లీ,జులై 27:** దేశంలో యేడాదికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటిస్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. ఈ సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.100 కోట్లకు మించి వార్షిక ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య 576కు చేరిందని తెలిపారు. 2021-22లో ఈ సంఖ్య 142 మాత్రమే ఉండేదని చెప్పారు. అంటే ఐదేళ్ల వ్యవధిలో దాదాపు 300 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. 2022-23లో ఈ సంఖ్య 301కు చేరగా, తర్వాత ఏడాది స్వల్పంగా తగ్గి 284గా నమోదైంది. ఆ తర్వాత 2024-25లో 415కు పెరిగి, గత యేడాది 576కు చేరింది.

ఆదాయపు పన్ను చట్టం 2025లో బిలియనీర్ అనే పదానికి ప్రత్యేక నిర్వచనం లేదని కేంద్రం స్పష్టం చేసింది. అందువల్ల ఆదాయపు పన్ను రిటర్నుల్లో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటించిన వ్యక్తుల వివరాలను మాత్రమే అందించినట్లు పేర్కొంది. ఈ గణాంకాలు పన్ను రిటర్నుల ఆధారంగా సేకరించినవేనని వెల్లడించింది. దేశంలో ఆదాయ అసమానతలపై అడిగిన ప్రశ్నకు కూడా కేంద్రం సమాధానం ఇచ్చింది. హౌస్‌హోల్డ్ కన్సప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ అసమానత తగ్గినట్లు తెలిపింది. అలాగే 15 ఏళ్లు పైబడిన వారి నిరుద్యోగ రేటు 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ఉపాధి కల్పన, ప్రగతిశీల పన్ను విధానం, ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా సమ్మిళిత ఆర్థిక వృద్ధికి కృషి జరుగుతున్నట్లు కేంద్రం వివరించింది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్




## లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు..

**ముంబయి,జులై 27:** ముడి చమురు ధరల తగ్గుదల, ఐటీ షేర్ల ర్యాలీతో జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఐదు వరుస ట్రేడింగ్ సెషన్ల నష్టాలకు చెక్ పెడుతూ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, భౌగోళిక ఉద్రిక్తతలు సడలడం, తొలి త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. విదేశీ బ్రోకరేజ్ సంస్థలు ఐటీ రంగ రేటింగ్‌ను 'అండర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్' కు పెంచడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగిసి 23,995.95 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ లాభాలకు ఎటర్నల్ 5.61, ఇన్ఫోసిస్ 3.59, బజాజ్ ఫైనాన్స్ 3.57 ప్రధానంగా దోహదపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.13 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.34 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఇలో 2,259 షేర్లు లాభపడగా, 1,071 షేర్లు నష్టపోయాయి. 116 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 7.93 డాలర్లు 8.19 శాతం తగ్గి 88.85 డాలర్లకు చేరింది.విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.5300తో పోలిస్తే 95.9425 వద్ద ట్రేడైంది. ఎంసిఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 0.57 శాతం పెరిగి రూ.1,43,925కు చేరుకుంది. అమెరికా 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.94 శాతం తగ్గి 4.635 శాతానికి చేరింది.ఈ వారంలో వెలువడనున్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశంపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరిగింది. ఫెయిర్‌కెమ్ ఆర్గానిక్స్ త్రైమాసిక లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేయడంతో షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.లోధా డెవలపర్స్ సమీకృత నికర లాభం 103.36 శాతం పెరిగి రూ.1,372.1 కోట్లకు చేరడంతో షేరు 5.27 శాతం ఎగిసింది.ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్వతంత్ర నికర లాభం 37.03 శాతం పెరిగి రూ.795.95 కోట్లకు చేరడంతో షేరు 5.08 శాతం లాభపడింది. కెనరా బ్యాంక్ తొలి త్రైమాసికంలో నికర లాభం 2.19 శాతం పెరిగి రూ.4,856 కోట్లకు, మొత్తం ఆదాయం 4.26 శాతం పెరిగి రూ.39,684 కోట్లకు చేరడంతో షేరు 1.08 శాతం పెరిగింది.శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ స్వతంత్ర నికర లాభం 96.89 శాతం పెరిగి రూ.33.59 కోట్లకు చేరడంతో షేరు 3.42 శాతం ఎగిసింది.జెన్ టెక్నాలజీస్ సమీకృత నికర లాభం 27.83 శాతం తగ్గి రూ.34.46 కోట్లకు చేరడంతో షేరు 5 శాతం పడిపోయింది. వేదాంత్ ఫ్యాషన్స్ షేరు 1.19 శాతం, జిందాల్ స్టీల్ షేరు 2.92 శాతం లాభపడ్డాయి. బిర్లా కార్పొరేషన్ సమీకృత నికర లాభం 3.20 శాతం తగ్గడంతో షేరు 5.42 శాతం క్షీణించింది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సమీకృత నికర లాభం 27.78 శాతం పెరిగి రూ.426.98 కోట్లకు చేరడంతో షేరు 1.84 శాతం పెరిగింది.ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ నికర లాభం 28.98 శాతం పెరిగి రూ.130.12 కోట్లకు చేరినప్పటికీ షేరు 2.01 శాతం నష్టపోయింది.

## సిఇఒ, సిఎఫ్ఒకు జరిమానా




**ముంబయి, జులై 27:** దేశంలోనే ప్రైవేటుబ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశిధర్ జగదీశన్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసన్ వైద్యనాథన్ లపై రూ. 1 లక్ష చొప్పున జరిమానా విధించింది. రిటైల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రాపై కూడా ఇదే మొత్తంలో జరిమానా వేసింది. ఈ మేరకు సోమవారం నాడు బ్యాంక్ ఒక ప్రకటన విడుదల చేసింది. మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి డిపాజిట్లను సమీకరించే విషయంలో జరిగిన అవకతవకలపై బ్యాంకు అంతర్గత విచారణ చేపట్టింది. 2017, 2021 సంవత్సరాల్లో జరిగిన ఈ డిపాజిట్ల సమీకరణపై స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన ప్రత్యేక క్రమశిక్షణా కమిటీ దర్యాప్తు నిర్వహించింది. ఈనెల 23న జరిగిన బోర్డు సమావేశంలో ఈ కమిటీ నివేదికను సమీక్షించారు. సంబంధిత అధికారుల ప్రవ ర్తన వ్యాపార పరిధిని దాటడం కిందకు వస్తుందని, ఇందులో ఎలాంటి దురు ద్దేశం లేదా వ్యక్తిగత లాభం లేదని బోర్డు నిర్ధారణకు వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదనే ఉద్దేశంతో, కమిటీ సిఫార్సుల మేరకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఉన్నతాధికారులకు జరిమానాతోపాటు హెచ్చరిక లేఖలు జారీచేసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులకు కూడా హెచ్చరిక లేఖలు ఇచ్చింది. విచారణ ఫలితాలను ఆర్‌బీఐకి తెలియజేయాలని బోర్డు ఆదేశించింది.




## టాటా గ్రూప్ ఆదాయం రూ.16.24 లక్షల కోట్లు
### నికర లాభం 52 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జులై 27:** టాటా గ్రూప్ సమగ్ర స్థాయిలో మరోసారి బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గ్రూప్ మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.16,24,030 కోట్లకు చేరగా, పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 51.9 శాతం పెరిగి రూ.1,70,525 కోట్లకు చేరిందని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వెల్లడించారు.టాటాగ్రూప్ సంస్థల హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ వార్షిక నివేదికలో వాటాదారులనుఉద్దేశించి చంద్రశేఖరన్ మాట్లా డారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల ప్రవాహం మధ్య కూడా టాటా గ్రూప్ అత్యుత్తమ ఆర్థిక ప్రదర్శన కనబర్చిందన్నారు.

టాటాసన్స్ ఆదాయం 9.1 శాతం పెరిగి రూ.42, 367 కోట్లకు, నికరలాభం 21.8 శాతంపెరిగి రూ.31,961 కోట్లకు చేరింద న్నారు. ఒక్కో షేరుకు రూ.1,10,717 తుది డివిడెండ్ చెల్లించాలని బోర్డు సిఫారసు చేసిందని, దీనికి వాటాదారుల ఆమోదం అవసరమని తెలిపారు. సంస్కరణలు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ ఫలితంగానే ఈ వృద్ధి సాధ్యమైందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా ఎదుగుతున్నటాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యాపారం కేవలం నాలుగేళ్లలోనే రూ.1,31,082 కోట్ల ఆదాయంతో గ్రూప్‌లో నాలుగో అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.